


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




సోమవారం | 2-12-2019 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 227 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 9.00 తదుపరి సప్తమి; నక్షత్రం: శ్రవణం ఉ. 11.44 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: సా.4.09-5.55; దుర్ముహూర్తం: మ.12.27-1.11, మ.2.39-3.23; అమృతఘడియలు: రా.2.46-4.32; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.33; సూర్యాస్తమయం: 5.36 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

## ఆ కలెక్టర్ల రూటే

# సెపరేటు!

**అధికార పార్టీకి జీ హుజూర్.. పని తక్కువ-పబ్లిసిటీ ఎక్కువ**

**అసలు పని మాని... సొంత పనులకు ప్రాధాన్యం**

**అధికార పార్టీ నేతలు చెబితేనే అపాయింట్‌మెంట్**

**సోషల్ మీడియాలో సొంత డబ్బాకు తాపత్రయం**

**జిల్లాలో పరిపాలన భారం అంతా జూనియర్లపైనే**



వారు జిల్లా కలెక్టర్లు... ప్రజల మంచి, చెడు, బాగోగులు చూడాల్సిన అత్యున్నత స్థాయి అధికారులు. కానీ, తాము చేయాల్సిన పని వదిలేసి, అధికార పార్టీ నేతలకు గులాంగిరీ చేస్తున్నారు. యథేచ్ఛగా సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. అధికార పార్టీ సోషల్ మీడియాను ప్రసన్నం చేసుకొని, సీఎం దృష్టిలో పడితే మంచి మార్కులు పడతాయన్న తాపత్రయంతో సొంత డబ్బా కొట్టుకుంటున్నారు.

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పనితీరు చూస్తే.. ఆ కలెక్టర్ల రూటే సెపరేటని స్పష్టమవుతుంది. పని తక్కువ ఉన్నా... పనితనం ఎక్కువగా కనిపించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకొని మరీ ఇద్దరు కలెక్టర్లు సొంత పబ్లిసిటీ చేసుకుంటున్నారు. మరో ఇద్దరయితే అధికారపార్టీ అధికార ప్రతినిధిని మించిపోయేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. తమను కలవాలంటే వైసీపీ నేతల అనుమతి తీసుకోవాలని, వారు ఫోన్‌చేసి చెబితేనే అపాయింట్‌మెంట్ అన్న రూల్ పాటిస్తున్నారు. వీరి తీరుతో అధికార పార్టీ నేతలు, జిల్లాస్థాయి అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా వీరి గురించి చర్చలే సాగుతున్నాయి. సీమకు చెందిన ఓ అధికారి ప్రజలకు చిక్కరు... దొరకరు. కావాలంటే సోషల్ మీడియాలో కనిపిస్తారు. ఇంకా బైక్ రైడింగ్ ఆసక్తి ఉంటే ఆయనతో పాటు లాంగ్ డ్రైవ్‌కు వెళ్లవచ్చు. అయితే దీనికో షరతు ఉంది. సోషల్

మిగతా 9వ పేజీలో...

### మంత్రితో వెళ్తేనే దర్శనం

ఉత్తరాంధ్రకు చెందిన ఓ కలెక్టర్‌ది ప్రత్యేకమైన శైలి. నాయకులకు తప్ప అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండరు. నాయకుల్లో కూడా అందరికీ కాదు. ఉత్తరాంధ్రకు చెందిన ఇద్దరు మంత్రులు, ఓ ఎంపీకి మాత్రమే ఆయన దొరుకుతారు. ఆయన క్యాంప్ ఆఫీసులోనే ఉంటారు. బయటకురారు. సమీక్షలయినా, సమావేశాలయినా అక్కడే. ఇది ఎవరో గిట్టనివారు చెప్పింది కాదు. సాక్షాత్తూ అధికార పార్టీ ఎమ్మెల్యేలే చెబుతున్నారు. మంత్రుల వెంట వెళ్తేనే తమకు కలెక్టర్ దర్శనమిస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆదివారం కడప జిల్లా రైల్వే కోడూరులో మాట్లాడుతున్న పవన్

# జగన్‌కు దమ్ము లేదు!

**హోదాపై మోదీని అడగలేరు**

**కొంతమందికే సీఎంలాగా వ్యవహరిస్తే జగన్‌రెడ్డి అనే పిలుస్తా**

**భారతి సిమెంట్స్‌పై ఉన్న శ్రద్ధ కడప ఉక్కుపై ఎందుకు లేదు?**

**సీమ సమస్యలకు ఇక్కడి నేతలే కారణం.. ప్రధానికి లేఖ రాస్తా**

**ఆవేదనలోని యువతకు దారి చూపుతా.. కడప టూర్‌లో పవన్**

రాజంపేట/రైల్వే కోడూరు, డిసెంబరు 1: ప్రత్యేక హోదా గురించి మోదీని అడిగే దమ్ము జగన్‌కు లేదని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. 22 మంది ఎంపీలున్న వైసీపీ... రాష్ట్ర సమస్యలపై పార్లమెంటులో ఎందుకు నిలదీయడం లేదని ఆయన ప్రశ్నించారు. రాయలసీమలో కరువు పరిస్థితులకు ఇక్కడి నేతలే కారణమని ఆరోపించారు. ఆదివారం కడప జిల్లా రైల్వే కోడూరులో రైతులతో పవన్ సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. ఈ ప్రాంత అధికార పార్టీ నేతల తోటలన్నీ పచ్చగా ఉన్నాయని, రైతుల భూములేమో బీడువారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రైతుల సమస్యపై

మిగతా 9వ పేజీలో...

# మొబైల్ మోత

**ప్రీపెయిడ్ చార్జీలు 50% వరకు పెంపు**

**3 నుంచి వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్**

**6 నుంచి రిలయన్స్ జియో వడ్డన**

**ఐదేళ్లలో మొదటిసారి చార్జీలు పెంచిన కంపెనీలు**




ప్రీపెయిడ్ మొబైల్ సేవల చార్జీలను పెంచుతున్నట్టు భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, రిలయన్స్ జియో ఆదివారం ప్రకటించాయి. పాపులర్ ప్లాన్ల ధరలను గరిష్ఠంగా 50 శాతం వరకు పెంచారు. మిగతా ప్లాన్ల ధరలను కూడా సవరించారు. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా పెంచిన ప్లాన్ల ధరలు ఈ నెల 3 నుంచి, జియో కొత్త ప్లాన్ల ధరలు 6 నుంచి అమల్లోకి రానున్నాయి. ఐదేళ్లలో మొదటి సారిగా కంపెనీలు చార్జీలను పెంచాయి. టెలికం కంపెనీలు తమ నష్టాలను పూడ్చుకునేందుకు చార్జీల పెంపు నిర్ణయాన్ని తీసుకున్నాయి.

8

# 'హిందుత్వ'ను వీడబోం



**ఫడణవీస్ బాధ్యత గల నాయకుడు**

**ఆయనతో స్నేహంగానే ఉంటా: ఉద్ధవ్**

**ప్రైవేటు ఉద్యోగాల్లో 80% స్థానికులకే**

**త్వరలోనే చట్టం: గవర్నర్ కోశ్యారి**

10

## నేరం గూగుల్‌ది!



మీడియా, గూగుల్‌పై చర్యలు

రాష్ట్రంలో అల్లర్లకు విపక్షాల కుట్ర

'యేసయ్య'పై టీటీడీ చైర్మన్ ఆరోపణ

'ఆంధ్రజ్యోతి'పై అక్కసు

2



## అమెరికాలో రోడ్డు ప్రమాదం

**విజయవాడ యువకుడు దుర్మరణం**

**మరో భారతీయ విద్యార్థి కూడా మృతి**

10



## ఆశ నిరాశల్లో రాజధాని రియల్టీ!

**భరోసా ఇవ్వని సీఎం ప్రకటన**

**సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టులపై 'ప్రకటన' తర్వాతే పెట్టుబడులు శ్రేయస్కరం**

**క్రయవిక్రయదారుల వెనుకంజ**

10

**టీ-ఆర్టీసీలో రిటైర్మెంట్ వయసు**

## 60 ఏళ్లకు పెంపు

**ఆత్మీయ సమావేశంలో ఉద్యోగులకు టీ-ముఖ్యమంత్రి కేసీఆర్ బొనాంజా**

11

**మహిళా ఉద్యోగులకు నైట్ డ్యూటీలు నో**

**వారికి ప్రసూతి సెలవు.. చైల్డ్ కేర్ లీవ్**

**కనీస చార్జీ 10.. టీ-ఆర్టీసీ చార్జీలు పెంపు**




## రాష్ట్ర పరిధిలోకి డీమ్డ్ వర్సిటీలు?

**ప్రైవేట్ వర్సిటీలు, డిగ్రీ కాలేజీలకూ వర్తింపు**

**ఉన్నత విద్య నియంత్రణ కమిషన్ చట్టానికి సవరణపై ప్రభుత్వం ముందుకు ప్రతిపాదన**

**వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సవరణకు చాన్స్**

**యూజీసీ నిబంధనలకు విరుద్ధం: విద్యావేత్తలు**




అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) పరిధిలో ఉండాల్సిన డీమ్డ్ వర్సిటీలను రాష్ట్ర చట్టం పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. దీనికి వీలు కల్పించేలా ఆంధ్రప్రదేశ్ ఉన్నతవిద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చట్ట పరిధిని మరింత విస్తరించాలన్న ప్రతిపాదన తాజాగా ప్రభుత్వం ముందుకు వచ్చింది. గత శాసనసభ సమావేశాల్లో చట్టబద్ధత లభించిన ఈ కమిషన్ పరిధిలోకి రాష్ట్రంలోని డీమ్డ్, ప్రైవేట్ యూనివర్సిటీలు, అన్ని డిగ్రీ కాలేజీలు కూడా వచ్చేలా సవరణ చేయాలని ప్రతిపాదనలొచ్చాయి. శాసనసభ శీతాకాల సమావేశాల్లో ఈ మేరకు చట్ట సవరణను ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. దేశంలోని డీమ్డ్ యూనివర్సిటీలు

మిగతా 9వ పేజీలో...




## ఇప్పటికింతే!

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఆఫీసులోనే!

10

**ఏప్రిల్ నాటికి కనీసం లక్ష డాక్యుమెంట్ల లక్ష్యం**

**'తెల్లకాగితంపై డాక్యుమెంట్' నాణ్యత ఎంత?**



## సుబ్రహ్మణ్య షష్ఠి.. లౌకికం, పారమార్థికం



పరంజ్యోతి



దేవతల ఆవిర్భావం ఎప్పుడూ ఏదో ఒక అద్భుతమైన సందర్భంతో ముడివడి ఉంటుంది. అలాగే శ్రీ సుబ్రహ్మణ్య జననం కూడా. కశ్యప ప్రజాపతి భార్యలలో ఒకామె దనువు. దానవులందరూ ఆమె సంతానం. ఆమె కుమారులలో ఒకడు వజ్రాంగుడు. అతని భార్య వరాంగి. వారి కుమారుడు తారకాసురుడు. అతడు ఘోర తపస్సు చేసి.. బ్రహ్మ సృష్టిలో తనను ఓడించగలిగినవాడు ఉండకూడదని, శివుడి వీర్యం నుంచి ఉద్భవించినవాడి చేతిలో తాను మరణించాలని బ్రహ్మ నుంచి వరం పొందాడు. ఆ వరగర్వంతో అతడు విజృంభించాడు. తనను సంహరించేవాడు లేకపోవడంతో తారకాసురుని దౌర్జన్యానికి హద్దు లేకుండా పోయింది. సమస్త లోకాలనూ పాదాక్రాంతం చేసుకున్నాడు. మరోవైపు.. దక్షయజ్ఞంలో దేహత్యాగంచేసిన సతీదేవి వియోగంతో పరమశివుడు హిమాలయ పర్వతాలలో తపస్సు చేసుకుంటున్నాడు. సతీదేవి.. మేనాహిమవంతుల కుమార్తెగా పుట్టింది. నారద మహర్షి, సప్తర్షుల ప్రమేయంతో శివపార్వతుల కళ్యాణం జరిగింది. వారిరువురూ ఏకాంతంలో ఉండగా దేవతలచే పంపబడిన అగ్ని.. చిలుక రూపంలో వారిచెంతకు చేరి, తారకాసురుని సంహరించే మహానుభావుని అనుగ్రహించమన్నాడు. సాక్షాత్తు పార్వతీగర్భం నుండి తనయుడు పుడితే.. అతడు ఉన్న విధాతను తొలగించి తాను విధాత కావాల్సి వస్తుంది. అందుకని శివుడు తన తేజస్సును అగ్ని ముఖంలో ఉంచాడు. కొన్ని దివ్య సంవత్సరాలు అగ్ని ఆ తేజస్సును తాను మోసి గంగానదిని చేరి జరుగవలసిన విషయమును తెలిపి ఆ తేజస్సును ఆ నదిలో విడిచి పెట్టాడు. అక్కడి నుంచి గంగ కొంత కాలం ఆ తేజస్సును భరించి రెల్లు పొదల్లో విడిచిపెట్టింది. ఆ శివ తేజస్సును చూసి అగ్ని అని భ్రమించి.. శీతవేళ చలికాచుకోదలచిన అరుంధతి తప్ప మిగిలిన సప్తర్షి పత్నులు ఆరుగురూ ఆ శివతేజస్సును గ్రహించి గర్భవతులై ఆరు మోముల కుమారునకు జన్మనిచ్చారు. ఒకేసారి ఆ ఆరుగురి తల్లుల (షట్ కృత్తికల) స్తన్యమును గ్రోలి కార్తికేయుడు అనే పేరును పొందాడు ఆ శిశువు. వెంటనే తనను తాను నాలుగు మూర్తులుగా విభజించుకొని.. కుమారుడనే రూపంలో శివుని ఆరాధించాడు. విశాఖుడు అనే రూపంలో పార్వతీ మాతను సేవించాడు. శాఖుడనే పేర గంగను ఉపాసించాడు. నైగమేయుడు అనే పేరున అగ్నిని ఆనందపరిచి అగ్ని పుత్రుడైనాడు. వెంటనే ఇంద్రాది దేవతలు కురుక్షేత్రంలో అతనిని దేవసేనానిగా అభిషేకించారు. అగ్ని శక్త్యాయుధాన్నిచ్చాడు. వరుణాదులందరూ తమ తమ ఆయుధాలను అతనికి ఇచ్చారు. తేరిపారి చూడలేని తేజస్సు కలిగిన ఆ మహామూర్తి.. అనంత దేవసైన్యంతో, ప్రమథగణాలతో తారకాసురుని పై దండెత్తి అతనిని మహా సంగ్రామంలో సంహరించాడు.

అదే రోజున (షష్ఠి తిథినాడు) మార్గశిర మాస స్వరూపిణి అయిన, ప్రకృతి స్వరూపిణి అయిన దేవసేనను పత్నిగా స్వీకరించమని విష్ణువు కుమారునికి సూచించాడు. విష్ణువు మాట మేరకు దేవసేనా దేవిని కుమారస్వామి పరిణయమాడాడు. తాను సుబ్రహ్మణ్యుడు అయ్యాడు. ఆ తల్లి షష్ఠీ దేవిగా ప్రసిద్ధి చెందింది. వారి పరిణయ దినోత్సవమే సుబ్రహ్మణ్య షష్ఠి. మార్గశిర మాసంలోని పండుగలలో గొప్ప పండుగ ఈ సుబ్రహ్మణ్య షష్ఠి. సంతానం కావల్సినవారు మార్గశిర మాసంలో శుక్ల పక్షంలో ఈ షష్ఠి నాడు నియమపూర్వకంగా షష్ఠీదేవిని పూజిస్తే మంచి సంతానాన్ని పొందుతారు. ఈ రోజున శ్రీ సుబ్రహ్మణ్య ఉపాసన చేస్తే అన్ని కోరికలూ నెరవేరుతాయి. స్వచ్ఛమైన అధ్యాత్మ తేజస్సు కూడా పెరుగుతుంది.

**- ఆచార్య రాణి సదాశివ మూర్తి (నేడు సుబ్రహ్మణ్య షష్ఠి)**

# నేరం గూగుల్‌ది!



ఆంధ్రజ్యోతి పేపర్ చూపిస్తూ మీడియాతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో బసంత్‌కుమార్

తిరుపతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీటీడీలో అన్యమత ప్రచారం వెనుక ప్రతిపక్షాలు ఉన్నాయని, ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో మతకల్లోలాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. ఆదివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. టీటీడీ క్యాలెండర్ కోసం సెర్చ్ చేసినప్పుడు... తిరుమల అధికారిక వెబ్‌సైట్ సెర్చ్ సమాచారంలో 'శ్రీ యేసయ్య' అనే పదం కనిపించిన సంగతి తెలిసిందే. ఈ విషయం సోషల్ మీడియాతో పాటు అనేక పత్రికల్లో ప్రచురితమైనప్పటికీ.. ప్రత్యేకంగా 'ఆంధ్రజ్యోతి' పత్రికను చూపిస్తూ మాట్లాడారు. తప్పు గూగుల్‌ది అంటూనే.. దీని వెనుక విపక్షాలు, మీడియా కుట్ర ఉందని ఆరోపించారు. "స్వార్థ ప్రయోజనాల కోసమే ఆంధ్రజ్యోతి ద్వారా టీడీపీ తప్పుడు వార్తలు ప్రచురిస్తోంది. టీటీడీ పాలకమండలిపై కక్ష ఉంటే రాజకీయంగా ఏమైనా చేసుకోండి. అంతేగాని దేవుడిపై అసత్య ప్రచారం చేయొద్దు. మా వెబ్‌సైట్‌లో యేసయ్య ప్రచారం లేదు" అని తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా ప్రశాంతంగా ఉండడం ప్రతిపక్షాలకు ఇష్టంలేకనే ఆందోళన కలిగించాలని కుట్ర పన్నుతున్నారన్నారు. గూగుల్ సెర్చ్‌లో మాత్రమే 'యేసయ్య' అనే పదం కనిపిస్తోందని, టీటీడీ వెబ్‌సైట్‌లో అలాంటి అన్యమత పదాలు ఏమీ లేవని తెలిపారు. కుట్రపూరిత వార్తలను ప్రచారం చేసిన మాధ్యమాలతో పాటు గూగుల్‌పై కూడా చర్యలు తీసుకుంటామని సుబ్బారెడ్డి చెప్పారు. సమగ్ర విచారణకు ఆదేశించామన్నారు. త్వరలోనే టీటీడీలో ఇన్‌చార్జి ఎస్పీ స్థాయి అధికారితో సైబర్ క్రైం విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. అవాంఛిత ప్రచారాల వలన వెబ్‌సైట్ నుంచి టీటీడీ పంచాంగాన్ని తీసివేయాల్సి వచ్చిందన్నారు. అదంతా గూగుల్ సెర్చ్‌లో జరిగిందేనని, తమ వెబ్‌సైట్‌లోది కాదన్నారు.

### తప్పు జరిగిందని చెప్పడమే తప్పా!

ఔను! టీటీడీ చైర్మన్ దృష్టిలో అంతే! తప్పు జరిగిందని చెప్పడమే తప్పు, నేరం, ఘోరమైపోయింది! పైగా... తప్పు జరిగిందని చెప్పిన 'ఆంధ్రజ్యోతి'కి ఆయన కుట్ర సిద్ధాంతాలను ఆపాదించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తపై టీటీడీ చైర్మన్ స్పందించిన తీరు అందరినీ విస్మయపరిచింది. ఆయన చెప్పినట్లుగా... టీటీడీ అన్యమత ప్రచారానికి పాల్పడుతోందని ఆ వార్తలో ఎక్కడా లేదు. క్యాలెండర్ కోసం వెతికినప్పుడు సెర్చ్ సమాచారంలో 'శ్రీయేసయ్య' అనే పదం కనపిస్తోందని, దానిని ఎవరో ఉద్దేశపూర్వకంగా చేర్చారని మాత్రమే 'ఆంధ్రజ్యోతి' రాసింది. టీటీడీ విజిలెన్స్ దర్యాప్తుతో సరిపెట్టకుండా, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేస్తే తప్పు చేసిన వారెవరో కనుక్కోవచ్చని సూచించింది. వెంకన్న భక్తులు వ్యక్తంచేసిన ఆక్రోశాన్నే 'ఆంధ్రజ్యోతి' టీటీడీ దృష్టికి తీసుకొచ్చింది. ఈ విషయం తన దృష్టికి రాగానే సంబంధిత పేజీ ఓపెన్ కాకుండా బ్లాక్ చేసిందని, శనివారం రాత్రికి లింక్‌ను కూడా తీసివేయగలిగిందనే విషయాన్నీ తెలిపింది. అసలు విషయమేమిటంటే, పలు తెలుగు, ఆంగ్ల దినపత్రికలూ ఈ వార్తను ప్రచురించాయి. మరి.. 'ఆంధ్రజ్యోతి' పైనే టీటీడీ చైర్మన్‌కు ఎందుకంత అక్కసు? తప్పు జరిగిందని చెప్పడమే తప్పా!?

### ఏమో మాకేం తెలుసు!

- **లేఖ రాశాం.. 'అన్యమత' పదంపై ఇదీ టీటీడీ వైఖరి**

తప్పు ఎవరు చేశారనేది నిర్ధారించడం కాకుండా... తప్పును తమ దృష్టికి తెచ్చిన వారిదే తప్పు అన్నట్లుగా టీటీడీ పెద్దలు మాట్లాడారు. ఆయా అంశాలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు అస్పష్ట, అయోమయ, పరస్పర విరుద్ధమైన సమాధానాలు ఇచ్చారు. ఓ దశలో గూగుల్‌దే పొరపాటని చెప్పిన చైర్మన్, ఈవో... ఆ వెంటనే గూగుల్‌లో అలా జరగడం అంత సులువు కాదన్నారు. మరోసారి గూగుల్ పొరపాటు చేస్తే అందులో మా బాధ్యత ఏమిటని ప్రశ్నించారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో యేసయ్య ప్రస్తావన లేనప్పుడు.. పంచాంగాన్ని ఎందుకు తొలగించారన్న ప్రశ్నకు సమాధానం దాటవేశారు. పంచాంగాన్ని ఎనేబుల్ చేస్తే తిరిగి యేసయ్య పదాలు కనిపిస్తాయని వారే చెప్పారు. ఇలా మొత్తం పొంతన లేని సమాధానాలు, వివరణలతోనే మీడియా సమావేశం సాగింది.

**విలేకరులు:** అన్యమత ప్రచారంపై ఎప్పుడూ ఉద్దేశపూర్వకంగా రాయలేదు. సోషల్ మీడియాలో వైరల్ అయినపుడు, హిందూ సంఘాలు ఆందోళనలు చేసినపుడే వెలుగులోకి తెచ్చింది.

**చైర్మన్:** సోషల్ మీడియా, హిందూ సంఘాల అభ్యంతరాలకు మేము సమాధానం చెబుతూనే ఉన్నాం. శిలువ గురించి తప్పుడు ప్రచారం చేసిన నలుగురిపై కేసు కూడా పెట్టాం. బస్సు టికెట్ల వ్యవహారంలో కూడా బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేశాం. మళ్లీ 'ఆంధ్రజ్యోతి'లో రాయడమెందుకు?

**విలేకరులు:** యేసయ్య అన్న పదం గూగుల్ సెర్చ్‌లో ఉందా?

**చైర్మన్:** గూగుల్ సెర్చ్‌లో ఉంది. దానికీ మాకూ సంబంధం లేదు.

**ఈవో:** గూగుల్ సెర్చ్ రిజల్ట్సులో చూశారు. సెర్చ్ చేస్తే కనబడింది. లింక్ క్లిక్ చేస్తే లింకులో లేదు. గూగుల్ క్యాచ్ చేసి సేవ్ చేసి పెట్టి ఉండచ్చు.

**చైర్మన్:** దీంతో మాకు సంబంధం లేదు. గూగుల్‌కు లెటర్ రాశాం. గూగుల్‌లో అలా పెట్టడం అంత సులభం కాదు.

**విలేకరులు:** ఇటువంటి పొరబాట్లు జరగకుండా ఏం చేయలేరా?

**చైర్మన్:** మావల్ల పొరబాట్లు జరిగి ఉంటే రెక్టిఫై చేసుకుంటాం. కానీ దీంట్లో మా పొరబాటు లేదు కదా!

**విలేకరులు:** టీటీడీ పంచాంగంలో యేసయ్య ప్రస్తావన గురించిన సమాచారం గూగుల్ ఇచ్చిందా? లేక టీటీడీ ఐటీ వారిచ్చారా?

**ఈవో:** గూగుల్ వారు ఏం చేశారో మాకేం తెలుస్తుంది? సెర్చ్ ఇంజిన్లు ఎన్నో ఉన్నాయి. గూగుల్ డిస్‌ప్లేలో ఏ ఆర్టిఫీషియల్ లాగిన్ టూల్స్ వాడారో మేమెందుకు తెలుసుకుంటాం?

**చైర్మన్:** గూగుల్ వంటి కంపెనీలకు ప్రైవసీ కాపీరైట్స్ ఉంటాయి. వారికి లేఖ రాశాం. రిప్లై వచ్చాక ఏం చేయాలో చేస్తాం.

**విలేకరులు:** వెబ్‌సైట్‌లోకి వెళ్లాకే లింక్ ఉండాలి. ఇక్కడ డైరెక్ట్ లింక్ ఓపెన్ అయింది కదా!

**ఈవో:** మా అధికారిక వెబ్‌సైట్‌లో ఈ పదాలు లేవు కదా?

**విలేకరులు:** ఈరోజు మార్చేశారు.

**ఈవో:** మార్చేసింది వదిలేయండి. మా వెబ్‌సైట్ చూడండి. దాంట్లో లేదు. గూగుల్ ఇంటర్‌ప్రీట్ చేసే పదాలతో మాకు సంబంధం లేదు. మా సైట్‌లో పంచాంగాన్ని డిజేబుల్ చేసేశాం. తిరిగి ఎనేబుల్ చేస్తే మళ్లీ ఆ పదాలు కనిపించొచ్చు.

**విలేకరులు:** ఇది టీటీడీ ఐటీ విభాగం వైఫల్యం కాదా?

**ఈవో:** ఐటీ విభాగానికి ఏం సంబంధం?

**చైర్మన్:** గూగుల్ సెర్చ్‌లో జరిగిన పొరపాటుకు మా ఐటీ విభాగం ఎలా బాధ్యత వహిస్తుంది?

**విలేకరులు:** గూగుల్‌ది పొరపాటని తెలిస్తే చర్యలు తీసుకుంటారా?

**చైర్మన్:** ఎవరిది పొరపాటైనా చర్యలు తీసుకుంటాం!

**విలేకరులు:** టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లోని గానామృత లహరి గ్రంథంలో శ్రీవారి కీర్తనల్లో యేసయ్య కీర్తనలు కనిపించాయి కదా! దానిపై ఇంతవరకూ ఏమీ తేల్చలేదు.

**ఈవో:** దానిపై కమిటీ వేశాం. మొత్తం 650 పుస్తకాలు పరిశీలించాలి. పరిశీలన జరుగుతోంది.

**విలేకరులు:** ఐటీ విభాగం అప్రమత్తంగా ఉండాలి కదా!

**చైర్మన్:** ఈవోకు చెప్పాం... ఇంతకుముందే సమీక్షించాం.

**విలేకరులు:** పంచాంగంలో ఏడు నెలలుగా యేసయ్య పేరు వస్తున్నా ఐటీ విభాగం గుర్తించలేదా?

**చైర్మన్:** ఏడు నెలలుగా ఎక్కడ ఉంది? కుట్రపూరితంగా ఇటీవలే పెట్టారు.

## తిరుమల పవిత్రత మంటగలుపుతున్నారు

- **శైలి మార్చుకోకుంటే జగన్ ప్రభుత్వం కనుమరుగు**
- **బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆనంద్‌సూర్య**

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం పవిత్రతను, ఆగమశాస్త్రం విలువలను మంటగలిపే విధంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య విమర్శించారు. తిరుమల ఏడుకొండలు కాదు రెండేనని జీవో తెచ్చిన వైఎస్సార్‌కి తగ్గ తనయుడిగా జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. తిరుమల బస్ టికెట్లపై అన్యమత ప్రచారం మొదలు టీటీడీ వెబ్‌సైట్‌లో క్రీస్తు బోధనల పుస్తకాలు అప్‌లోడ్ చేయడం, అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి నిధులు తగ్గించడం, తిరుమల ఆలయంపై మంత్రులు పరుష పదజాలంతో మాట్లాడుతూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని దుయ్యబట్టారు. తాజాగా టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లోని పంచాంగంలో 'శ్రీ యేసయ్య' అనే ఉంచడం భక్తులకు తీవ్ర మనస్తాపం కలిగిస్తోందన్నారు. టీడీపీపై పదేపదే ఆరోపణలు గుప్పించే మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు దీనికి ఏం సమాధానమిస్తారని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆనంద్‌సూర్య ప్రశ్నించారు. శ్రీవారి ఆలయ పవిత్రతను మంటగలిపిన వారంతా దేవుని శిక్షకు గురయ్యారన్నారు. ఇప్పటికైనా వ్యవహార శైలిని మార్చుకొని, అన్యమత ప్రచారాన్ని అడ్డుకోవాలని లేకుంటే హిందువులంతా సంఘటితమై పోరాటానికి దిగిన రోజున మీరు, మీ ప్రభుత్వం కనుమరుగవడం ఖాయమని హెచ్చరించారు.

### వాస్తవాలు రాసే పత్రికలపై కక్ష వద్దు

టీటీడీలో అన్యమత ప్రచారం ఇంటి దొంగల పనే. చిత్తశుద్ధితో విచారణ చేపడితే ఇంటి దొంగలు బయటికొస్తారు. టీటీడీ వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి పత్రికలపై నెపం వేయడం ఎంతవరకు సమంజసం? వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న పత్రికలపై కక్షపూరిత ధోరణి సరికాదు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయి. టీటీడీలో అన్యమతస్తులను ఉద్యోగం నుంచి తొలగించండి. బీజేపీ రెండు దశాబ్దాలుగా పోరాడుతూనే ఉంది. ఇలాగే ఉంటే పెద్దస్థాయిలో పోరాటం చేయాల్సి వస్తుంది.

*-భానుప్రకాశ్‌రెడ్డి, టీటీడీ మాజీ సభ్యుడు*

### తప్పించుకునేందుకే పత్రికలపై నెపం!

ఇటీవల పదేపదే హిందూ దేవాలయాలు, టీటీడీ లక్ష్యంగా అన్యమతస్తులు ఆక్షేపణీయమైన కార్యక్రమాలు చేస్తున్నారు. దీనికి ప్రభుత్వ తోడ్పాటు ఉందని భక్తులు అనుకుంటున్నారు. నివృత్తి చేయాల్సిన బాధ్యత టీటీడీ చైర్మన్, ఈవోలపై ఉంది. అలా చేయకుండా నెపం ఎవరిపైనో నెట్టేసి తప్పించుకునే ఆలోచన మంచిది కాదు. టీటీడీ వెబ్‌సైట్‌లోకి ప్రవేశించి అందులోని విషయాలను మార్చుచేసే పని 'ఆంధ్రజ్యోతి' ఎందుకు చేస్తుంది? అలా చేయగలిగితే టీటీడీ నిర్వహిస్తున్న ఆన్‌లైన్ దర్శనాలు, సేవా టికెట్ల మాటేంటి? వరుస వివాదాలకు టీటీడీ ఎందుకు కేంద్రం అవుతోంది? దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

*-సామంచి శ్రీనివాస్, బీజేపీ నేత*

### ఇంటిదొంగలను పట్టండి

టీటీడీ వెబ్‌సైట్‌ను ఏ విధంగా హ్యాక్ చేశారో విచారణ చేయండి. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలే తప్ప వాస్తవాలు వెలుగులోకి తెచ్చిన పత్రికలపై నిందలు వేయడం ఎంతవరకు సబబు? సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాతే కదా కథనాలు వచ్చాయి. గూగుల్ వెబ్‌సైట్‌లో పొరపాటు జరిగితే ఆన్‌లైన్ దర్శనాల సంగతేంటి? దీనిపై కమిటీని వేసి విచారణ చేయించండి. గతంలోనూ టీటీడీ ప్రచురణల్లో ఏసుక్రీస్తు గేయాలు వచ్చాయి. తప్పు ఎక్కడ జరిగిందో చూడండి.

*-నవీన్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత*

### ప్రణాళిక ప్రకారమే అన్యమత ప్రచారం

టీటీడీలో ప్రణాళిక ప్రకారమే అన్యమత ప్రచారం జరుగుతోంది. టీటీడీలో హిందూ మతంపై దాడి జరుగుతోంది. అన్యమత ఉద్యోగులే ఇందుకు కారణం. వారిని వెంటనే తొలగించాలి.

*-పాండురంగ విఠల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు*

### అన్యమతస్థులను తొలగించాలి

టీటీడీలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను వెంటనే తొలగించాలి. టీటీడీతో పాటు అన్ని ఆలయాల్లోనూ అన్యమత ఉద్యోగులను తొలగించాలి. ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తాం.

*-జూపూడి రంగరాజు, బీజేపీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్*

## హిందూ ధర్మాన్ని జగన్ నాశనం చేస్తున్నారు

- **మతమార్పిడులను ప్రోత్సహిస్తున్నారు**
- **శారదా పీఠాధిపతి నోరు విప్పాలి**
- **త్వరలో అన్యమత ప్రచారాలపై ఉద్యమం**
- **సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద**



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న స్వామి శ్రీనివాసానంద సరస్వతి మహారాజ్

ఆశీల్‌మెట్ట (విశాఖ సిటీ), డిసెంబరు 1: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో హిందూ ధర్మాన్ని నాశనం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధు పరిషత్తు అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి మహారాజ్ మండిపడ్డారు. టీటీడీ వెబ్‌సైట్‌లో అన్యమత పేర్లు, చిత్రాలు, పాటలు ఉన్నాయని నిరసిస్తూ ఆదివారం విశాఖలో జీవీఎంసీ ఎదుట గాంధీ విగ్రహం వద్ద మోకాళ్లపై ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ అన్యమత ప్రచారాలు, క్రైస్తవ మతంలోకి చేర్పించడం ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఎంత ఎక్కువ మత మార్పిడి జరిగితే తనకు అన్ని ఎక్కువ ఓట్లు వస్తాయన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారన్నారు. హిందూ ధర్మ వినాశనానికి జగన్ పనిచేస్తున్నారని విమర్శించారు. జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో క్రైస్తవులు పేట్రేగిపోతున్నారని, హిందూ ఆలయాల వద్ద అన్యమత ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆలయాలకు దాతలు ఇచ్చిన భూములను అమ్మి, ఆ సొమ్మును చర్చిల్లో పనిచేసే వారికి పంచేందుకు పూనుకున్నారని చెప్పారు. జెరూసలేం యాత్రకు రూ.60 వేలు ఇస్తున్న ప్రభుత్వం, హిందువుల యాత్రలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడంలేదన్నారు. తిరుమలలో దర్శనం, వసతి అద్దె, ప్రసాదాల ధరలు విపరీతంగా పెంచేసి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేవారి సంఖ్య తగ్గించడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కలియుగ దైవంతో పెట్టుకున్నవారెవ్వరు బతికి బట్టకట్టలేదని, గతంలో కొందరు గాల్లో కలిసిపోయారని హెచ్చరించారు. జగన్ తీరు మార్చుకోకుంటే వేంకటేశుడు తగిన గుణపాఠం చెబుతాడన్నారు. జగన్ తీరుపై శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి నోరు విప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హిందూ సమాజంపై ఇంతలా దాడి జరుగుతున్నా ఆయన మౌనం వహించడం తగదన్నారు. త్వరలో అన్ని ఆశ్రమాలు, పీఠాధిపతులు, సాధువులు, హిందూ సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని, అన్యమత ప్రచారాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేస్తానని చెప్పారు.



### మేరీమాత విగ్రహానికి నిప్పు

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ఇడమకల్లులోని చర్చి ఆవరణలో ఉన్న మేరీమాత విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. విగ్రహానికి ఉన్న దుస్తులకు మంటలు అంటుకుని చాలావరకు కాలిపోయింది. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. పలువురు క్రైస్తవులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గిద్దలూరు సీఐ ఆదివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. **- గిద్దలూరు**

#### ఆడపిల్ల పుడితే

## అరిష్టమని..

- **ఏడు రోజుల పాపను చంపేసిన నాయనమ్మ**

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొడుకుకి మగపిల్లాడు పుట్టకపోతే తన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటుందని ఓ జ్యోతిష్యుడు చెప్పిన మాటలు ఆమె బలంగా నమ్మింది. తీరా ఆడపిల్ల అయ్యేసరికి అదికూడా నెలలు నిండకుండానే పుట్టేసరికి దురదృష్టంగా భావించి ఏడు రోజుల ఆ పసికందుని నాయనమ్మే చంపేసింది. బెంగళూరులో శుక్రవారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిక్కబనవర సమీపంలోని మేదరహళ్లిలో నివాసం ఉండే మార్షల్ గతేడాది డిసెంబరులో తన తల్లి పరమేశ్వరి (60) ఇష్టానికి వ్యతిరేకంగా తమిళ్‌సెల్వీని వివాహం చేసుకున్నాడు. దీంతో కొడుకు మీద కోపంతో పరమేశ్వరి ఇంట్లో నుంచి వెళ్లిపోయి తమిళనాడులో ఉంటోంది. అయితే.. తమిళ్‌సెల్వికి ప్రసవ సమయం దగ్గరపడడంతో ఆమెను చూసుకోవడానికి ఇటీవలే కొడుకు వద్దకు వచ్చింది. ఈ నేపథ్యంలో తమిళసెల్వి నెలలు నిండకుండానే గతనెల 22న ఆస్పత్రిలో ఆడపిల్లకు జన్మనిచ్చింది. దీంతో తీవ్ర నిరాశకు గురైన పరమేశ్వరి.. జ్యోతిష్యుడు చెప్పినట్టు తమ కుటుంబానికి ఆర్థిక కష్టాలు వస్తాయని భావించి ఆ పాపను ఎలాగైనా చంపేయాలని నిర్ణయించుకుంది. శుక్రవారం(నవంబరు 29) రాత్రి తమిళసెల్వి బాత్‌రూమ్‌కు వెళ్తూ పాపను పరమేశ్వరికి అప్పగించింది. నిమిషాల వ్యవధిలోనే పరమేశ్వరి ఆ చిన్నారిని ఒకటో అంతస్తు నుంచి కిందకు విసిరేసి ఆమె మృతికి కారణమైంది. పోలీసుల విచారణలో తానే పాపను హత్యచేసినట్టు పరమేశ్వరి అంగీకరించింది. ఆమెను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు.

### ఇంద్రాణి జగ్గారావు కన్నుమూత



విశాఖపట్నం, డిసెంబరు 1: విశాఖలోని ఏవీఎన్ కళాశాల చైర్‌పర్సన్, ప్రముఖ సామాజికవేత్త అంకితం ఇంద్రాణి జగ్గారావు(87) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. నెలరోజుల క్రితం ఇంట్లో బాత్‌రూమ్‌లో జారిపడడంతో ఆమె వెన్నెముకకు గాయమైంది. అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న ఇంద్రాణి.. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఇంద్రాణి జగ్గారావుకు ఇద్దరు కుమారులు. 1990లో ఏవీఎన్ కళాశాల కరస్పాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఇంద్రాణి ఎన్నో సంస్కరణలు అమలు చేసి కళాశాలను అభివృద్ధి దిశగా నడిపించారు. సామాజిక రంగంలోనూ ఆమె విశేష సేవలందించారు.




**ఉ**ల్లి ధరలు దిగిరావడం లేదు. రోజు రోజుకూ మరింత పెరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వం రైతు బజార్లలో కిలో రూ.25కే ఇస్తున్న రాయితీ ఉల్లి కోసం క్యూలైన్లు పెరిగిపోతున్నాయి. ఆధార్ నంబర్‌తో మనిషికి ఒక్క కిలో చొప్పున ఇస్తుండటంతో కొన్ని కుటుంబాల్లో ఇంటిల్లిపాదీ క్యూ కడుతున్నారు. క్యూలైన్లు చాంతాడంత పొడవుండటంతో ఓ పూటంతా పోతోందని కూలీలు వాపోతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పత్తేబాద రైతు బజారు వద్ద ఆదివారం భారీ క్యూ కనిపించింది. రైతుబజార్లతోపాటు రేషన్ షాపుల్లోనూ ఉల్లి అమ్మితే రద్దీ తగ్గే అవకాశం ఉంది. **- ఏలూరు టూటౌన్**

### లోకం తీరు



చూశావా వదినా... ఉల్లిదండ చేయించుకుని ఎలా బడాయి పోతోందో!

### చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 19.0 | 25.0 |
| గుంటూరు | 20.7 | 30.4 |
| విజయవాడ | 21.6 | 29.2 |
| ఒంగోలు | 23.7 | 25.7 |
| శ్రీకాకుళం | 26.5 | 32.2 |

### దక్షిణకోస్తాలో భారీవర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతం నుంచి బలంగా తూర్పుగాలులు వీస్తుండంతో తమిళనాడు దానికి ఆనుకుని రాయలసీమ, దక్షిణ కోస్తాలో పలు జిల్లాల్లో అనేకచోట్ల, ఉత్తరకోస్తాలో చెదురుమదురుగా ఉరుములతో వర్షాలు కురిశాయి. ఆదివారం సాయంత్రం అయ్యపురెడ్డిపాలెంలో పది, అల్లూరులో ఏడు, తడ, దగదర్తి, బోగోలులో ఆరు, సూళ్లూరుపేటలో ఐదు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా ఉరుములతో వర్షాలు కురుస్తాయి.



### ఆయనకు చికిత్స అవసరం

అధీర్ రంజన్ చౌదరి ఏమనుకుంటున్నారసలు? ప్రధాని మోదీ, అమిత్ షా చొరబాటుదార్లా? ఆయన మానసిక ఆరోగ్యం బావున్నట్లు లేదు. ఆయనకు వెంటనే చికిత్స చేయించాలి. దాని వల్ల వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనైనా పూర్తి మానసిక ఆరోగ్యంతో పాల్గొనగలుగుతారు.

**- జీవీఎల్ నరసింహారావు, బీజేపీ అధికార ప్రతినిధి**



### మీరే చొరబాటుదార్లు

చొరబాటుదార్లను దేశం నుంచి తరిమేస్తామని పదేపదే బెదిరిస్తున్నారు. అసలు, ఎవరు చొరబాటుదార్లు? ఈ దేశం ఎవడబ్బసొత్తూ కాదు. ఇది అందరిదీ. దీనిపైన అందరికీ సమాన అధికారం ఉంది. ఆ మాటకొస్తే, అమిత్‌షా, నరేంద్ర మోదీనే అసలు సిసలు చొరబాటుదార్లు. గుజరాత్ నుంచి ఢిల్లీలోకి చొరబడ్డారు.

**- అధీర్ రంజన్ చౌదరీ, కాంగ్రెస్ నాయకుడు**



### చక్కెర వ్యాధితో పురుషుల్లో వంధ్యత్వం

వాషింగ్టన్, డిసెంబరు 1 : మధుమేహం పురుషుల్లో వంధ్యత్వానికి ఓ కారణం అవుతోందని శాస్త్రవేత్తలు అంటున్నారు. చాలా సందర్భాల్లో చక్కెర వ్యాధిగ్రస్తుల పిల్లల్లోనూ డయాబెటిస్-1 లక్షణాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఏటా ఎంతోమంది మధుమేహులకు శారీరక వైకల్యం, అవయవ లోపాలు కలిగిన సంతానం కలుగుతున్నట్లు చెప్పారు. మధుమేహ బాధితులైన గర్భిణులకు గర్భస్రావం ముప్పు అధికమని, గర్భస్త దశలో వారి శిశువు ఎదుగుదలపైనా ప్రతికూల ప్రభావం పడుతోందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా రక్తంలో చక్కెర మోతాదును అదుపులో పెట్టుకోవచ్చన్నారు. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండటం, పొగాకు, మద్యం అలవాట్లను మానేయడం, వ్యాయామం, ధ్యానాలతో వంధ్యత్వం ముప్పు నుంచి తప్పించుకోవచ్చన్నారు.

### కాంతి తరంగాలతోనూ పనిచేసే 'మెమరీ' పరికరం

బెర్లిన్, డిసెంబరు 1 : ఇప్పటివరకు విద్యుత్ తరంగాలతో పనిచేసే మెమరీ కార్డులు, హార్డ్ డిస్క్‌లనే మనం వాడుతున్నాం. ఇందుకు అదనంగా కాంతి తరంగాలతోనూ సమాచారాన్ని నిర్వహించగల అధునాతన మెమరీ పరికరాన్ని(సెమీ కండక్టర్) జర్మనీ శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. ఫొటోనిక్, ఎలక్ట్రానిక్ పరిజ్ఞానాలు.. ఆర్గానిక్ లైట్ ఎమిటింగ్ డయోడ్(ఓఎల్‌డీటీ), మెటల్ ఆక్సైడ్ సెమీ కండక్టర్(ఎంవోఎస్) సాంకేతికతల మేళవింపుతో దీన్ని ఆవిష్కరించారు. దీనికి 'పిన్ ఎంవోఎస్' అని పేరుపెట్టారు. తనలో నిక్షిప్తమైన సమాచారాన్ని 104 సార్లకుపైగా రాబట్టగలగడంతో పాటు మార్పులు, చేర్పులు చేసే సామర్థ్యం దీని సొంతం.





## వైభవంగా పంచమితీర్థం

తిరుచానూరు, డిసెంబరు 1: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం పంచమితీర్థా(చక్రస్నానం)న్ని వైభవంగా నిర్వహించారు. తిరుమల నుంచి వచ్చిన శ్రీవారు సారెను అమ్మవారికి సమర్పించారు. స్నపన తిరుమంజనం చేశాక కుంభలగ్నంలో చక్రాత్తాళ్వార్లను పుష్కరిణిలో మునక వేయించారు. ఆ సమయంలో దాదాపు లక్షన్నర మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి ఆస్థానం అయ్యాక బంగారు తిరుచ్చిపై అమ్మవారు ఆలయ తిరువీధుల్లో ఊరేగారు. చివరగా.. ధ్వజావరోహణం శాస్త్రోక్తంగా నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కాగా.. అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం నారాయణస్వామి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే సీఎం జగన్ తరపున రూ.7లక్షల విలువైన 113 గ్రాముల అన్‌కట్ డైమండ్ నెక్లెస్‌ను అమ్మవారికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సమర్పించారు.



## ఆకట్టుకున్న ఆంధ్రజ్యోతి ఎడ్యుకేషన్ ఫెయిర్

అనంతపురం విద్య, డిసెంబరు 1( ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు నిర్వహించిన ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఎడ్యుకేషన్ ఫెయిర్ అనంతపురం జిల్లాలో ముగిసింది. అనంతపురంలో శని, ఆదివారాలు రెండు రోజుల పాటు ఏబీఎన్- ఆంధ్రజ్యోతి, బెంగళూరుకు చెందిన సైడ్‌వేస్ 6 సంస్థ ఆధ్వర్యంలో ఫెయిర్ నిర్వహించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ సత్యనారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎడ్యుకేషన్ ఈవెంట్ ఇంటర్ తర్వాత విద్యార్థులు ఏ కోర్సులు ఎంచుకోవాలోనన్న సందేహాలు నివృత్తి చేసుకోడానికి దోహదపడుతుందన్నారు. ఇష్టపడి కోర్సులు ఎంచుకుని, చదివితే ఐఏఎస్, ఐపీఎస్ మాత్రమే కాకుండా శాస్త్రవేత్తలుగా స్థిరపడవచ్చునన్నారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన 20 విశ్వవిద్యాలయాలు, కళాశాలలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి.

## నేడు గుంటూరులో సీఎం పర్యటన

▸▸ ఆరోగ్యశ్రీ విశ్రాంత భృతి పథకం ప్రారంభం



గుంటూరు, డిసెంబరు 1 (మెడికల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం గుంటూరులో పర్యటించనున్నారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో కొత్తగా ప్రవేశపెడుతున్న రోగుల విశ్రాంతి భృతి పథకాన్ని సీఎం ప్రారంభిస్తున్నారు. మొదట ప్రభుత్వ సమగ్రాస్పత్రిని సందర్శించిన ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులను సీఎం పరామర్శిస్తారు. వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో మధ్యాహ్నం 12 గంటలకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ కొత్త పథకానికి సంబంధించిన, కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలకు సంబంధించిన బ్రోచర్లు ఆవిష్కరిస్తారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో, మంత్రులు రోగుల విశ్రాంతి భృతి పథకం గురించి పది నిమిషాల పాటు మాట్లాడతారు. సభ ముగిసిన తర్వాత హెలికాప్టర్‌లో తాడేపల్లికి బయలుదేరుతారు. సీఎం పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు గుంటూరులో సోమవారం ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు.

## నేడు కర్నూలుకు చంద్రబాబు

▸▸ జిల్లాలో మూడు రోజుల పర్యటన

▸▸ వైసీపీ బాధిత కుటుంబాలకు పరామర్శ



కర్నూలు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సోమవారం కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్నారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఆయన జిల్లాకు చెందిన నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తారు. సోమవారం ఉదయం కర్నూలుకు చేరుకునే చంద్రబాబు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, డోన్, నందికొట్కూరు నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమీక్షలు నిర్వహిస్తారు. రెండో రోజున ఆళ్లగడ్డ, కోడుమూరు, ఆలూరు, పత్తికొండ, నంద్యాల నియోజకవర్గాలు, మూడో రోజున బనగానపల్లె, పాణ్యం, శ్రీశైలం, కర్నూలు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశమౌతారు. తన మూడు రోజుల పర్యటనలో భాగంగా వైసీపీ నాయకుల నుంచి వేధింపులు ఎదుర్కొంటున్న, అక్రమ కేసులతో ఇబ్బంది పడుతున్న టీడీపీ కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా కలుసుకుంటారు.

# ‘ఉపాధి’ భారం రాష్ట్రంపైనే!

### బకాయిల చెల్లింపునకు కేంద్రం విముఖం.. పెండింగుల్లేవని తేల్చిన మంత్రి తోమర్

▸▸ అడ్వాన్స్ చెల్లింపులు ఇక రానట్లేనని స్పష్టం

▸▸ వచ్చిన నిధులు ఖజానాకు జమచేసిన రాష్ట్రం

▸▸ గతంలో పనులు చేపట్టినవారికి మొండిచెయ్యి

▸▸ హైకోర్టును ఆశ్రయించిన సర్పంచుల సంఘం

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులు చెల్లింపులో కేంద్రం మోకాలడ్డుతోంది. ఏపీకి ఇవ్వాల్సిన మెటీరియల్, నిర్వహణ వ్యయం నిధులు ఇచ్చేశామని, బకాయిలు లేవని అడ్డంగా వాదిస్తోంది. బకాయిలపై రాష్ట్రం చేస్తున్న వాదన, కేంద్రం చెబుతున్న సమాధానాలతో అసలు ఏం జరిగిందో అర్థంకాని అయోమయం నెలకొంది. కేంద్రం నుంచి నిధులు వచ్చినప్పుడు పనులు చేసినవారికి ముందుగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి వచ్చిందంటున్నారు. వచ్చిన నిధులతో బకాయిదారులకు బిల్లులకు చెల్లించకుండా గతంలో రాష్ట్ర ఖజానా నుంచి ఉపాధి పథకానికి అప్పుగా ఇచ్చిన మొత్తాన్ని జమ చేసుకున్నారు. దీంతో ఇప్పటిదాకా కేంద్రం నుంచి నిధులొస్తే తమ బిల్లులొస్తాయని ఎదురుచూసినవారిలో ఆందోళన నెలకొంది. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, పార్కుల నిర్మాణం కోసం చేసిన అప్పులు తిరిగి చెల్లించలేక నలుగురైదుగురు స్థానిక ప్రజాప్రతినిధులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీంతో సర్పంచ్‌ల సంఘం నేతలు హైకోర్టును ఆశ్రయించారు.

### ముమ్మరంగా మెటీరియల్ పనులు

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం సద్వినియోగం చేసుకోవడంలో అప్పటి సీఎం చంద్రబాబు కృషి ఉంది.ప్రతివారం ఉపాధి సిబ్బంది నుంచి రాష్ట్రస్థాయి అధికారి వరకు టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహించి పనులు చురుకుగా జరిగేలా ప్రోత్సహించారు. అన్నీ శాఖలను ఈ పనుల్లో భాగస్వామ్యం చేస్తూ కన్వెర్జెన్స్ ద్వారా కొత్త ఒరవడి సృష్టించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేపట్టని విన్నూత్న కార్యక్రమాలు ఈ పథకం ద్వారా చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. కేంద్రం నుంచి నిధులు రావడం ఆలస్యమైతే రాష్ట్ర ప్రభుత్వం నుంచి సర్దుబాటు చేశారు. 2015-16 నుంచి 2018-19 వరకు పనులు ముమ్మరంగా జరిగాయి. ఈ పథకం ద్వారా వేతనాల పనులు, మెటీరియల్ పనులు 60:40 నిష్పత్తిలో నిర్వహించాల్సి ఉంటుంది. అంతకుమించి చేపడితే ఆ భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడుతుంది.

### బకాయిలపై కేంద్రానికి లేఖలు

2015-16, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో మెటీరియల్ నిష్పత్తికి మించి రాష్ట్రంలో పనులు నమోదయ్యాయి. దీనికి సంబంధించి నిధులు ఇవ్వాలంటూ గత ప్రభుత్వం కేంద్రానికి అనేక లేఖలు రాసింది. పనులు చేపట్టిన స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడి తట్టుకోలేక బిల్లులు చెల్లించాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. సీఎం చొరవ తీసుకుని రాష్ట్ర ఖజానా నుంచి అడ్వాన్స్‌గా రూ.1,143కోట్లు సర్దుబాటు చేశారు. అదేసమయంలో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ ఎంపీలు, బీజేపీ నాయకులు ఉపాధిలో అవకతవకలు జరిగాయని, మిషన్లతో పనులు చేశారని ఫిర్యాదులు చేశారు. కేంద్ర బృందాలు వచ్చి ఎన్ని తనిఖీలు చేసినా ఒక్క లొసుగు కూడా వెల్లడి చేయలేకపోయారు. రాష్ట్రంలో 2015-16లో 19.70కోట్ల పనిదినాలు, 2017-18 ఆర్థిక సంవత్సరంలో 21.53కోట్ల పనిదినాలు కల్పించారు. దానికి అనుగుణంగా మెటీరియల్ నిధులు వరుసగా రూ.1703కోట్లు, రూ.2645కోట్లు చెల్లించాలని రాష్ట్రం వాదించింది. ప్రతి కుటుంబానికి 100రోజులు మాత్రమే పనిదినాలు కల్పించాలని చట్టం పేర్కొంటోంది. దానికి అనుగుణంగానే మెటీరియల్ నిధులు ఖర్చు చేసుకోవాల్సి ఉంటుందని కేంద్రం పేర్కొంది. కరువు, గిరిజన మండలాల్లో ఒక్కో కుటుంబానికి అదనంగా 50రోజులు కలిపి మొత్తం 150 పనిదినాలు కల్పించారు. మన అధికారులు రాష్ట్రంలో చేపట్టిన మొత్తం పనిదినాలు లెక్కించి దానికి అనుగుణంగా 60:40 నిష్పత్తిలో మెటీరియల్ నిధులు చెల్లించాలని కేంద్రాన్ని కోరారు. అయితే కేంద్ర అధికారులు కరువు, గిరిజన మండలాలకు అదనంగా ఇచ్చిన 50 పనిదినాల వేతనాలు మాత్రమే ఇస్తామని, అందుకు అనుగుణంగా మెటీరియల్ నిధులు ఇవ్వబోమని తేల్చేశారు. అప్పటినుంచి ఈ వివాదం నడుస్తూనే ఉంది.

**పార్లమెంట్‌లోనూ ఇదే సమాధానం**

ఉపాధి హామీ పథకంలో రాష్ట్రానికి రావాల్సిన రూ.2200కోట్లపై వైసీపీ రాజ్యసభ విజయసాయిరెడ్డి శుక్రవారం రాజ్యసభలో ప్రశ్న వేశారు. మెటీరియల్ నిధులపై టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర వేసిన ప్రశ్నకు కేంద్రమంత్రి తోమర్ సమాధానమిచ్చారు. ఏపీకి రావాల్సిన మెటీరియల్, నిర్వహణ వ్యయం నిధులు చెల్లించామని, బకాయిలు లేవని తేల్చేశారు. దీంతో అడ్వాన్స్‌గా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిన నిధుల గురించి ఇక కేంద్రాన్ని అడిగే పరిస్థితి లేకుండా పోయింది. ఆ భారం రాష్ట్ర ప్రభుత్వం భరించక తప్పదని తేలిపోయింది. ఇక కేంద్రం నుంచి రావాల్సిన ఉపాధి నిధులేమీ లేవని కూడా స్పష్టమైంది.

## ఎంత పనిచేశావమ్మా!

▸▸ రైలుకింద పడి ఇద్దరు కుమార్తెలతో తల్లి ఆత్మహత్య



ఇద్దరు కుమార్తెలతో పోలేరమ్మ(ఫైల్)

అనంతపురం రైల్వే, డిసెంబర్1 : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు ఓ కుటుంబాన్ని కకావికలం చేశాయి. ఓ తల్లి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ హృదయ విదారక సంఘటన అనంతపురం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీలోని జాకీర్ కొట్టాలలో వెంకటేష్, తన భార్య పోలేరమ్మ(39), కుమార్తెలు ఆర్తి(17), దీప(14)లతో కలిసి నివాసముంటున్నారు. వెంకటేష్ దినసరి కూలీ కాగా, పోలేరమ్మ ఇళ్లల్లో పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పెద్ద కుమార్తె ఆర్తి నర్సింగ్ శిక్షణ తీసుకుంటోంది. చిన్న కుమార్తె బుద్ధిమాంద్యురాలు. భార్యాభర్తల సంపాదన కుటుంబ పోషణతో పాటు పెద్ద కుమార్తె కోచింగ్‌కు సరిపోయేది కాదు. ఈ క్రమంలో భర్తకు తెలియకుండా పోలేరమ్మ అప్పులు చేసింది. ఆ అప్పులు వడ్డీతో కలిపి అధికమయ్యాయి. దీంతో భర్తకు తెలియకుండా ఇటీవల తన బంగారు నగలు కుదవపెట్టి కొందరి అప్పులు తీర్చింది. ఈ విషయం భర్తకు తెలిసి నిలదీశాడు. శనివారం ఈ విషయమై భార్యాభర్తల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. వెంకటేష్ ఆమెపై చేయి చేసుకున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన పోలేరమ్మ ఇద్దరు కుమార్తెలను తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. అలా వెళ్లిన ఆ ముగ్గురూ ఆదివారం ఉదయం రాజీవ్ కాలనీ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై విగతజీవులుగా పడి కనిపించారు..

## అప్పులబాధతో చేనేత కార్మికుడు బలవన్మరణం

ధర్మవరం, డిసెంబరు 1: అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం అనంతపురం జిల్లా ధర్మవరంలో చోటుచేసుకుంది. ధర్మవరానికి చెందిన చేనేత కార్మికుడు సురువు వెంకటరాముడు(52) ఓ మాస్టర్ వీవర్ దగ్గర కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించక దాదాపు రూ.5 లక్షల దాకా అప్పు చేశాడు ఈ అప్పుకు వడ్డీలు పెరగడం అతడిని తీవ్రంగా కలచివేసింది. అదే సమయంలో రుణదాతల ఒత్తిడి పెరిగిపోవడంతో అప్పులు తీర్చలేమని మనస్తాపానికి గురై వెంకటరాముడు ఆదివారం ఉరేసుకున్నాడు.

## గొట్టిపాటి క్వారీల్లో తనిఖీలు ముమ్మరం

బల్లికురవ, డిసెంబరు 1: ప్రకాశం జిల్లా బల్లికురవ మండల పరిధిలోని ఈర్లకొండ వద్ద ఉన్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు సంబంధించిన గ్రానైట్ క్వారీలపై విజిలెన్స్, మైనింగ్ శాఖ దాడులు మరింత ముమ్మరమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అధికారులు సెలవు రోజైన ఆదివారం కూడా మూకుమ్మడిగా క్వారీల్లో సోదాలు చేశారు. రవికుమార్‌కు చెందిన గోరంట్ల అంకమ్మచౌదరి, సాయిలక్ష్మి గ్రానైట్ క్వారీల్లో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ తనిఖీలు చేశారు. క్వారీల హద్దులను మరోసారి కొలతలు తీశారు. ఇప్పటి వరకూ వెలికి తీసిన రాయికి సంబంధించిన వివరాల రికార్డులను పరిశీలించారు. లోపాలను గుర్తించేందుకు అనుభవం ఉన్న అధికారులను రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఈ తనిఖీలు ఇంకా ఎన్ని రోజులు కొనసాగుతాయోనన్న చర్చ నడుస్తోంది.

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF A.P.LIMITED
Corporate Office : H.No.19-13-65/A, Srinivasapuram, Tiruchanoor Road, Tirupati - 517503
Tender Notice (eprocure.gov.in) No.CGM/Projects/06/2019-20,Dt.02.12.2019
Bids through "eprocure.gov.in" are invited from the eligible bidders under World Bank Funding towards erection, testing & commissioning of 27 Nos Indoor/ outdoor Sub stations in Vijayawada, Guntur & Tirupati cities on turnkey basis.
The tenders will be made available from 02.12.2019, 18:00Hrs in the Central Public Procurement Portal www.eprocure.gov.in.
CHIEF GENERAL MANAGER/ PROJECTS



నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న రూరల్ ఎస్పీ విజయరావు, పక్కన డీఎస్పీలు

# అమాయకుల ఆస్తి కాజేయాలని..!

▸▸ ‘కిడ్నాప్, ఆస్తి రిజిస్ట్రేషన్’లో పది మంది అరెస్టు

▸▸ నిందితుల్లో కానిస్టేబుల్.. మరో ఇద్దరి కోసం గాలింపు

▸▸ 15 కోట్ల ఖరీదైన పొలం రిజిస్ట్రేషన్ వ్యవహారం

గుంటూరు, డిసెంబరు 1: అమాయకులైన ఓ కుటుంబాన్ని సినీ ఫక్కీలో కిడ్నాప్ చేసి రూ.15 కోట్ల ఖరీదైన రూ.6.33 ఎకరాల పొలాన్ని తమ వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న కేసుకు సంబంధించి పోలీసులు అరెస్టులతో తెరదించారు. అమరావతిలో అక్టోబరు 19 నుంచి 21 మధ్య జరిగిన కిడ్నాప్, అక్రమ నిర్బంధం, బెదిరింపులు, చివరికి ఆస్తుల రిజిస్ట్రేషన్ జరిగిన సంఘటన.. నెలా పది రోజులకు బాధితులు రూరల్ ఎస్పీ స్పందనలో ఫిర్యాదు చేయడంతో వెలుగు చూసింది. ఈ కేసులో పోలీసులు ఆదివారం పది మంది నిందితులను అరెస్టు చేశారు. నిందితులను గుంటూరు పోలీస్ కార్యాలయంలో రూరల్ ఎస్పీ విజయరావు ఆదివారం మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ధరణికోటకు చెందిన వడ్లమూడి రమేష్ బాబుకు భార్య, కుమారుడు(9వ తరగతి), కుమార్తె(బీటెక్) ఉన్నారు. తమ పని తాము చూసుకునే కుటుంబం వీరిది. ఈ నేపథ్యంలో వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి ఆస్తి కాజేయాలని ధరణికోటకే చెందిన చేకూరి వెంకటేశ్వరరావు పథకం రూపొందించాడు.

### విశ్రాంత అధికారిగా చెప్పుకొని...

రమేష్ బాబుకు మేనమామ అయిన హనుమంతరావుకు చెందిన పొలాన్ని కౌలుకు తీసుకొని సేంద్రియ పంటలు సాగు చేస్తామని వెంకటేశ్వరరావు వారికి ఫోన్ చేసి చెప్పాడు. తాను విశ్రాంత వ్యవసాయ శాఖ అధికారినంటూ రమేష్‌బాబుతో 20 రోజులుగా ఫోన్‌లో మాట్లాడుతూ పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో అక్టోబరు 19న రమేష్ బాబును అమరావతి పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని విష్ణు వైన్స్ వద్దకు రావాలని కోరాడు. రమేష్ బాబు అక్కడికి వెళ్లగా షెడ్‌లో నిర్బంధించాడు. తరువాత రోజు వెంకటేశ్వరరావు తన బంధువైన బచ్చుల నారయ్య సాయంతో హనుమంతరావును కూడా షెడ్‌లో నిర్బంధించారు. తర్వాత వారితో ఇంటికి ఫోన్ చేయించి పొలం దస్తావేజులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాలని చెప్పారు. అక్కడకు వెళ్లిన తరువాత రమేష్ బాబు కుమారుడిని కూడా కిడ్నాప్ చేశాడు. రమేష్ బాబు, హనుమంతరావులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చారు. బచ్చుల నారయ్య పేరుతో 2.7 ఎకరాలు, వెంకటేశ్వరరావు భార్య నాగ స్వరూప పేరుతో 1.75 ఎకరాలు, నాగ స్వరూప మేనమామ పత్తిపాటి వెంకటేశ్వర్లు పేరుతో 2.31 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించారు. ఆయా దస్తావేజుల్లో అమరావతి గోపాల్‌నగర్‌కు చెందిన నల్లబోయిన తిరుమలకుమార్, బొంతా శివకృష్ణ, బొంత బసవ శంకర్‌లతో సాక్షి సంతకాలు చేయించారు. తర్వాత, ఈ విషయం ఎవరికైనా చెబితే నీ కొడుకు, కూతుర్ని చంపుతామని రమేష్ బాబును నిందితులు బెదిరించారు. దీంతో నెలా పది రోజుల పాటు ఎవరికీ చెప్పుకోలేక ఆ కుటుంబం భయంతో కాలం గడిపింది. చివరికి ధైర్యం చేసి గత నెల 28న స్పందనలో రూరల్ ఎస్పీ విజయరావును కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలపై అమరావతి పోలీస్ స్టేషన్‌లో నిందితులపై కిడ్నాప్, బెదిరింపు, ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించి అమరావతి సీఐ ఎ.శివనాగరాజు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన చేకూరి వెంకటేశ్వరరావుతోపాటు షేక్ రషీద్, బండారుపల్లి జ్ఞానేశ్వరరావు, మరుసుగుండ్ల రవీంద్రరెడ్డి, అమరావతి చెందిన కానిస్టేబుల్ పెద్దబాబి, బచ్చుల నారయ్య, ఆయన కూతురు నాగ స్వరూప, పత్తిపాటి వెంకటేశ్వర్లుతోపాటు సాక్షి సంతకాలు చేసిన మరో ముగ్గురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు విజయరావు తెలిపారు. బొంతా బసవ శంకర్ పరారీలో ఉన్నాడన్నారు. కాగా కారు డ్రైవర్‌గా ఉన్న మరో నిందితుడు గుడిసె వినోద్‌కుమార్ ఇప్పటికే అరెస్ట్ అయి ప్రస్తుతం సత్తెనపల్లి సబ్ జైలులో ఉన్నాడన్నారు. నిందితులను కోర్టుకు హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. కానిస్టేబుల్ అయి ఉండి నిందితుల తరఫున కొమ్ముకాసిన పెద్దబాబిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు.



## పొడవైన పూల వీధి

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతి పొడవైన పూల వీధి(ఫ్లవర్ స్ట్రీట్)ని ప్రతిపాదిత భోగాపురం ఎయిర్‌పోర్టుకు సమీపంలోని ‘సన్ రే విలేజ్ రిసార్ట్’లో ఏర్పాటు చేశారు. దీనిని ఆదివారం ఉదయం నేవీ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవినాథ్ జైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేసిన పూల మొక్కల సందర్శన గొప్ప అనుభూతిని మిగులుస్తుందన్నారు. రిసార్ట్స్ ఎండీ వర్మరాజు (రాజాబాబు) మాట్లాడుతూ, దేశంలో అతిపొడవైన 1.5 కిలోమీటర్ల ‘పూలవీధి’ని విశాఖలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. వివిధ దేశాల నుంచి పూల విత్తనాలను రప్పించి, మొక్కలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. సుమారు 25 వేల కుండీల్లో 22 జాతులకు చెందిన 50 వేల పూల మొక్కలను ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం 400 మీటర్ల మేర ఏర్పాటు చేశామని, దశలవారీగా దీనిని 1.5 కిలోమీటర్లకు పెంచుతామని ఆయన తెలిపారు.



# కన్నడ సాహిత్యంలో 'గే'లు

**తెలుగు అధ్యయన శాఖ, బెంగుళూరు విశ్వవిద్యాలయం, సాహిత్య అకాడెమిల సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 8న "తెలుగు - కన్నడ కథా సాహిత్యం: ప్రపంచీకరణ నేపథ్యం" అంశంపై ఒక సాహిత్య సదస్సు జరిగింది. ఇందులో తెలుగు, కన్నడ సాహిత్యాల తరఫున ఆయా భాషల రచయితలు పాల్గొన్నారు. తనను తాను 'గే'గా ప్రకటించుకున్న కన్నడ రచయిత వసుధేంద్ర ఈ సదస్సులో పాల్గొని "కన్నడ సాహిత్యంలో 'గే'లు" అనే పత్రాన్ని సమర్పించారు. LGBT (Lesbian, Gay, Bi-Sexual, Transgender) ఇటీవల బాగా చర్చలోకి వస్తున్న అంశం. ఇద్దరు స్త్రీలు శారీరక సంబంధాన్ని కలిగివుంటే 'లెస్బియన్' అనీ, ఇద్దరు పురుషుల మధ్య సంబంధం ఉంటే 'గే' అనీ, స్త్రీ పురుషులిద్దరితోనూ సంబంధం కలిగి ఉంటే 'బై సెక్సువల్' అనీ, లింగమార్పిడి చేసుకుంటే 'ట్రాన్స్‌జెండర్' అనీ అంటున్నారు. ఈ సమూహాలు తమ స్వరాన్నీ, ఆలోచననీ వినిపించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో భాగంగా వసుధేంద్ర సమర్పించిన పత్రం ఆలోచనను, అవగాహనను కలిగించేదిగా ఉంది. ఆయన పత్రానికి నేను చేసిన అనువాదంలో కొంత భాగం ఇది.**

■ కె. ఆశాజ్యోతి
94496 72394

'గే' బతుకులోని వ్యథలను చిత్రిస్తూ ఇటీవల నేను రాసిన కథా సంపుటి "మోహనస్వామి"ని ఒక సాహితీ మిత్రుడికి ఇస్తే, "ఈ 'గే' వైరస్ అనే మహమ్మారి మనోళ్ళు ఇంగ్లండ్, అమెరికా దేశాలకు వెళ్ళినప్పుడు అటాక్ చేసిందా?" అని అమాయకంగా అడిగాడు. ఎటువంటి వ్యంగ్యం లేకుండా వచ్చిన ఆ ప్రశ్నకు తబ్బిబ్బయ్యాను. తరువాత ఏకాంతంలో ఆలోచిస్తే ఆ ప్రశ్న అడగడంలో తప్పులేదనిపించింది. సహజంగా కన్నడ సాహిత్యాన్ని మాత్రమే చదువుకున్న అతనికి 'గే' ప్రపంచ జ్ఞానమే లేదన్నది అత్యంత సహజమైన విషయం. సమాజంలో ఆ విషయం మాట్లాడడంపై నిషేధం వున్నప్పుడు ఇక ఏ వైపు నుండి అటువంటివారికి 'గే' ప్రపంచపు ఆలోచనలు అందుబాటులోకి వస్తాయి?

కన్నడ సాహిత్యంలో అక్కడ కొంచం, ఇక్కడ కొంచం 'గే'లను చిత్రించిన తీరు చదివినప్పుడు, అంత ఆరోగ్యకర వాతావరణం కనపడ లేదు. ఏ ప్రపంచం పట్ల మనకు అజ్ఞానం ఉంటుందో, దాని పట్ల మనం విపరీతమైన భయాన్నో లేదా విపరీతమైన భక్తినో పెంపొందించుకుంటాం. అల్ప సంఖ్యాకమైన 'గే' సమూహపు దైహిక వాంఛను అర్థం చేసుకుని, జీర్ణం చేసుకోవడం బహుసంఖ్యాక సమూహాలకు సాధ్యం కాకపోవడం వల్ల, కన్నడ సాహిత్యంలో 'గే'ల జీవితాన్ని వికృతంగానో, భయంకరంగానో చూపించారు. ఆ రకమైన శృంగారాన్ని పాపకార్యంగానో, పరిస్థితుల కారణంగా జరిగినదిగానో, ఇంకా మాట్లాడితే అది అసలు మనిషి చెయ్యవలసిన పని కాదనేసేంత వరకూ ఈ అంశాన్ని చిత్రించారు.

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత దివంగత శివరామ కారంత్ "మూకజ్జియ కనసుగళు" (మూగవ్వ కలలు) నవల నుండి ఈ చర్చను ప్రారంభించవచ్చు. ముసలి అవ్వకున్న అద్భుత శక్తి ద్వారా శిలా యుగం నుండి ఇప్పటిదాకా మానవ నాగరికత అభివృద్ధిని తెలిపే ఈ నవల- చివరలో మానవ నాగరికత పతనానికి నిదర్శనంగా 'గే' సంబంధ చిత్రణతో ముగుస్తుంది. సృష్టిలోని స్త్రీ-పురుష సంబంధం పరమ పూజ్యమైనదని చెప్పిన ముసలి అవ్వ, అదే సృష్టిలోని ఇద్దరు పురుషుల మధ్య ఉన్న శారీరక సంబంధాన్ని నీచంగా చూస్తుంది. "నీ ప్రవర్తన ముందు మార్చుకున్న తర్వాత మిగిలిన విషయాలు మాటాడు..." అంటూ తిరస్కార భావంతో అసహ్యించుకుంటుంది. మూగవ్వ అసహ్యించుకునేలా బాలుడితో ఒక వ్యక్తి దేహ సంబంధాన్ని కలిగి ఉండడం అన్నది కూడా ఇక్కడ సమస్య కాదని గ్రహించాలి. "స్త్రీతో ఆడవలసిన ఆటను మగవాడితో ఆడే వాళ్ళకు అంత అధిక ప్రసంగం ఎందుకు?" అన్న ప్రశ్నతో 'గే' వ్యక్తి జీవితంలోని హక్కులను మూలాలతో సహా లాక్కునేస్తుంది. శిలాయుగం నుండి మనిషి స్వభావం గొప్పదనే మూగవ్వ, ఈ 'గే' జనం ఈ రోజు కొత్తగా గలీజుగా పుట్టారని మాట్లాడడం తమాషాగా అనిపిస్తుంది.

కామరూపి రాసిన "కుదురె మొట్టె" (గుర్రపుగుడ్డు)లోనూ ఇంతకంటే ప్రత్యేకంగా ఏమీ రాయబడలేదు. ఈ నవలలో అత్యంత హీనమైన మనిషిగా పిలవబడే ఒక పాత్ర వికృతత్వాన్ని మరింత పెంచే ఉద్దేశంతో ఆ పాత్ర 'గే' అంటూ, అతడు చిన్న పిల్లవాడితో తన కోరిక తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని నవల తెలుపుతుంది. అన్ని సమూహాలలో ఉన్నట్టే 'గే' సమూహంలో కూడా మంచివాళ్ళూ, చెడ్డవాళ్ళూ ఉంటారు. అయితే అడపాదడపా సాహిత్యంలో చిత్రింపబడే 'గే' పాత్రకు బలవంతంగా 'వికృతి' లేపనం పూసే నవలా రచయితల ఉద్దేశం మనసుకు బాధ కలిగిస్తుంది. ఇలాంటి రచయితలు 'హోమోఫోబియా'తో సతమతమవుతున్నారని అర్థమవుతుంది.

కుం.వీరభద్రప్ప 'బెట్టదాచె' (కొండకవతల) కథ చివరలో కనబడే సన్నివేశం కూడా ఇటువంటి 'హోమో ఫోబియా' కలిగిన పాత్ర కథే. నక్సలైట్‌లు ఉండే అడవి మధ్యలోనికి ఒక రచయిత వెళ్ళి అక్కడ సాగుతున్న దురాగతాలను వివరించే కథ ఇది. ఈ కథలో పోలీసుల క్రూరత్వానికి పరాకాష్ఠగా, కథ చివరలో, ఒక పోలీసు తెలతెలవారుతున్న లేత వెలుగులో రచయితకు ఎదురుపడి, అతడి ఫాంటులో చెయ్యి పెడతాడు. అది చూసిన మరో పోలీసు "అతడు హోమోసెక్సువల్. అడ్జస్ట్ చేస్కో" అని బలవంతం చేస్తాడు. మండుటెండలో, పైగా వీధిలో జనమంతా చూస్తుండగా ఎవరో కొత్త వ్యక్తిని ఇబ్బందిపెట్టి కోర్కె తీర్చుకోవాలనుకోవడం గతి తప్పిన నడతకు చిహ్నం. ఈ రచయిత ప్రకారం ఇది ఏరకమైన హోమో సెక్సువాలిటీనో అర్థం కాదు.



పై మూడు కథల్లో 'గే' బాధను చిత్రించే ఉద్దేశం కానీ, వారి నిరంతర ఏకాంతంలోని దుఃఖాన్ని సానుభూతితో అర్థం చేసుకున్న మానవత్వం కానీ, తప్పనిసరై అందరికీ దూరంగా బతికేవారి వేదనలను తెలుసుకునే ఓర్పు కానీ కనబడదు. ఈ అల్ప సంఖ్యాకుల జీవన క్రమం తెలియని పాఠకులు ఇలాంటి కథలను చదివితే, 'గే'ని చూసి భయపడతారు. 'గే' అయిన పిల్లాడు ఈ కథలు చదివితే అవమానంతో మరింతగా తనలోకి తాను ముడుచుకొనిపోతాడు.

ప్రారంభంలో మన కథకుల్లో- 'గే' సెక్స్ అంటే స్త్రీ సంపర్కం లభించని సందర్భంలో, ఒక ఒత్తిడిలో, పురుషుడు చేసే ఒక క్షమించగలిగే శారీరక అపరాధం అన్న అభిప్రాయం ఉండేది. ఎప్పుడో రచయిత మాస్తి రాసిన 'ఆంగ్ల నౌక కాప్టన్' అన్న కథలో ఒక ఆంగ్లేయుడు భారత యువకుడితో పెట్టుకున్న శారీరక సంబంధ వివరాలున్నాయి. రెండేళ్ళ పాటు సముద్రయానం చేస్తూ ఉండడం, స్త్రీ సంపర్కం లేకపోవడం వంటి కారణాల వల్ల తన కింద పని చేసే యువకుడితో శరీర సంబంధం పెట్టుకున్నట్టు తనను ప్రశ్నించిన వాళ్ళతో చెబుతాడు ఆ ఆంగ్లేయుడు. అలా చెప్పడంలో అతనికి పాప భయం ఉంది. ఐతే అదో పెద్ద విషయం కాదని అంటాడు. అసహాయ స్థితిలోవున్న వ్యక్తి స్థితిని మానవీయ కోణంలో చూపించిన మాస్తి మన ప్రశంసకు పాత్రులవుతారు. "మాస్తి కన్నడ ఆస్తి" అనడం ఇంతటి హృదయ వైశాల్యానికే కావచ్చు.

యు.ఆర్. అనంతమూర్తి రాసిన 'క్లిప్ జాయింట్' కథలో కూడా హోమో సెక్సువాలిటీ గురించి కొంత ప్రస్తావన ఉంది. ఇంగ్లాడ్‌లోని స్టువర్ట్ తాను పాఠశాలలో చదివేటప్పుడు 'గే' అయ్యానని చెప్పుకుంటాడు. ఐతే, యూనివర్సిటీలో చేరాక, ఆడపిల్లల స్నేహంతో 'గే' సమస్య తొలగిపోయిందని చెప్పి, రోగానికి సరైన పరిహారం వెతకాలి అని సూచిస్తాడు. అంటే అనంతమూర్తి కూడా మాస్తి లానే ఆలోచిస్తున్నాడు. స్త్రీ సహవాసం లేక పురుషుడు మరో పురుషుడితో సంబంధాన్ని కోరుకుంటున్నాడు అని చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. అయితే 'గే' వ్యక్తులు ఇలాంటి ఆలోచనను అంగీకరించరు. అమ్మాయి దొరికిన తక్షణం పురుషుణ్ణి వదిలేసే 'ద్విలింగ' (బైసెక్సువల్) వ్యక్తులు చాలా అపాయకారులని, వారికి దూరంగా ఉండాలని 'గే'లు భావిస్తారు. క్లిప్ జాయింట్ కథలో ఒక మంచి అంశమేమంటే "హోమో సెక్సువాలిటీవల్ల ఒకరి జీవితం ఆనందమయమవుతుందంటే అటువంటి కోరికను రోగంగా భావించనక్కరలేదు" అని స్టువర్ట్ అభ్యుదయాత్మకంగా ఆలోచిస్తాడు. కథ రాసిన కాలం నాటి దృష్టికోణం నుంచి చూసినప్పుడు ఇంత ధైర్యంతో ఈ పాత్రచేత కథలో ఇలా మాట్లాడించగలిగిన అనంతమూర్తి గారి పట్ల గర్వంగా అనిపిస్తుంది.



**" 'గే'లకు సంబంధించిన శక్తివంతమైన రచన రావాలంటే 'గే' సముదాయం నుండి, ఆ రచయితల నుండే రావాలి. దళిత, స్త్రీ, ముస్లిం సాహిత్యాలు ఆయా సముదాయాల నుండి వచ్చాకే ఫలప్రదమయ్యాయని మనం మరచిపోకూడదు. ఆ దారిలోనే అంతే విలువైన 'గే', 'లెస్బియన్', 'హిజ్రా'ల సాహిత్యం రావలసిన ఆవశ్యకత ప్రస్తుతం కన్నడంలో ఉంది. అటువంటి సాహిత్యాన్ని చదవడానికి పాఠకులు విశాల మనోభావాలను పెంపొందించుకోవాలి. విమర్శకులూ అటువంటి రచనలను పాఠకుల అవగాహనలోకి తేచ్చేందుకు తగిన పరికరాలను, అంతేగాక ధైర్యాన్ని సమకూర్చుకోవాలి." - వసుధేంద్ర**

కన్నడ సాహిత్యంలో 'గే' ప్రపంచాన్ని మానవత్వ కోణంలో గౌరవంగా చూసింది దివంగత పి. లంకేశ్ అని నాకు అనిపిస్తుంది. వారి 'హుళిమావిన మర' (చింతచెట్టు) అనే ఆత్మచరిత్రలో తాను కొన్నిసార్లు అందమైన మగవాళ్ళను చూసి లైంగికంగా ఉద్రేకపడిన విషయాన్ని ఏ సంకోచం లేకుండా రాశారు. కన్నడ రచయితలు రాసుకున్న ఆత్మ చరిత్రలలో ఇటువంటి నిబద్ధత కనబడడం అరుదు. 'గే' అని ప్రచారం ఉన్న రచయితతో ఒక సందర్భంలో హోటల్లో ఒకే గదిలో పడుకోవలసి వచ్చినప్పుడు లంకేశ్ చాలా గాభరా పడతారు. ఐతే ఎటువంటి ఆటంకమూ లేకపోయినా ఆ రచయిత లంకేశ్ శరీరాన్ని తాకలేదు. లంకేశ్ క్రమేణా 'గే' సమూహం సహజమని తాను ఒప్పుకునే స్థితిని ప్రస్తావించారు. తనకు అత్యంత ఇష్టమైన రచయిత ఇ.ఎం. ఫార్స్టర్ ఒక 'గే' అని తెలిసినప్పుడు తనలో కలిగిన బాధను కూడా రాసుకున్నారు.

**కన్నడ సాహిత్యంలో అక్కడ కొంచం, ఇక్కడ కొంచం 'గే'లను చిత్రించిన తీరు చదివినప్పుడు, అంత ఆరోగ్యకర వాతావరణం కనపడ లేదు. ఏ ప్రపంచం పట్ల మనకు అజ్ఞానం ఉంటుందో, దాని పట్ల మనం విపరీతమైన భయాన్నో లేదా విపరీతమైన భక్తినో పెంపొందించుకుంటాం.**

గడిచిన ఒక దశాబ్దంలో కొత్త రచయితలు తమ కొన్ని కథలు, నవలల్లో 'గే' ప్రపంచాన్ని అత్యంత సహానుభూతితో చూసారు. మిత్రా వెంకట్‌రాజ్ తన 'హూవిన పూజె' (పువ్వుల పూజ) కథలో లెస్బియన్ సంబంధాన్ని వివరిస్తే, ఎం.ఆర్. దత్తాత్రి-గురుప్రసాద్ 'కాగినెలె' నవలతో (కాకి ఇల్లు) పాటు, తమ ఇటీవలి నవలల్లో 'గే' పాత్రను ధైర్యంగా, సహజంగా చిత్రించారు. సుధేశ్ శెట్టి అనే ఒక కొత్త యువకుడు రాసిన 'హెజ్జె మూడద హాది' (పాదముద్రలు లేని దారి) నవలలో 'గే' పాత్ర గుండె ధైర్యం కల పాత్రగా చిత్రింపబడింది. ఐతే ఒక విషయాన్ని గమనించాలి. 'గే' ప్రపంచాన్ని బయటి వాళ్ళు చిత్రించడంలో కుతూహలం, వైవిధ్యతే ఉంటున్నాయి తప్ప అది జీవితపు హక్కు అని చెప్పడం ఎక్కడా కనపడదు. పురుషుడు మరో పురుషుడితో చేసే శృంగారాన్ని వారి మనస్సు ఒప్పుకోదు. కాబట్టి 'గే'లకు సంబంధించిన శక్తివంతమైన రచన రావాలంటే 'గే' సముదాయం నుండి, ఆ రచయితల నుండే రావాలి. దళిత, స్త్రీ, ముస్లిం సాహిత్యాలు ఆయా సముదాయాల నుండి వచ్చాకే ఫలప్రదమయ్యాయని మనం మరచిపోకూడదు. ఆ దారిలోనే అంతే విలువైన 'గే', 'లెస్బియన్', 'హిజ్రా'ల సాహిత్యం రావలసిన ఆవశ్యకత కన్నడంలో ఉంది. అటువంటి సాహిత్యాన్ని చదవడానికి పాఠకులు విశాల మనోభావాలను పెంపొందించుకోవాలి. విమర్శకులూ అటువంటి రచనలను పాఠకుల అవగాహనలోకి తేచ్చేందుకు తగిన పరికరాలను, అంతేగాక ధైర్యాన్ని సమకూర్చుకోవాలి.

భారత దేశంలో దోపిడీ బహుముఖాలను చూసాం. దళితులపై దోపిడీ, స్త్రీలపై దోపిడీ, జాతులపై దోపిడీ వంటి విషయాలను సాహిత్యం విస్తృతంగా చర్చించింది. అయితే దోపిడీకి గురైన సమూహాలేవీ అనుభవించని దోపిడీని ఈ "లైంగిక అల్పసంఖ్యాకులు" అనుభవిస్తారు. ఉదాహరణకు దళిత వ్యక్తినే తీసుకుందాం. ఒక దళిత వ్యక్తికి తండ్రి, తల్లి, సోదరుడు, సోదరి- అంతా దళితులే. ఎందరో స్నేహితులు, బంధువులు దళితులే అయివుంటారు. ఐతే, హోమోసెక్సువల్ వ్యక్తికి ఆ అవకాశం లేదు. ఆ వ్యక్తి తల్లీ, తండ్రీ, సోదరుడు, సోదరి, బంధువులు, స్నేహితులు హోమోసెక్సువల్స్ కారు. ఒక 'గే' తన బాధనంతా తను ఒక్కడే అనుభవించాలి. ఈ కారణం చేత అతడిలో కలిగేంతటి మానసిక వేదనను ఈ నేలపై మరొకరు అనుభవించరు.

అందుచేత 'గే' సముదాయంలోని వ్యక్తులకు ఉన్న పెద్ద సమస్య ఏమిటంటే తనవాళ్ళు ఎవరో గుర్తించడం. ఎవరినైనా చూడటంతోనే వారి లైంగిక ఇచ్ఛ ఎటువైపో అర్థంకాదు కాబట్టి, పక్కింట్లోనే 'గే' యువకుడు ఉన్నా తెలీక 'గే' వ్యక్తి ఒంటరిగా బతుకుతాడు. ఈ నేపథ్యంలో డిజిటల్ విప్లవం ఈ సముదాయానికి తగినంత సాయం చేస్తోంది. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లు లేకపోయివుంటే ఈ సముదాయం ఇప్పటికీ చీకట్లోనే మగ్గిపోయి ఉండవలసి వచ్చేది.

■ వసుధేంద్ర

---



ఎక్కడా ఎవరూ లేరు
మీ భూముల్లో నిప్పు రవ్వలు ఎవరు నాటారు?
అమాయక హృదయాలలో ఈ అగ్నిని ఎవరు రగిలించారు?
నతమస్తకులై ప్రార్థించే ప్రార్థనలకు
ఏమాత్రం ఫలితం లేనట్టు
సంవత్సరంలో పన్నెండు నెలలూ
నిర్జీవమైన ఋతువే కొనసాగుతోంది
ఎవరో తోటమాలిగా ఉండి తోటలను తగలబెట్టారు
ఎవరో ఛత్రఛాయగా నిలిచి వసంతాలను కొల్లగొట్టారు
నిషాత్, చష్మాషాహి, దాల్, ఉల్లర్, షాలిమార్
తోటలన్నిటిలో ఆకురాలు కాలమే కొనసాగుతోంది
నీ నీటి ఊటల, కొండల, వాగుల, జలపాతాల
శాంతి సంపదలకు కొండచిలువలు కాపలా కాస్తున్నాయి
అందరూ నీ భూమిపైనున్న ఆకాశాన్ని కోరుకుంటారు
నీ చెట్లవేళ్ళను కుళ్ళబెట్టి కొమ్మల్లో తమగూడు కట్టుకోవాలనుకుంటారు
నీ నీళ్ళలో మృత్యుకారకమైన విషాన్ని ఎవరు కలిపారు?
నీ తోటలన్నిటినీ శ్మశానాలుగా ఎవరు మార్చారు?
తియ్యగా పాడే బుల్‌బుల్ పిట్టను ఎవరు బెదరగొట్టారు?
ఇంద్ర ధనుస్సులుండే నీ ఆకాశంలో ఈ పొగ ఎందుకు క్రమ్ముకొంటోంది?
నీ గొప్పతనాన్ని ఎరిగిన రాజుల ప్రతి జ్ఞాపకమూ విలపిస్తోంది
వేల సంవత్సరాల నీ చరిత్ర సిగ్గుపడుతున్నట్టుంది
ఏదైనా న్యాయం చెయ్యటానికి దైవ నిర్ణయం ఎందుకు ఆలస్యమవుతుందో!
పావన పురుషులైన నీ సూఫీలందరూ మౌనంగా ఎందుకున్నారో!
సూర్యునికి నీ మీద కోపమెందుకో!
వెన్నెలకు నీపై అలుక ఎందుకో!
నీ సరళత్వమే నీకు శత్రువయింది ఎందుకు?
నీ పక్షుల రోదనలో మళ్ళీ తియ్యటిపాట ఎవరు తెస్తారు?
నీ గాయపడిన పెదవులపై చిరునవ్వు ఎవరు వెలిగిస్తారు?
పాడుబడిన ఇండ్లలోకి శాంతిదూత జీవకళను ఎప్పుడు తెస్తుంది?
యువ మరణాల దుఃఖంతో ముడతలు పడ్డ ముఖాలలో
చిరునవ్వులు ఎప్పుడు పండిస్తుంది?
వృద్ధ కన్యల పాపిట్లలో ముత్యాలు ఎప్పుడు అలంకరిస్తుంది?
ఎక్కడా ఎవరూ లేరు, ఎవరూ లేరు, ఎవరు వస్తారు
కష్టసమయంలో నీతో స్నేహమెవరు చేస్తారు?
నా కశ్మీరు లోయా, నీ గాయాలపై లేపనం ఎవరు రాస్తారు?

ఉర్దూ మూలం ■ తరన్నుమ్ రియాజ్
తెలుగు అనువాదం ■ జె. భాగ్యలక్ష్మి

---

## "తీవ్ర విషాదం, గొప్ప ఆనందం కలిగించే కథలు, లోపలి మలినరక్తాన్ని శుభ్రంచేసే ప్రాణవాయువులాంటివి."

ఎం ఎస్ కె. కృష్ణజ్యోతి
పలకరింపు



**ఇటీవల విడుదలైన మీ కథాసంపుటి 'కొత్త పండగ'లో మీ మనసుకు బాగా నచ్చిన కథ ఏమిటి? ఎందుకు?**

ఒకటి కాదు, రెండు చెబుతాను. మొదటిది 'సముద్రపు పిల్లాడు'. ఇది ఎందుకు నచ్చుతుంది అంటే, ఈ కథ చాలా మంది పాఠకులని ఏడ్పించింది. దీనిని చదవాలంటే, ముందు పాఠకులు పిల్లవాళ్ళు అయిపోవాలి. చెట్టుతో, చెరువుతో, సముద్రంతో మాట్లాడగలిగినంత చిన్నవాళ్ళు అవ్వాలి. అచ్చం సముద్రపు పిల్లాడిలాగా. రెండవది 'తెల్ల మచ్చల నల్ల పంది'. ఇది అందర్నీ నవ్వించింది. నలుపు అనాగరికత! తెలుపు నాగరిక రంగు. నాగరిక తెల్లమచ్చలు అనువంశికంగా పొందిన నల్ల పంది, దాని ఆలోచన, జీవితం, ముగింపు, దీనినే ఒక కథగా రాశాను. తీవ్ర విషాదం, గొప్ప ఆనందం కలిగించే కథలు, లోపలి మలినరక్తాన్ని శుభ్రంచేసే ప్రాణవాయువులాంటివి.

**ఈ కథాసంపుటిలో 2015-2018 మధ్య రాసిన పదిహేడు కథలున్నాయి. కథా రచన వైపు మీ తొలి అడుగులు, ప్రభావం గురించి చెప్పండి?**

ఖదీర్ బాబు రాసిన 'పోలేరమ్మ బండ కథలు' నాకు ప్రేరణ. 'కాకి గూడు' పేరుతో మొదట ఒక కథ రాశాను. ఆ కథని చాలాకాలం ఏ పత్రికకూ పంపడానికి ధైర్యం చాలలేదు. పత్రికలో కథ అచ్చు కావాలంటే, అక్కడ మనకి తెలిసినవాళ్ళు ఎవరేనా ఉండాలి అనుకున్నాను. తరువాత 'సవారీ', 'నేను నా దయ్యం' కథలు రాసి రెండు పత్రికల చిరునామాలు సేకరించి ఏదైతే అదే అయ్యిందని పంపించేశాను. రెండూ ప్రచురణకు నోచుకున్నాయి. సిఫార్సులు అవసరం లేదు, మంచిగా కథ రాసి పోస్ట్ చేస్తే సంపాదకులు తప్పక వేస్తారు అని నమ్మకం వచ్చింది. మొదట్లో మూడు నాలుగు కుటుంబ కథలు వ్రాశాను. సారంగ లాంటి వెబ్ మాగజిన్ల వల్ల నా దృక్పథంలో కొంత మార్పు కలిగింది. ఎంచుకునే ఇతివృత్తానికి కొంత ప్రయోజనం ఉండాలి అనిపించింది. కథ, కథకుని మనసులోని బరువుని దించుతూ, ఆ భారాన్ని సమాజం పైన పెట్టాలి. కథలోని 'సమస్య' సమాజంలో ఉన్నంతవరకూ కథ వర్తమానం. సమస్య తీరిపోతే అది చరిత్ర అవుతుంది. ప్రయోగాత్మకంగా 'నేను తోలు మల్లయ్య కొడుకుని' కథ రాస్తే, అది చర్చనీయాంశం అయ్యింది. ఎగువ వర్గానికి చెందిన జగ్గయ్య పంతులి పేదరికం; చర్మకార వృత్తిలో ఉన్న మారయ్య లేమి, రాజకీయ భవిష్యత్తు గురించి ఆ కథ సూచ్యంగా మాట్లాడింది. ఈ మధ్యనే ఆర్థికంగా బలహీనంగా ఉన్న ఎగువ సామాజిక వర్గాలకి కేంద్ర ప్రభుత్వం కొన్ని సౌకర్యాలు కల్పించింది. కానీ, అతి ప్రత్యేకమైన రెండో సంగతి, వ్యవహారంలో 'దిగువ వర్గం'గా చెప్పబడుతున్న ప్రజానీకానికి సమాన రాజకీయ అవకాశాలు ఎప్పటికి దక్కబోతున్నాయి? అవి గనక దక్కితే ఆ కథతో ఇంక అవసరం లేదు. పిల్లలు ప్రధాన పాత్రలుగా ఉన్న షరీనా, డెవిల్ హౌస్, బొమ్మ కథలు కేవలం పెద్దలు చదవడానికి రాశాను. స్త్రీ సహజ అవసరాలను కూడా విలాసంగా అభివర్ణించిన దేశ ఆర్థిక విధానాన్ని నిరసిస్తూ 'ఒక దేశం - ఒక ధనమ్మ' కథ రాశాను. ఎప్పుడైనా మంచి ప్రేమ కథలు, సంపన్నుల సమస్యల కథలు రాస్తే బాగుంటుంది అని చూస్తాను కానీ, కుదరడం లేదు!




**కథ, కథకుని మనసులోని బరువుని దించుతూ, ఆ భారాన్ని సమాజంపైన పెట్టాలి. కథలోని 'సమస్య' సమాజంలో ఉన్నంతవరకూ కథ వర్తమానం. సమస్య తీరిపోతే అది చరిత్ర అవుతుంది.**

**కూతురిని కొట్టిన అల్లుడిని ఎలాగైనా కొట్టించాలనే పట్టపోళ్ళ లచ్చమ్మ కథ 'దురాయి'. ఈ కథ వెనక ప్రేరణ ఏమిటో చెప్పండి?**

నేపథ్యంగా పట్టపోళ్ళ సమాజాన్ని తీసుకున్నా, నిజానికి ఈ అంశం సార్వత్రికం. ప్రతి తరంలోనూ స్త్రీ శారీరక హింసకి లోను అవుతోంది. అనేకసార్లు స్త్రీలు తమ గౌరవం భంగం కావడాన్ని గ్రహించనుకూడా లేరు. కానీ, తమ తరువాతి తరాల ఆశక్తతని గమనిస్తారు. వేదన చెందుతారు. దానికోసం తమ పరిధిలో పోరాటం చేస్తారు. భర్త తనని కొట్టడం అతని హక్కుగా సంసారంలో స్త్రీ గుర్తిస్తుంది. కానీ, కూతుర్ని అల్లుడు కొడితే బాధ పడుతుంది. ఇలాంటి సందర్భాలని స్వయంగా చూసి, దానిని కథనం చేయాలనుకున్నాను. అందుకోసం, మనకి మామూలుగా పరిచయం ఉన్న సమాజాన్ని కాకుండా, భిన్నంగా ఉన్న సమూహాన్ని ఎన్నుకున్నాను. అక్కడి సంస్కృతి వేరు. చట్టం, అది అమలు అయ్యే విధానం కూడా వేరు. అయినా కూడా, స్త్రీ పరిస్థితి ఒకటే. రాజ్యాంగం మనకిచ్చిన హక్కులు నిరాదరణకు లోను అవుతున్నాయి. అనేకసార్లు ఉల్లంఘించబడుతున్నాయి. గాంధీజీ ప్రవచించిన 'గ్రామ స్వరాజ్య' రాజ్యాల్లో కూడా ఈ ఉల్లంఘన ఉంది అని చెప్పడానికి ఇది రాశాను. ఈ కథలో కొన్ని పట్టపు తెగకు చెందిన భాషా పద, వాక్య ప్రయోగాలు ఉన్నాయి. దేశం, భాష, సమాజం ఏది అయినా ఇప్పటికీ స్త్రీ ద్వితీయ శ్రేణిలోనే ఉంది. స్త్రీ పుటకే ఒక 'దురాయి'.

✆ 91107 28070

---

**కలేకూరి ప్రసాద్ 'సాహిత్య జాతర'**
కలేకూరి ప్రసాద్ 'సాహిత్య జాతర' కార్యక్రమం డిసెంబర్ 8 ఉ.10.30ని.లకు కంచికచర్లలోని మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుంది. సభలో కలేకూరి 'అంటరాని ప్రేమ' పుస్తకావిష్కరణ జరుగుతుంది. సభలో చల్లపల్లి స్వరూపరాణి, పింగళి చైతన్య, నామాడి శ్రీధర్, ఒమ్మి రమేష్, కోయి కోటేశ్వరరావు, అనంత్ తదితరులు పాల్గొంటారు. **- తంగిరాల సోని**

**'ఆశల గాలిపటాలు' కవితా సంపుటి**
సిహెచ్. ఆంజనేయులు కవితా సంపుటి 'ఆశల గాలిపటాలు' ఆవిష్కరణ సభ డిసెంబర్ 8 సా.6గం.లకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్‌లో జరుగుతుంది. కె. శివారెడ్డి, అమ్మంగి వేణుగోపాల్, పి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొంటారు. **- పాలపిట్ట బుక్స్**

**ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి జయంతి**
అప్పల నరసింహమూర్తి జయంతి సందర్భంగా డిసెంబర్ 10 సా.6గం.లకు విజయనగరం కేంద్ర గ్రంథాలయంలో సాహిత్య సభ జరుగుతుంది. **- ఎన్.కె. బాబు**

**కవితలకు ఆహ్వానం**
మల్లెతీగ పురస్కారం కోసం కవితలను ఆహ్వానిస్తున్నాం. ప్రధాన పురస్కారం రూ.5వేలు, మరో ఐదుగురికి తలో వెయ్యి ఆత్మీయ పురస్కారం. సామాజికాంశాల్ని స్పృశించే కవితలను చిరునామా: కలిమిశ్రీ, డోర్ నెం.41-20/3-24, మన్నవవారి వీధి, కృష్ణలంక, విజయవాడ- 520 013కు డిసెంబర్ 15లోగా పంపాలి. మరిన్ని వివరాలకు 92464 15150 **- కలిమిశ్రీ**

---

## SOLITUDE

చెట్లన్నీ యెక్కడి కెగిరిపోతాయో తెలియదు
గూడు చేరినట్టే వుంటుంది పిట్ట
నేలనంతా వొంటికి పూసుకుంటుంది వొంటరి పాదం
రెండు సముద్రాలు యేమ్ మాట్లాడుకుంటాయో
యెవరూ నడవని దారులు స్ఫురిస్తాయి
జల్లెడ పట్టినట్టే ఆలోచనలు
యెడారి అంచులో నిలబడి శూన్యానికి సైగ చేస్తుంటాయి గాలి చేతులు
మొఖం నిండా మిణుగురులు అంటుకుని వెలగవు
కొండమీదకెక్కి చంద్రున్ని చప్పరించే నాలుక
నీటి నుండి ఆత్మ తేలి ముచ్చట పెడుతుంది
తలుపులు తెరవకుండా యెవరు చేస్తారో కానీ వూపిరి ఆడనియ్యదు చీకటి



శరీరమంత భూమిలా గుండ్రంగా మారడం తెలుస్తుంది
మెదడు చిట్లి
మబ్బు జరిపినట్టు
దుప్పటి పక్కకు విసిరికొట్టి
చూస్తే
ఖాళీతనంలోకి తోసినట్టే వొకటే కలలు

■ విజయ్ కుమార్ ఎస్వీకే
✆ 97033 35955

వినూత్నం

"పెళ్లినాటి తీపి జ్ఞాపకం పూల డిజైన్ చీర.. బాగా పాతపడిపోయింది, ఇక పారేయక తప్పదు' అని నిట్టూర్చే మహిళలకూ...

'నాన్న ప్రేమతో కొనిచ్చిన టీషర్ట్ రంగు వెలిసిపోయింది, వేసుకోవాలంటే ఎలానో ఉంది... సెంటిమెంట్‌తో ఇన్నాళ్లూ పెట్టెలోనే దాచి ఉంచాను'..అని బాధపడే యూత్‌కూ.. ఆమె ఓ పెద్ద ఊరట!

'ఫేవరేట్ దుస్తులు పాతబడినంత మాత్రాన పారేయాల్సిన అవసరం లేదు. వాటికి కొత్త రంగులు అద్దొచ్చు, మరింత అందంగా కనిపించేలా మార్చొచ్చు' అని భరోసానిస్తున్నారు ఒడిస్సాలోని కటక్‌కు చెందిన ఇరవై ఏళ్ల హిమాన్షీ శర్మ.

# పాత దుస్తులకు కొత్త కళ



పాత దుస్తులపైన విభిన్న డిజైన్లు వేస్తూ వాటిని కొత్త దుస్తుల్లా మారుస్తూ సరికొత్త ఆదాయ మార్గాన్ని ఆవిష్కరించారు హిమాన్షి. ప్రస్తుతం శ్రీ శ్రీ యూనివర్సిటీలో విజువల్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేస్తున్న హిమాన్షి ఆర్టిస్ట్. చిన్నతనం నుంచి బొమ్మలు వేయడం ఆమె హాబీ.

**పాత దుస్తులకు ప్రాణం**

చీరలు, టీ షర్ట్‌లు... డ్రెస్‌లు ఏవైనా పాతబడ్డాక పారేయాల్సిందే! కానీ అలా పారేయడానికి మనసొప్పకపోతే హిమాన్షికి పంపితే చాలు ఆమె తన కళా నైపుణ్యంతో వాటిని కొత్తవాటిలా మారుస్తారు. పాత దుస్తులపైన సరికొత్త అద్భుతాలు చేస్తారు. హిమాన్షికి పాత దుస్తులు అప్పజెప్పి, కావాల్సిన డిజైన్ల వివరాలు చెబితే చాలు.. వాటిని కొత్త దుస్తుల్లా మార్చి ఖాతాదారుల చేతుల్లో పెడతారు. వాటిని ధరించి మురిసిపోవాల్సిందే! రకరకాల పద్ధతుల్లో సృజనాత్మకంగా పాత వస్త్రాల మీద ఆమె పెయింటింగ్‌లు, డిజైన్లు వేస్తారు.

ఆమె ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆర్డర్లు తీసుకుంటారు. "వారానికి 15 నుంచి 20 వరకూ ఆర్డర్లు వస్తున్నాయి. వాటిలో భువనేశ్వర్, కటక్‌ల నుంచి వచ్చేవే ఎక్కువ. వినియోగదారులతో మాట్లాడి, వారి అభిరుచి మేరకు ఎలాంటి డిజైన్‌లు వేయాలో నిర్ణయిస్తారు. ముందుగా రఫ్ డ్రాఫ్ట్ గీసి, కస్టమర్ అంగీకారం తెలిపాక దుస్తులపైన వాటిని డిజైన్ చేస్తా" అని ఈ నవతరం యువతి చెప్పారు. ఎక్కడైనా ప్రింట్‌ను బట్టి ధర ఉంటుంది. కానీ పాత దుస్తులపైన ప్రింట్ వేసినందుకు హిమాన్షి మాత్రం 200 రూపాయలే తీసుకుంటున్నారు. హిమాన్షి పనితనం ఇప్పుడు ఎంతోమందిని ఆకర్షిస్తోంది. చిత్రమేమిటంటే... పాత దుస్తులే కాదు, కొంతమంది కొత్త దుస్తులు కూడా తెచ్చి ఇస్తున్నారు. వాటిపైన ఫ్రెష్ ప్రింట్స్ వేసి అందిస్తారు హిమాన్షి.

"ప్రత్యేకమైన డిజైన్లు, ప్రింట్లు నా సొంతంగా రూపొందిస్తాను. ఇవి బయట ఎక్కడా కనిపించవు. మొదట్లో నా కోసమే సొంతంగా తయారుచేసుకునేదాన్ని. అవి బాగా నచ్చడంతో కొత్త దుస్తుల కన్నా ఎక్కువగా పెయింటింగ్ వేసిన పాత దుస్తులనే ధరించేదాన్ని. ఈ విధానం ఇప్పటి ట్రెండ్‌కు బాగా సూటవుతుంది. అలాగే పర్యావరణానికి కూడా మేలు చేస్తుంది. బూట్లపైన కూడా నేను ఇలాంటి డిజైన్లు వేయగలను. కానీ ప్రస్తుతం పరీక్షలు ఉండడంతో పక్కనపెట్టాను. పెయింటింగ్ నా హాబీ మాత్రమే. దాన్ని నేను వృత్తిగా చేపట్టాలనుకోవడం లేదు. చదువు పూర్తయ్యాక అడ్వర్టైజింగ్ రంగంలోకి అడుగుపెట్టాలనుకుంటున్నా" అని హిమాన్షీ శర్మ చెప్పారు. మొత్తానికి హిమాన్షి పనితనాన్ని తమ పాత దుస్తులపై చూసి, మురిసిపోతున్న వారంతా "కొత్త కళ తెచ్చేసిందే బాలా..." అని ఆనందంగా పాడుకుంటున్నారు.



స్ఫూర్తి




# బడిని బతికించారు!

**ఒక ప్రధానోపాధ్యాయుడి సంకల్పానికి గ్రామస్థుల సహకారం తోడయింది... ప్రభుత్వ పాఠశాలకే పిల్లల్ని పంపించాలన్న ఆసక్తిని తల్లితండ్రుల్లో రేకెత్తించింది... ఒకప్పుడు వెలవెలబోయిన ఆ బడి ఇప్పుడు కార్పొరేట్ పాఠశాలల్ని తలదన్నే సౌకర్యాలతో ఆదర్శంగా నిలుస్తోంది... ఉద్దేశం ఉన్నతమైనదైతే! సాధ్యం కానిది లేదని చాటి చెబుతోంది విజయనగరం జిల్లాలోని జమ్ము మండల పరిషత్ పాఠశాల!..**

ఇంటి పక్కనో, వీధి చివరనో ప్రభుత్వ విద్యాలయం ఉన్నా కిలోమీటర్ల దూరంలోని ప్రైవేటు బడికే పిల్లల్ని పంపడం సర్వసాధారణమైపోయింది. కుగ్రామాల్లోని తల్లితండ్రులు కూడా తమ పిల్లలు కార్పొరేట్ పాఠశాలలో చదవాలని కోరుకుంటున్నారు. ఎన్నో సర్కారు బడులు పిల్లలు లేక మూత పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో 'ఈ బడి మనది, మన బడిలోనే పిల్లల్ని చేరుద్దాం' అనే ఆలోచనను గ్రామస్థుల్లో కలిగించారు ఒక ప్రధానోపాధ్యాయుడు.

విజయనగరం మండలం (ప్రస్తుతం నగరపాలక సంస్థ పరిధిలో ఉంది) లోని జమ్ము మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా మంత్రి రామ్మోహనరావు 2011లో బాధ్యతలు తీసుకున్నారు. విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండడం ఆయనను కలచివేసింది. తమ పాఠశాలపై నమ్మకం పెంచడమే దీనికి పరిష్కారమని ఆయన భావించారు. గ్రామంలో ప్రజలను కలిసి, వారి పిల్లలను తమ బడికి పంపాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలలకన్నా మెరుగైన బోధన అందిస్తామని తల్లితండ్రులను ఒప్పించారు. కొంతమంది ముందుకు వచ్చారు. కొద్ది రోజుల్లోనే వారి పిల్లల చదువులో మార్పు కనిపించింది. మరి కొందరు తల్లితండ్రులు కూడా అదే బాటలో నడిచారు. ప్రస్తుతం అరవై అయిదుగురు విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారు.

**చేయీ చేయీ కలిపి...**

అయిదేళ్ళ కిందట వచ్చిన హుద్‌హుద్ తుపాను ధాటికి పాఠశాల ఆవరణలోని చెట్లు పడిపోవడంతో వంటశాల కూలిపోయింది. ప్రధానోపాధ్యాయుడు రామ్మోహనరావు గ్రామస్థులతో 'బడి రుణం తీర్చుకుందాం' పేరుతో సమావేశం ఏర్పాటు చేశారు. సుదీర్ఘంగా చర్చించిన తరువాత, అందరి సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయాలని తీర్మానించారు. రెండో విడత సమావేశంలో మౌలిక సదుపాయాల ఏర్పాటు ప్రధాన అజెండాగా చర్చ జరిగింది. రామ్మోహనరావు రూ. 50వేలు విరాళంగా ఇచ్చారు. దీంతో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లితండ్రులు సైతం ముందుకు వచ్చారు. లక్షలాది రూపాయలు సేకరించారు. పాఠశాలకు ప్రహరీ, వంటగది, ఇతర మౌలిక వసతులనూ తిరిగి ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలోనే వెస్ట్రన్ మోడల్ టాయిలెట్లు, వాష్ బేసిన్, నిరంతర నీటి సౌకర్యం లాంటివి సమకూరాయి. ఉపాధ్యాయులు కూడా సమయపాలన పాటిస్తూ, రాజీ లేకుండా బోధన చేయడంతో అనతికాలంలోనే ఈ పాఠశాల మంచి గుర్తింపు తెచ్చుకుంది. వీరికి పూర్వ విద్యార్థులు కూడా జతకలిశారు. తాము చదువుకున్న బడి తరువాతి తరం పిల్లలకు కూడా మంచి విద్యను అందించాలని వారు కోరుకుంటున్నారు.




**మళ్లీ బడికి...**

గ్రామాల్లో నిరుపేద కుటుంబాలతో పాటు పంచాయతీలోని మురికివాడలు, సంచారజాతుల వారిని కలసి పిల్లలను బడికి పంపితే మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం కూడా అందిస్తామని చెప్పారు. దీంతో మార్పు మొదలైంది. బడి మొహం చూడనివారితో పాటు డ్రాపౌట్లు కూడా పాఠశాల వైపు నడిచారు. ఈ పాఠశాలకు రెండు కిలోమీటర్ల దూరంలో జమ్ము పంచాయతీ శివారు గ్రామం సి.ఆర్.నగర్ ఉంది. అక్కడి నుంచి పిల్లలను బడికి తీసుకురావడానికీ, తిరిగి ఇంటి దగ్గర దింపడానికీ ప్రత్యేకంగా ఆటోను ఏర్పాటు చేశారు. ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేసి, స్వచ్ఛమైన నీటిని విద్యార్థులకు అందిస్తున్నారు. తల్లితండ్రులు, స్వచ్ఛందంగా ముందుకువచ్చిన వారి సహకారంతో ప్రతిరోజూ ఏదైనా పండు, స్వీట్, చిరుధాన్యాలతో చేసిన తినుబండారాలు పిల్లలకు పెడుతున్నారు. కొందరు దాతలు 'సాయి అమృత ఆహారం' పేరుతో పిల్లలకు ఆహారాన్ని సమకూరుస్తున్నారు. ప్రతి సంవత్సరం కొత్త విద్యార్థులకు బ్యాగ్‌లను కొందరు దాతలు సమకూరుస్తున్నారు. ప్రతినెలా చివరి రోజున విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం పెట్టి, పాఠశాల అవసరాలు, పిల్లల చదువు తీరు తెన్నులు, భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చిస్తారు.






**ఎన్నెన్నో పురస్కారాలు**

పాఠశాల పూర్వ విద్యార్థి ఆబోతుల వెంకటరావు సైన్యంలో పనిచేస్తున్నారు. దేశ సరిహద్దుల్లో ముగ్గురు ఉగ్రవాదులను మట్టుపెట్టినందుకు 2018లో శౌర్య చక్ర పురస్కారాన్ని రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నారు. హెచ్ఎం రామ్మోహన్‌రావు 2017లో జిల్లా స్థాయిలో, 2018లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. 2018లో 'స్వచ్ఛ విద్యాలయం' పురస్కారానికి ఈ పాఠశాల నామినేట్ అయింది. ఇంకా అనేక పురస్కారాలను ఈ బడి సొంతం చేసుకుంది. ఎన్‌సీఈఆర్‌టీ బృందం ఈ పాఠశాల పరిసరాలను గమనించి, విద్యార్థుల పురోగతిని చూసి ప్రత్యేకంగా ప్రశంసించింది.

● **కిల్లాడ విశ్వేశ్వరరావు,** విజయనగరం
**ఫొటోలు:** బి. జోగారావు

**డ్రాపౌట్లను చేర్పించాం...**

"మా పాఠశాల చాలా చిన్నది. జిల్లాలో అనేక ప్రాథమిక, మండల పరిషత్ పాఠశాలల్ని విద్యార్థు హాజరు తగ్గిందని మూసేస్తున్నారు. ఆ పరిస్థితి మా పాఠశాలకు రాకూడదని భావించాను. ప్రభుత్వం ఉచిత విద్య అందిస్తున్నప్పుడు సర్కారు బడికి పిల్లలు ఎందుకు దూరం కావాలి? అందుకే తలితండ్రులు, పిల్లలకూ అవగాహన కల్పించాం. మధ్యలో చదువు మానేసిన పిల్లల్ని తిరిగి బడిలో చేర్పించాం. వారు బడికి వచ్చేందుకూ, తిరిగి ఇంటికి వెళ్లడానికీ ఆటో ఏర్పాటు చేశాం. ఇది మంచి ఫలితాలను ఇచ్చింది."

**- మంత్రి రామ్మోహనరావు,** ప్రధానోపాధ్యాయుడు

**వారి సహకారం వల్లే...**

"ప్రభుత్వ నిర్వహణలో ఉన్న జమ్ము మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను విద్యార్థులు, తల్లితండ్రులు, దాతల సహకారమే ఉన్నత స్థాయిలో నిలబెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేది నిరుపేద విద్యార్థులే. వారికి నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని భావించాం. అనేక అభివృద్ధి పనులు చేశాం. ప్రస్తుతం 65 మంది విద్యార్థులున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఈ సంఖ్యను పెంచడానికి ప్రణాళిక వేస్తున్నాం."

**- బియ్యాల గౌరి, ఛైర్‌పర్సన్,** పేరెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ

పేరెంటచ్

# సమన్వయంగా...

పదేళ్ల దాటిన పిల్లల్లో చాలామంది ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎవరికి చెప్పుకోవాలా అని చూస్తారు. అయితే, ఎక్కువ మంది పిల్లలు ఆ సమస్య గురించి తల్లితండ్రులతో కన్నా, స్నేహితులకే ఎక్కువగా చెప్పుకుంటారు. ఎంత ప్రేమతో చూసే తల్లితండ్రులైనా, వాళ్లతో ఏదైనా చెప్పేయగల చనువు పిల్లలకు ఉండదు. అందువల్ల 'ఈ విషయాల్ని వాళ్లకు చెప్పవచ్చో...లేదో.... ఒకవేళ చెబితే వాళ్లు ఎలా రెస్పాండ్ అవుతారో ఏమిటో?' అనే మీమాంస వారిలో ఉంటుంది. చాలాసార్లు చెప్పకపోవడమే మేలనే అభిప్రాయానికి వచ్చేస్తారు. కాకపోతే, బాగా సాన్నిహిత్యం ఉన్న మిత్రులతో



చెప్పుకోవడానికి సిద్ధమైతారు. తల్లితండ్రులకు చెప్పడంలో పిల్లలు వెనుకంజ వేయడానికి కారణం, వారు చేసే వాటిలో తప్పులే ఎక్కువగా ఉంటాయి. తెలిసీ తెలియని ఆ పసి వయసులో తప్పులు కాక ఇంకేముంటాయి? అదీకాక, తప్పులు చేస్తే తన్నులు తప్పవనే విషయం అప్పటికే చాలా సార్లు అనుభవంలోకి వచ్చేసిన విషయమే కాబట్టి, తల్లితండ్రులకు చెప్పే సాహసమే రాదు. టీచర్లతో కూడా దాదాపు అంతే దూరం ఉంటుంది. అందుకే స్నేహితులతో చెప్పుకోవడం ఒక్కటే మార్గంగా అనిపిస్తుంది. కాకపోతే ఇక్కడో సమస్య ఉంది. మిత్రులంటే తమ వయస్కులే కాబట్టి, తమకన్నా ఎక్కువ జ్ఞానం గానీ, ఎక్కువ అనుభవం గానీ వారికేమీ ఉండదు. అందువల్ల వాళ్లేదైనా సలహా ఇచ్చినా వాటిల్లో చాలా వరకు తప్పుడు సలహాలే ఉంటాయి. అవి కావాలని చెప్పేవేమీ కావు కానీ, వాళ్ల స్థాయికి తోచేవే అలాంటివి. ఒకవేళ ఆ తప్పుడు సలహాలనే సీరియస్‌గా తీసుకుని వాటిని అనుసరిస్తే, పిల్లలు చిన్నా, పెద్దా చిక్కుల్లో ఇరుక్కుపోవచ్చు. దీనికంతా పిల్లలు ఏ విషయాన్నయినా నిస్సంకోచంగా తల్లితండ్రులకు చెప్పుకోగలిగే పరిస్థితి లేకపోవడమే కారణం. ఎందుకలా అంటే... పిల్లలకు ఎంతో కొంత చనువు ఇచ్చినా, వాళ్లకు తామంటే భయం ఉండాలనే భావన తల్లితండ్రుల మనసులో ఓ మూలన ఉండే ఉంటుంది. అందుకే ఎప్పుడు ప్రేమతో ఉంటారో, ఎప్పుడు కోపగించుకుంటారో తెలియని ఒక అయోమయం పిల్లలను అనుక్షణం కమ్మేసి ఉంటుంది. అందుకే జరిగిన తప్పిదాన్ని, లేదా ఎదురైన సమస్యను తల్లితండ్రులకు చెప్పే ప్రయత్నం పిల్లలు చేయరు. సమస్య ఏమిటంటే, అది తప్పయినా, ఒప్పయినా, ఏ పనిచేయడానికైనా దాని వెనుక ఒక భావోద్వేగం ఉంటుంది. ఆ భావోద్వేగాన్ని నియంత్రించుకునే శక్తి ఆ పసి వయసులో వారికి ఉండదు. ఈ బలహీనతే ఎక్కువ సార్లు వారిచేత తప్పులు చేయిస్తూ ఉంటుంది. అందువల్ల పిల్లలతో ఏదైనా తప్పిదం జరిగినప్పుడు, లేదా ఏదైనా ఒక సమస్యలో వారు ఇరుక్కుపోయినప్పుడు ఏం చేయాలి? ఎలా వ్యవహరించాలి? అనేది ఒక కీలకాంశం. నిజానికి, ఆ సమయంలో వారిని నిందించడమో, శిక్షించడమో కాదు, వాళ్లకు భావోద్వేగాల్లో పడిపోకుండా, నిలదొక్కుకునేందుకు అవసరమైన విచక్షణా జ్ఞానాన్ని కొంచెం కొంచెంగా అందించాలి. అప్పటికి ఆ తప్పిదం తాలూకు ఇబ్బందులతో కొంత కష్టనష్టాలకు గురైనా, మునుముందు మరోసారి ఆ తరహా తప్పిదాలు చేయకుండా నిగ్రహించుకునే శక్తి వారిలో పెరుగుతుంది. ఆ శక్తిని ప్రసాదించిన తలితండ్రుల పట్ల వారికి ప్రేమతో పాటు గౌరవమూ పెరుగుతుంది. అన్నింటినీ మించి ఎప్పుడు ఏ సమస్య వచ్చినా, ఎప్పుడు ఏ తప్పిదం జరిగిపోయినా, నిస్సంకోచంగా తల్లితండ్రులకు చెప్పుకోగలిగే ఓపెన్‌నెస్ వాళ్లల్లో పెరుగుతుంది.

సెలెబ్ ఫిట్‌నెస్

# నా మంత్ర చాలా సింపుల్!

అత్యంత ఫిట్‌గా ఉండే అతి కొద్ది మంది హిందీ హీరోయిన్లలో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఒకరు. కాబట్టే స్టంట్ సీన్స్‌లో నటించడానికి ఆమె ఏమాత్రం కష్టపడరు. అయితే అలాంటి ఫిట్‌నెస్ ఎలా పొందారో ఆమె మాటల్లోనే...

"ఆరోగ్యకరమైన ఆహారం, కంటి నిండా నిద్ర, క్రమం తప్పని వ్యాయామం... ఇదే నా ఆరోగ్య రహస్యం. వ్యాయామం విషయంలో ఫ్లెక్సిబిలిటీ, స్టామినా, స్ట్రెంగ్త్‌లకే నా తొలి ప్రాధాన్యం. ఇందుకోసం కార్డియో వ్యాయామాలు, పోల్ వ్యాయామాలు, స్ట్రెచింగ్, ఫ్లెక్సిబిలిటీ వ్యాయామాలు చేస్తాను. ఒకవేళ జిమ్‌కు వెళ్లలేకపోతే డాన్స్‌తో సరిపెడతాను. డాన్స్ కూడా వ్యాయామమే! అలాగే మెడిటేషన్‌తో సాంత్వన పొందుతాను. సెలెబ్రిటీల ఫిట్‌నెస్, డైట్ ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అనుకుంటారు. కానీ చేస్తున్న వ్యాయామాలను ఆస్వాదించగలిగితే ఎవరైనా చక్కని ఫలితం పొందుతారు. అలాగే శరీర తత్వానికి తగిన ఆహారం తీసుకుంటే, బరువు పెరగకుండా ఉంటారు. నేను అదే చేస్తున్నాను. నా రోజువారీ అవసరాలకు సరిపడా శక్తినిచ్చే ఆహారాన్నే తీసుకుంటాను. పోషకాలతో కూడిన, తాజా ఆహారాన్నే ఎంచుకుంటాను. అలాగే వర్కవుట్స్ కష్టంగా కాకుండా ఇష్టంగా చేస్తాను. ఇదే నా ఫిట్‌నెస్ రహస్యం!"




బ్యూటీ




# చర్మాన్ని కాపాడుకోండిలా!

**ఫౌండేషన్:** పౌడర్ రూపంలో ఉన్న మ్యాటిఫైయింగ్ ఫౌండేషన్స్ వాడొద్దు. ఇవి చర్మాన్ని తొందరగా పొడిబారేలా చేసి, మేకప్ అంతా ప్యాచీ ప్యాచీగా కనిపించేలా చేస్తాయి. అందుకే ఆయిల్ బేస్డ్ ఫౌండేషన్ రాసుకోవాలి. ఇది చర్మాన్ని తాజాగా, కాంతిమంతగా మారుస్తుంది.

**మాయిశ్చరైజర్:** ఫౌండేషన్ తొందరగా ఆరిపోతుంది. అంతేకాదు చర్మానికి పూర్తిస్థాయి రక్షణ ఇవ్వదు. కాబట్టి దానిపైన బీబీ క్రీమ్ లేదా సీసీ క్రీమ్ మాయిశ్చరైజర్ రాసుకోవాలి.

**లిప్‌బామ్స్:** ఈ సీజన్‌లో లిప్‌బామ్స్ తప్పక వాడాలి. చాప్‌స్టిక్ రకంలో మీకు నచ్చిన ఫ్లేవర్ లిప్‌బామ్ రాసుకుంటే పెదాలకు తేమ అందుతుంది. ఈ లిప్‌బామ్ రాసుకున్నాక 30 సెకన్లు ఆగి లిపిస్టిక్ రుద్దుకోవాలి. ఒకవేళ లిప్‌స్టిక్ వేసుకోకున్నా సరే పెదాలు అందంగానే కనిపిస్తాయి.

**ఫేస్‌మిస్ట్:** స్ప్రే రూపంలో ఉండే వీటితో మేకప్‌కి ఫినిషింగ్ టచ్ ఇవ్వొచ్చు. మేకప్ పౌడర్ వాడితే చర్మ రంధ్రాలు మూసుకుపోయి, చర్మం పొడిగా కనిపిస్తుది. అలాకాకుండా ఫేస్‌మిస్ట్ వాడితే స్కిన్ ఫ్రెష్‌గా ఉంటుంది.

**బ్రష్ స్పాంజెస్:** మేకప్ వేసుకునేటప్పుడు బ్రష్ స్పాంజెస్ ఉపయోగించాలి. దీంతో మేకప్ చక్కగా వస్తుంది.

## కిడ్ సైంటిస్ట్

### రంగులు వేడిని పీల్చుకుంటాయి!



**కావలసినవి**

● ఐస్‌దిమ్మ ● దీర్ఘచతురస్రాకారంగా ఉన్న నాలుగు రంగుల వస్త్రం ముక్కలు (వీటిలో ఒకటి నలుపు, ఒకటి తెలుపు ఉండాలి)

రకరకాల రంగులు వేడిని పీల్చుకునే విధానం వేర్వేరుగా ఉంటుంది. కొన్ని రంగులు వేసవికాలంలో చల్లదనాన్ని ఇస్తాయన్న విషయం తెలిసిందే కదా! ఈ విషయాన్ని ప్రయోగం ద్వారా రుజువు చేయవచ్చు. ఇందుకోసం సమతలంగా ఉన్న ఐస్ దిమ్మెను తీసుకోండి. ఇప్పుడు వేర్వేరు రంగుల్లో ఉన్న నాలుగు వస్త్రం ముక్కలు తీసుకోండి. బొమ్మలో చూపినట్లుగా నాలుగు వస్త్రం ముక్కలు దిమ్మెపై పరిచి, కాసేపు ఎండలో పెట్టండి. రంగులకు వేడితో ఏ సంబంధం లేకపోతే ఐస్ కరిగినపుడు మార్పేమీ ఉండదు. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. కొంచెం సేపటి తరువాత వస్త్రం ముక్కల కింద ఐస్ కరగడం గమనించవచ్చు. అంతేకాదు, ఆ ముక్కల కింద ఐస్ కరిగిన లోతుల్లో కూడా తేడా ఉంటుంది. నల్ల వస్త్రం కింద ఐస్ ఎక్కువగా కరగడం గమనించవచ్చు. తెల్లవస్త్రం కింద ఐస్ చాలా తక్కువగా కరగడం చూడొచ్చు.




### సరైన నీడను గుర్తించండి




### దారి కనుక్కోండి?



### బొమ్మ గీయండి



### డైలీ సుడోకు - 211

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 2 | | 7 | | 6 | | 8 | |
| | | | | | 8 | 5 | | 7 |
| | | 7 | | 2 | 1 | 6 | | |
| 7 | | 2 | | 1 | 4 | | 5 | |
| | 1 | | 6 | | 9 | | 4 | |
| | 4 | | 2 | 8 | | 1 | | 9 |
| | | 9 | 1 | 5 | | 4 | | |
| 3 | | 1 | 8 | | | | | |
| | 5 | | 9 | | 2 | | 1 | 3 |

**సుడోకు- 210 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 9 | 6 | 5 | 7 | 2 | 8 | 4 | 3 |
| 3 | 4 | 5 | 9 | 8 | 1 | 2 | 7 | 6 |
| 8 | 7 | 2 | 6 | 4 | 3 | 5 | 1 | 9 |
| 9 | 8 | 4 | 2 | 5 | 7 | 6 | 3 | 1 |
| 7 | 2 | 1 | 3 | 6 | 4 | 9 | 5 | 8 |
| 6 | 5 | 3 | 1 | 9 | 8 | 4 | 2 | 7 |
| 5 | 1 | 9 | 4 | 3 | 6 | 7 | 8 | 2 |
| 2 | 6 | 8 | 7 | 1 | 5 | 3 | 9 | 4 |
| 4 | 3 | 7 | 8 | 2 | 9 | 1 | 6 | 5 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

---

ఇండియన్ నేవీలో కెరీర్‌ను ప్రారంభించాలనుకునే వారికి చక్కటి అవకాశం... పర్మినెంట్ కమిషన్ హోదాలో 10+2 (బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్, షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఇండియన్ నేవీ నోటిఫికేషన్లు విడుదల చేసింది. క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ ద్వారా ఎంపికైన వారికి ఇంజనీరింగ్ చదువుతో పాటు ఉద్యోగం కూడా లభిస్తుంది. లక్ష రూపాయల వేతనంతో కెరీర్ ప్రారంభించవచ్చు. సంబంధిత వివరాలను తెలుసుకుందాం..

# బీటెక్ పట్టాతోపాటు..
# రూ. లక్ష వేతనం

జేఈఈ-మెయిన్ పరీక్షలో సాధించిన ర్యాంకుతో జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. అలా కాకుండా సవాళ్లతో కూడుకున్న కెరీర్‌ను ఇష్టపడే జేఈఈ - మెయిన్ ర్యాంక్ హోల్డర్ల కోసం ఇండియన్ నేవీ 10+2 (బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌లో ప్రవేశానికి ఆహ్వానం పలుకుతోంది. దీనికి ఎంపికవ్వడం ద్వారా బీటెక్ పట్టాతోపాటు నెలకు లక్ష రూపాయల వేతనంతో నేవీలో ఉద్యోగం కూడా సొంతమవుతుంది. అంటే ఒకేసారి విద్యా, ఉద్యోగం రెండు లక్ష్యాలను ఛేదించవచ్చు. ఇంతటి అద్భుత అవకాశాన్ని కల్పిస్తున్న క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు సంబంధించిన అర్హత, ఎంపిక ప్రక్రియ తదితర వివరాలను చూద్దాం..

- ఇండియన్ నేవీ అందిస్తున్న బీటెక్ క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (10+2)లో చేరిన వారికి కెరీర్‌లో ఎదుగుదలకు మంచి అవకాశాలు ఉంటాయి. ఈ స్కీమ్ ద్వారా ఎంపికైన వారికి పర్మినెంట్ కమిషన్ హోదా ఇస్తారు.

### అర్హతలు

- అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- 70 శాతం మార్కులతో 10+2 / ఇంటర్మీడియెట్ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) ఉత్తీర్ణత. దీంతోపాటు పదో తరగతి లేదా 10+2 / ఇంటర్మీడియెట్ స్థాయిలో ఇంగ్లీష్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- వయసు: జనవరి 2, 2001 - జూలై 1, 2003 మధ్య జన్మించి ఉండాలి.
- శారీరక ప్రమాణాలు: ఎత్తు కనీసం 157 సెం.మీ. ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు తప్పనిసరి.

### ఎంపిక విధానం

బీటెక్ క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (10+2) ఎంపిక ప్రక్రియలో రెండు దశలు ఉంటాయి. మొదటి దశలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను జేఈఈ-2019 మెయిన్ ర్యాంక్ ఆధారంగా షార్ట్‌లిస్టు చేస్తారు. వీరికి రెండోదశలో సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఇంటర్వ్యూలు ఉంటాయి. రెండు దశల్లో అర్హత సాధించిన వారికి చివరగా ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌లు నిర్వహించి ఉద్యోగానికి ఎంపిక చేస్తారు.

### ఐదు రోజులు.. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు

ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలను ఫిబ్రవరి-ఏప్రిల్ మధ్య కోల్‌కతా, బెంగళూరు, భోపాల్, కోయంబతూర్, విశాఖపట్నం కేంద్రాలలో నిర్వహిస్తారు. ఇందులో స్టేజ్-1, స్టేజ్-2 అనే రెండు దశలు ఉంటాయి. స్టేజ్-1లో అర్హత సాధిస్తేనే స్టేజ్-2కు అనుమతిస్తారు. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ కాల్ లెటర్ అందగానే నిర్దేశించిన సమయం, ప్రదేశంలో రిపోర్ట్ చేయాలి. మొదటి రోజు డాక్యుమెంటేషన్ చెక్, కొన్ని దరఖాస్తులను పూరించడం వంటివి ఉంటాయి.

### స్టేజ్ - 1 ఇలా

ఈ దశలో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. ఇక్కడ అభ్యర్థిలోని మానసిక శక్తిని పరీక్షిస్తారు. ఇందులో భాగంగా ఆఫీసర్స్ ఇంటెలిజెన్స్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. ఆఫీసర్స్ ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో వెర్బల్, నాన్ వెర్బల్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో 30 సెకన్లపాటు అస్పష్టంగా ఉన్న ఒక చిత్రాన్ని చూపిస్తారు. ఈ సమయంలోనే అభ్యర్థి ఆ చిత్రానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం నోట్ చేసుకోవాలి. వీటి ఆధారంగా మూడు నిమిషాల్లో ఒక కథను రాయాలి. తరవాత కూర్చొని కథల గురించి చర్చించుకోవాలి. స్టేజ్-1 ఆధారంగానే రెండో దశకు ఎంపిక చేస్తారు.

### నాలుగు రోజుల స్టేజ్-2

స్టేజ్ - 2 దశ నాలుగు రోజులపాటు సాగుతుంది. ఇందులో సైకలాజికల్ టెస్ట్‌లు, గ్రూప్ ఆఫీసర్ టాస్క్‌లు, ఇంటర్వ్యూ, కాన్ఫరెన్స్ వంటివి ఉంటాయి. సైకలాజికల్ టెస్ట్‌లో ప్రత్యేక పద్ధతి ద్వారా అభ్యర్థి మానసిక సామర్థ్యం, వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తారు. ఇందులో భాగంగా థీమాటిక్ అప్రిసియేషన్ టెస్ట్, వర్డ్ అసోసియేషన్ టెస్ట్, సిచ్యూవేషన్ రియాక్షన్ టెస్ట్, సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్‌లను చేపడతారు. థీమాటిక్ అప్రిసియేషన్ టెస్ట్‌లో అస్పష్టమైన చిత్రాల్లో ఉన్న కథను ఊహిస్తూ రాయాలి. అభ్యర్థి వ్యక్తిత్వాన్ని పరీక్షించడానికి వర్డ్ అసోసియేషన్ టెస్ట్‌ను ఉపయోగిస్తారు. విభిన్న పరిస్థితుల్లో ఏవిధంగా ప్రతిస్పందిస్తారనే విషయాన్ని తెలుసుకోవడానికి సిచ్యూవేషన్ రియాక్షన్ టెస్ట్ దోహదపడుతుంది. అటుపై గ్రూప్ టాస్క్‌లు ఉంటాయి. ఇందులో గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్ ఎక్సర్‌సైజ్, హాఫ్ గ్రూప్ టాస్క్, ఇండివిడ్యువల్ అబ్‌స్టకల్, కమాండ్ టాస్క్, స్నేక్ రేస్ / గ్రూప్ అబ్‌స్టకల్ రేస్, ఇండివిడ్యువల్ లెక్చర్, ఫైనల్ గ్రూప్ టాస్క్ వంటి పరీక్షలను నిర్వహిస్తారు. గ్రూప్ డిస్కషన్‌లో అభ్యర్థుల కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ స్కిల్స్, లిజనింగ్, నాలెడ్జ్, టీమ్ స్కిల్స్‌ను పరీక్షిస్తారు. గ్రూప్ / మిలటరీ ప్లానింగ్ ఎక్సర్‌సైజ్‌లో వివిధ రకాల సమస్యలకు ఒక గ్రూప్‌గా ఏర్పడి పరిష్కార మార్గాలను కనుక్కోవాలి. ప్రోగ్రెసివ్ గ్రూప్ టాస్క్/ హాఫ్ గ్రూప్ టాస్క్‌లో ఒక ప్రదేశంలో తెలుపు, నలుపు, ఎరుపు రంగులో అడ్డంకులను ఉంచుతారు. వాటిని జట్టు సభ్యులు నిర్దేశించిన నియమాల ఆధారంగా బరువును మోస్తూ అధిగమించాలి. ఇండివిడ్యువల్ అబ్‌స్టకల్‌లో అభ్యర్థుల ఓర్పు, ధైర్యం, అడ్డంకులను అధిగమించే తీరును పరిశీలిస్తారు. స్నేక్ రేస్ / గ్రూప్ అబ్‌స్టకల్ రేస్‌లో తెలుపు, ఎరుపు రంగులతో కూడిన పెద్ద ఇనుప పైప్‌లు ఉంటాయి. ఎరుపును తాకకుండా శరీరాన్ని వంచుతూ ఇంగ్లీష్ అక్షరం ఎస్ ఆకారం వచ్చేలా ఆ పైప్‌లను దాటాలి. అలాగే పది ఫీట్ల గోడను కూడా దూకాలి. ఇండివిడ్యువల్ లెక్చర్‌లో భావ వ్యక్తీకరణ, ఆలోచనలు, బాడీ లాంగ్వేజ్, ఆత్మవిశ్వాసం, నాలెడ్జ్ వంటి అంశాలను క్షుణ్నంగా పరీక్షిస్తారు. ప్రోగ్రెసివ్ గ్రూప్ టాస్క్ మాదిరిగానే ఫైనల్ గ్రూప్ టాస్క్ ఉంటుంది. చివరగా ఇంటర్వ్యూ. ఇందులో అభ్యర్థుల గుణగణాలను పరీక్షించడానికి ప్రాధాన్యం ఇస్తారు. వ్యక్తిగత విషయాలు, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలపై ప్రశ్నలు వేస్తారు.

### కేరళలో శిక్షణ

ఎంపికయిన వారికి శిక్షణ తరగతులు జూలై 2020 నుంచి ప్రారంభవుతాయి. అభ్యర్థులు ఇంటర్వ్యూలో సాధించిన మార్కులు, ఖాళీలకు అనుగుణంగా ఇండియన్ నేవల్ అకాడమీ, ఎజిమాల (కేరళ)లో శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్‌కు ఎంపికయిన అభ్యర్థులకు బీటెక్ (అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్) కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. ఇంజనీరింగ్ బ్రాంచ్ వారికి బీటెక్ (మెకానికల్, నావల్ ఆర్కిటెక్ట్ స్పెషలైజేషన్‌తో) లేదా ఎలక్ట్రికల్ బ్రాంచ్ వారికి బీటెక్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్) కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. కోర్సు పూర్తి చేసిన వారికి న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఇంజనీరింగ్ డిగ్రీని ప్రదానం చేస్తుంది. కోర్సు ఫీజు, భోజనం, వసతి, దుస్తులు, ఇతర ఖర్చులన్నీ ఇండియన్ నేవీ భరిస్తుంది.

### సబ్ లెఫ్టినెంట్ హోదాతో

*శిక్షణ అనంతరం సబ్ లెఫ్టినెంట్ హోదాతో నేవీలో కెరీర్ మొదలవుతుంది. ఈ హోదాతో అన్నీ కలిపి ప్రారంభంలోనే నెలకు లక్ష రూపాయల వరకు వేతనం పొందొచ్చు. అటు పై సబ్ లెఫ్టినెంట్ నుంచి లెఫ్టినెంట్, లెఫ్టినెంట్ కమాండర్, కమాండర్, కెప్టెన్, కమాండర్, రియర్ అడ్మిరల్, వైస్ అడ్మిరల్ స్థాయి వరకు ఎదగవచ్చు. ఆకర్షణీయమైన వేతనాలతోపాటు కేంద్ర ప్రభుత్వం రక్షణ దళాలకు ఇచ్చే అనేక ప్రోత్సాహకాలు, రాయితీలు కూడా ఉంటాయి.*

### ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ సమయంలో అన్ని ముఖ్యమైన సర్టిఫికెట్లు.. జన్మదిన ధ్రువీకరణ పత్రం, 10వ తరగతి, ఇంటర్మీడియెట్ మార్కుల షీట్స్, జేఈఈ - మెయిన్ 2019 మెయిన్ స్కోర్ కార్డు వంటి వాటిని తప్పకుండా అప్‌లోడ్ చేయాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 19, 2019
- వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in



**ఇండియన్ నేవీ ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్, టెక్నికల్ బ్రాంచ్, ఎడ్యుకేషన్ బ్రాంచిల్లోని షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేస్తుంది. వీటికి సబంధించి 144 ఖాళీలు ఉన్నాయి.**

**బ్రాంచ్‌ల వారీగా ఖాళీలు..**

- **ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్:** 76. ఇందులోని విభాగాలు: నేవల్ ఆర్మమెంట్ అండ్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్, ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోలర్, అబ్జర్వర్, ఫైలట్, లాజిస్టిక్స్, జనరల్ సర్వీస్, ఐటీ.
- **టెక్నికల్ బ్రాంచ్:** 53. ఇందులోని విభాగాలు: ఇంజనీరింగ్ బ్రాంచ్, ఎలక్ట్రికల్ బ్రాంచ్
- **ఎడ్యుకేషన్ బ్రాంచ్:** 15

# డిగ్రీతో ఆఫీసర్ కొలువు

ఈ పోస్టులను ఇండియన్ నేవీ ఎంట్రన్స్ టెస్టు (ఐనెట్) ద్వారా భర్తీ చేస్తారు. రెండు గంటల వ్యవధితో నిర్వహించే ఈ పరీక్షలో 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు వస్తాయి. వీటిని ఇంగ్లీష్, రీజనింగ్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ సైన్స్, మ్యాథమెటికల్ ఆప్టిట్యూడ్ అండ్ జనరల్ నాలెడ్జ్ విభాగాల నుంచి అడుగుతారు. ఒక్కో విభాగం నుంచి 100 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. నెగిటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కు చొప్పున తగ్గిస్తారు. పరీక్షను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన వారికి ఎస్ఎస్‌బీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు ఉంటాయి. ఇంటర్వ్యూలను ఏప్రిల్‌లో కోల్‌కతా, బెంగళూరు, భోపాల్, కోయంబతూర్, విశాఖపట్నంలలో నిర్వహిస్తారు. ఇందులో స్టేజ్-1, స్టేజ్-2 అనే రెండు దశలు ఉంటాయి. ఇందులోనూ ప్రతిభ చూపిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి తుది నియామకాలు చేపడతారు.

**» అర్హత - వయసు**

ఎంచుకున్న పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ / బీటెక్, ఎంఎస్సీ, బీఎస్సీ, బీకామ్, బీఎస్సీ (ఐటీ), పీజీ డిప్లొమా / ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ (ఐటీ), డీజీసీఏ జారీ చేసిన కమర్షియల్ ఫైలట్ లైసెన్స్ (ఫైలట్ ఔత్సాహికులకు). నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు తప్పనిసరి. ఆయా పోస్టులను అనుసరించి 1996, జనవరి 2 నుంచి 2000 జూలై 1, 1996, జనవరి 2 నుంచి 2001 జూలై 1, 1997, జనవరి 2 నుంచి 2002 జూలై 1 తేదీల మధ్య జన్మించి ఉండాలి.

**» 2021 నుంచి శిక్షణ**

ఎంపికయిన వారికి శిక్షణ తరగతులు జనవరి 2021 నుంచి మొదలవుతాయి. ఆయా విభాగాలను అనుసరించి ఇండియన్ నేవల్ అకాడమీ, ఎజిమాల (కేరళ)లో శిక్షణ ఉంటుంది. అటుపై నేవల్ ట్రైనింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ప్రొఫెషనల్ శిక్షణ ఇస్తారు. అనంతరం విధుల్లోకి తీసుకుంటారు. ప్రారంభంలో సబ్ లెఫ్టినెంట్ హోదా కేటాయిస్తారు. వీరు నేవీలోని వివిధ విభాగాల్లో లెవెల్-10 ఆఫీసర్ హోదాతో విధులు నిర్వర్తించవచ్చు. మొదటి నెల నుంచే రూ.56,100 మూలవేతనం అందుకోవచ్చు. అన్ని ప్రోత్సాహకాలూ కలుపుకుని నెలకు రూ. లక్షకు పైగా వేతనం లభిస్తుంది.

**» ముఖ్య సమాచారం**

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ సమయంలో అన్ని ముఖ్యమైన సర్టిఫికెట్లు.. జన్మదిన ధ్రువీకరణ పత్రం, బీటెక్ / ఆయా కోర్సుల మార్కుల షీట్స్, ఫైలట్ లైసెన్స్ వంటి వాటిని తప్పకుండా అప్‌లోడ్ చేయాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 19, 2019
- వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

---

# జాబ్ కార్నర్

## నాన్ టీచింగ్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఐఐఐటీడీఎం) - కర్నూలు వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- మొత్తం ఖాళీలు: **19**
- భర్తీ చేసే పోస్టులు: అసిస్టెంట్ రిజిస్ట్రార్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ ఇంజనీర్, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, తదితరాలు.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా/ బ్యాచిలర్ డిగ్రీ / ఇంజనీరింగ్ డిగ్రీ, అనుభవం.
- ఎంపిక: రాతపరీక్ష / ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 24, 2019.
- వెబ్‌సైట్: http://iiitk.ac.in/home

## కేస్ వర్కర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన కృష్ణా జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ విజయవాడలోని సఖి వన్ స్టాప్ సెంటర్‌లో విధులు నిర్వహించడానికి ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **8**
- భర్తీ చేసే పోస్టులు: సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, కేస్ వర్కర్, లాయర్, ఐటీ స్టాఫ్, తదితరాలు.
- అర్హత: పోస్టును అనుసరించి లా డిగ్రీ, బ్యాచిలర్ డిగ్రీ, సోషల్ వర్క్‌లో పీజీ, అనుభవం.
- వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2019 నాటికి).
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేదీ: డిసెంబరు 5, 2019
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 20, 2019.
- వెబ్‌సైట్: krishna.ap.gov.in/

## అసిస్టెంట్ మేనేజర్

మిశ్రధాతు నిగామ్ లిమిటెడ్ (మిధాని) - హైదరాబాద్, వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- భర్తీ చేసే పోస్టులు: అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్, చార్జర్ ఆపరేటర్లు, జూనియర్ ఆపరేటివ్ ట్రైనీ, సీనియర్ ఆపరేటివ్ ట్రైనీ.
- విభాగాలు: రిఫ్రాక్టరీ మెయింటెనెన్స్, సివిల్, హెచ్ఆర్.
- అర్హత: పదో తరగతి, ఐటీఐ, సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ (బీఈ / బీటెక్), ఎంసీఏ, అనుభవం ఉండాలి.
- వయసు: 30 - 40 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, టెస్ట్ / ఇంటర్వ్యూ ఆధారంగా
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 14, 2019.
- వెబ్‌సైట్: http://midhaniindia.in/

# లావుగా ఉన్నప్పటికీ... బికినీలు వేసుకుంటారు!

రంగులో, బరువులో ఏముంది? ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయడం లోనే అసలైన అందం దాగుందని పూజా హెగ్డే అంటున్నారు. కాంతివంతమైన చర్మం కోసం, వైట్ స్కిన్ టోన్ కోసం ఫెయిర్‌నెస్ క్రీమ్స్ ఉపయోగించే మహిళలు, పురుషులు చాలామంది ఉన్నారు. ఫెయిర్‌నెస్ క్రీమ్స్ యాడ్స్‌లో నటించే నటీనటులను విమర్శించేవారూ ఉన్నారు. ఈ నేపథ్యంలో పూజా హెగ్డే మాట్లాడుతూ "నేను విదేశాలు వెళ్లినప్పుడు 'వావ్! ఆమె స్కిన్ టోన్ చాలా బావుంది' అనేవాళ్లను చూశా. మన వయసు పెరిగే కొలదీ ఎలా ఆలోచించాలనేది ప్రజలు చెబుతారు. అదే ప్రపంచమంతా తిరిగితే... మనం ఎలా కనిపించినా యాక్సెప్ట్ చేసే ప్రజలు పెరుగుతారు. విదేశాల్లో లావుగా ఉన్నప్పటికీ బికినీలు వేసుకున్న మహిళలను నేను చూశా. చాలా క్యాజువల్‌గా, కంఫర్టబుల్‌గా తిరుగుతారు. వాళ్లు ఆత్మనూన్యతా భావంతో లేరు. లావుగా ఉన్నామని కుంగిపోవడం లేదు. కాన్ఫిడెంట్‌గా ఉంటారు. అటువంటప్పుడు మనకూ వాళ్లను చూస్తే ఇబ్బందిగా ఉండదు. అప్పుడు నాకు ఏం అర్థమైందంటే... మన స్కిన్ టోన్ ఎలా ఉన్నా మనం కంఫర్టబుల్‌గా ఉంటే, ప్రజలు మనల్ని చూసే విధానం మారుతుంది. అంతా మనలోనే ఉంటుంది. చర్మంపై ఏదైనా రాసుకుంటే మంచిగా ఉంటామని భావిస్తే... రాసుకోండి" అన్నారు.

### ప్రభాస్... ఫుడ్ కోమా!

"ఒకవేళ ఎప్పుడైనా ఐలాండ్‌లో ఆహారం లేకుండా ఓ కోస్టార్‌తో ఒంటరిగా ఉండాల్సి వస్తే... ప్రభాస్‌తో ఉండాలని ఆశిస్తున్నా. నాకు ఫుడ్‌లో చాలా వెరైటీస్ పంపించినందుకు ప్రభాస్‌కి థ్యాంక్స్. నేనిప్పుడు ఫుడ్ కోమాలో ఉన్నాను" అని పూజా హెగ్డే ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పేర్కొన్నారు. ప్రభాస్ హీరోగా 'జిల్' ఫేమ్ రాధాకృష్ణకుమార్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. పూజాకు వివిధ రకాల బిర్యానీలు, కర్రీలు పంపారు ప్రభాస్. అదీ సంగతి! ఈ సినిమాతో పాటు అఖిల్ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా చిత్రీకరణ కూడా చేస్తున్నారామె. శనివారం రాత్రి ఆ సినిమా షూటింగ్ జరిగింది.


పూజా హెగ్డే

# పవన్ పాట మరోసారి!


ఉదయ్ శంకర్, పవన్ కల్యాణ్

పవన్‌కల్యాణ్ బ్లాక్‌బస్టర్ సినిమాల్లో 'తొలిప్రేమ' ఒకటి. అందులో 'ఈ మనసే.. సే..సే' పాట ప్రేక్షకులను ఎంతగా అలరించిందో తెలిసిందే! ఉదయ్ శంకర్, ఐశ్వర్యా రాజేశ్ జంటగా నటించిన 'మిస్ మ్యాచ్' చిత్రంలో ఈ పాటను రీమేడ్ చేశారు. ఎన్.వి.నిర్మల్ కుమార్ దర్శకత్వంలో జి.శ్రీరామ్ రాజు, భరత్ రామ్ నిర్మించారు. ఆదివారం పవన్‌కల్యాణ్ 'ఈ మనసే' పాటను విడుదల చేసి, సినిమా సక్సెస్ కావాలని ఆకాంక్షించారు. ఉదయ్ శంకర్ మాట్లాడుతూ "పవన్ కల్యాణ్‌గారి పాటను నాపై చిత్రీకరించడం ఆనందంగా ఉంది. ఒకే టేక్‌లో పాటను తెరకెక్కిచడం విశేషం. మరోసారి ఈ పాట అలరిస్తుంది" అని అన్నారు. "సెన్సార్ పూర్తయింది. క్లీన్ 'యు' సర్టిఫికెట్ వచ్చింది. ఈ నెల 6న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం" అని నిర్మాతలు తెలిపారు.

# కఠిన చట్టాలు తీసుకురావాలి

**- మహేశ్‌బాబు**



"రోజులు, నెలలు, సంవత్సరాలు గడుస్తున్నాయి.. కానీ పరిస్థితులు మాత్రం మారడం లేదు. మనమంతా ఒక సమాజంగా విఫలమవుతున్నాం" అని మహేశ్ బాబు ట్వీట్ చేశారు. వైద్యురాలి హత్యాచార ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారాయన. " కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నా విన్నపం ఒకటే! ఇలాంటి భయంకరమైన నేరాలను అరికట్టడానికి మరిన్ని కఠిన చట్టాలు తేవాల్సిన అవసరం ఉంది. అంతా కలిసి మహిళలకు అండగా నిలుద్దాం. భారతదేశాన్ని సురక్షితంగా మార్చుదాం. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా" అని మహేశ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కేటీఆర్, ప్రధాన మంత్రి కార్యాలయ ట్విట్టర్ ఖాతాలకు తన ట్వీట్‌కు ట్యాగ్ చేశారు మహేశ్.


నేహా, కార్తికేయ, అజయ్ భూపతి, శేఖర్ రెడ్డి, అశోక్ రెడ్డి

# అంతకుమించి ప్రాఫిట్ తీసుకొస్తుంది

**- కార్తికేయ**

"చిరంజీవి సినిమాలు చూసి హీరో కావాలనుకున్నా. నా దృష్టిలో చిరంజీవి, మహేశ్‌బాబు నిజమైన హీరోలు. వారే నాకు స్ఫూర్తి. నేను చేసిన ప్రతి సినిమాలో అంత బాగా నటించడానికి కారణం నా దర్శకులు. 'ఆర్‌ఎక్స్ 100'తో డబుల్ ప్రాఫిట్ అందుకున్నాం. నా కెరీర్‌కు ప్రత్యేకమైన ఈ చిత్రం అంతకుమించి ప్రాఫిట్ తీసుకొస్తుంది" అని కార్తికేయ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం '90 ఎంఎల్'. శేఖర్ రెడ్డి యర్ర దర్శకత్వంలో అశోక్ రెడ్డి గుమ్మకొండ నిర్మించారు. నేహా సోలంకి కథానాయిక. ఈ నెల 5న ప్రేక్షకుల ముందుకొస్తుందీ సినిమా. ఇటీవల జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో అజయ్ భూపతి బిగ్ సీడీని ఆవిష్కరించారు. కార్తికేయ మాట్లాడుతూ "మందు తాగకపోతే బతకలేని ఓ కుర్రాడికి, మందు వాసన అంటే గిట్టని ఓ తండ్రి కూతురికి మధ్య నడిచే ప్రేమకథ ఇది. ఈ పాయింట్ నచ్చే సినిమా చేశా. హీరోగా కనిపించినా, విలన్‌గా చేసినా ప్రేక్షకులు నన్ను ఆదరిస్తారనే నమ్మకం కుదిరింది" అని అన్నారు. అజయ్ భూపతి వల్లే ఈ సినిమా చేశాననీ, పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా '90 ఎంఎల్' అలరించనుందని దర్శకుడు తెలిపారు.

# మంచి చిత్రాలు ఫెయిల్ కాలేదు

**- సుకుమార్**


అశోక్ ప్రసాద్, సురేందర్ రెడ్డి, సుకుమార్, అజయ్

"అమెరికాలో '1 నేనొక్కడినే' బాగా ఆడింది. లేకపోతే నా కెరీర్ వేరేలా ఉండేది. కంటెంట్ బావుంటే... అమెరికాలో ప్రేక్షకాదరణ దక్కుతుంది. ఈ చిత్రం ముందుగా అమెరికాలో విడుదలవుతోంది. మంచి చిత్రాలు ఎప్పుడూ ఫెయిల్ కాలేదు. రియలిస్టిక్ ప్రేమకథతో వస్తున్న ఈ చిత్రం తప్పకుండా హిట్టవుతుంది" అని సుకుమార్ అన్నారు. శ్రీనివాస సాయి, భావనారావు జంటగా దివ్యాప్రసాద్, అశోక్ ప్రసాద్ నిర్మించిన చిత్రం 'మథనం'. అజయ్ మణికందన్ దర్శకుడు. ఈ నెల 6న అమెరికాలో 45కు పైగా స్క్రీన్స్‌లో విడుదల చేస్తున్నారు. ఆదివారం నిర్వహించిన ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో సుకుమార్ ట్రైలర్ విడుదల చేశారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ "పదిహేనేళ్ల క్రితం అశోక్ ఇండస్ట్రీలో ఉండేవాడు. తర్వాత అమెరికా వెళ్లి ఉద్యోగం చేసి, డబ్బులు సంపాదించి వచ్చి ఈ సినిమా చేశాడు. సినిమా అంటే అతడికి అంత పిచ్చి. కొత్త పాయింట్‌తో మంచి ప్రయత్నం చేశారు" అన్నారు. "దర్శకుడు ఆరేళ్ల కథపై వర్క్ చేశారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు బెస్ట్ అవుట్‌పుట్ ఇచ్చారు" అని అశోక్ ప్రసాద్ అన్నారు. నిజజీవిత సంఘటన స్ఫూర్తితో సినిమా చేశానని దర్శకుడు అజయ్ అన్నారు.

## ఉరి తీయాలి లేదా షూట్ చేయాలి

**- సురేందర్‌రెడ్డి**

"పశు వైద్యురాలి ఘటన తెలియగానే... నేనూ, నా భార్య రెండు రోజులు నిద్రపోలేదు. ఇంట్లో కూర్చోవడానికీ భయపడే పరిస్థితి. ఆ అమ్మాయిని క్షమించమని వేడుకుంటున్నా. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలి. కచ్చితంగా ఈ ఘటనకు కారణమైనవాళ్లను ఉరి తీయాలి లేదా షూట్ చేసి చంపాలి" అని సురేందర్‌రెడ్డి అన్నారు. సుకుమార్ మాట్లాడుతూ "నాకు వార్త తెలియగానే కన్నీళ్లు ఆగలేదు. పిల్లల్ని ఎలా పెంచాలని భయంగా ఉంది. ఆ అమ్మాయి '100'కు ఫోన్ చేయలేదంటున్నారంతా! ఒకవేళ ఫోన్ చేస్తే, పోలీసులు వస్తే 'అక్కా! నీకు ఇంత హెల్ప్ చేస్తుంటే అనుమానపడతావా?' అని నిందితులు అనుకుంటారని చేయలేదేమో! అంటే... అబ్బాయిల్ని అమ్మాయిలు అంత నమ్ముతారు. అమ్మా... మేం మగాళ్లం కాదు. మృగాళ్లం. మమ్మల్ని నమ్మవద్దు. సొంత అన్న, తండ్రినీ నమ్మవద్దు. అనుమానంతో బతకండి. అప్పుడే సేఫ్‌గా ఉంటారు" అన్నారు.

# దక్షిణాదిలో తొలి రికార్డ్ బన్నీదే!


అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న 'అల వైకుంఠపురంలో' చిత్రంలో 'సామజవరగమన' పాట ఎంత పాపులర్ అయ్యిందో తెలిసిందే. సెప్టెంబర్ 28న విడుదల చేసిన ఈ పాట కొద్ది గంటల్లోనే రికార్డ్ స్థాయిలో వ్యూస్, లక్షల్లో లైక్స్ అందుకుంది. ఇప్పటివరకు యూట్యూబ్‌లో 100 మిలియన్ వ్యూస్ రావడం విశేషం. దక్షిణాదిలో ఓ పాటకు ఇన్ని వ్యూస్ రావడం ఇదే ప్రథమం. నెటిజన్లు లక్షల సంఖ్యలో టిక్‌టాక్‌లు చేసి భారీ హిట్ చేశారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో గీతా ఆర్ట్స్, 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేస్తున్నారు. పూజా హెగ్డే, నివేతా పేతురాజ్, టబు, రాజేంద్రప్రసాద్, తనికెళ్ళ భరణి, సునీల్, సుశాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పి.ఎస్.వినోద్, సంగీతం: థమన్.ఎస్.

## 'రీ సౌండ్' ప్రారంభమైంది


రాశీ సింగ్, సాయిరామ్ శంకర్

సాయిరామ్ శంకర్, రాశీ సింగ్ జంటగా జె. సురేశ్‌రెడ్డి, రాజు, ఎన్‌వీఎన్ రాజారెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'రీసౌండ్'. ఎస్.ఎస్. మురళీకృష్ణ దర్శకుడు. ఈ చిత్రం ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సురేందర్‌రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, సుకుమార్ క్లాప్ ఇచ్చారు. సాయిరామ్ శంకర్ మాట్లాడుతూ "కంటెంట్ ఒరియెంటెడ్ చిత్రమిది. కొత్త కథతో, ఒక పాయింట్ డిస్కస్ చేస్తూ తెరకెక్కిస్తున్నాం. ఇందులో కామెడీ, యాక్షన్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి" అన్నారు. "సోమవారం చిత్రీకరణ ప్రారంభిస్తున్నాం. హైదరాబాద్, విశాఖలో చిత్రాన్ని పూర్తి చేస్తాం" అని నిర్మాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకాశ్‌పూరి తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవంశీ చిత్రంతో నటుడిగా...


రాహుల్ సిప్లిగంజ్

గాయకుడు, 'బిగ్ బాస్ 3' విజేత రాహుల్ సిప్లిగంజ్ త్వరలో నటుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్నారు. కృష్ణవంశీ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'రంగమార్తాండ'. ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో రాహుల్ సిప్లిగంజ్ స్వీట్ క్యారెక్టర్ చేస్తున్నట్టు కృష్ణవంశీ తెలిపారు. "గొప్ప నటులతో అద్భుతమైన చిత్రంలో నేనూ భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. కృష్ణవంశీగారికి పెద్ద థ్యాంక్స్. చిత్రీకరణలో పాల్గొనడానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను. నటుడిగా నా తొలి చిత్రమిది. మీ అందరి ఆశీర్వాదాలు కావాలి" అని రాహుల్ సిప్లిగంజ్ అన్నారు.

# సీక్వెల్ చేసే ఆలోచన ఉంది!

**- టి. సంతోశ్**



"నేను ఏఆర్ మురుగదాస్ వద్ద 'సెవెంత్ సెన్స్', 'తుపాకీ'కి దర్శకత్వ శాఖలో పని చేశా. ఆయన 'కత్తి' (తెలుగులో 'ఖైదీ నంబర్ 150'గా రీమేక్ చేశారు) చేసే సమయంలో నేను 'కణితన్' చేశా. సినిమా చూసిన మురుగదాస్ 'తెలుగులో రీమేక్ చేసే ఛాన్స్ వస్తే వదులుకోకు' అన్నారు. నేను ఆయన సలహా పాటించా" అని టి. సంతోష్ అన్నారు. నిఖిల్, లావణ్యా త్రిపాఠీ జంటగా 'ఠాగూర్' మధు సమర్పణలో రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మించిన 'అర్జున్ సురవరం' చిత్రానికి ఆయన దర్శకుడు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం గురించి సంతోష్ మాట్లాడుతూ "సినిమా చూసిన ప్రేక్షకులందరూ బావుందంటున్నారు. అర్జున్ సురవరం పాత్రలో నిఖిల్ నటనను మెచ్చుకుంటున్నారంతా. ఈ సినిమాను ఆయన చేయగలడా? లేదా? అని సందేహించాను. ఎందుకంటే.. నిఖిల్ లవర్‌బాయ్‌లా ఉంటారు. కానీ, పాత్ర కోసం 15 కిలోలు బరువు పెరగడంతో పాటు ఎంతో కష్టపడి నటించారు. తమిళ చిత్రాన్ని ఉన్నది ఉన్నట్టుగా తెలుగులో తీయలేదు. భావోద్వేగాలను జోడించాను. జర్నలిస్టుల్లో ఐకమత్యాన్ని చెప్పే విధంగా క్లైమాక్స్ తీశా. ఈ మార్పులన్నీ మంచి ఫలితాన్నిచ్చాయి. ఈ సినిమాకు సీక్వెల్ తీసే ఆలోచన ఉంది. అయితే, ఇప్పుడే కాదు. ప్రస్తుతం వేరే స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నా" అన్నారు.



పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ చిత్రీకరించిన 'ది సైలెంట్ వాయిస్' తెలుగు షార్ట్‌ఫిల్మ్‌కు

## తెలుగు లఘు చిత్రానికి పురస్కారం

కేంద్ర ప్రభుత్వం నుంచి పురస్కారం దక్కింది. అన్షుల్ సిన్హా దర్శకత్వంలో తెలుగు యువకుడు సునీల్ సత్యవోలు ఈ లఘుచిత్రాన్ని నిర్మించారు. సీఎంఎస్ వాతావరణ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పురస్కారాల్లో ఈ చిత్రానికి ద్వితీయ పురస్కారం దక్కింది. కేంద్ర పర్యావరణ అటవీశాఖ అదనపు కార్యదర్శి చేతుల మీదుగా ఆదివారం ఢిల్లీలో ఈ అవార్డును నిర్మాత సునీల్, దర్శకుడు అన్షుల్ అందుకున్నారు. రెండున్నర నిమిషాలపాటు మాటలు లేకుండా పర్యావరణ దుస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించిన ఈ లఘుచిత్రం జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది.

## చీమ ప్రేమ సాధ్యమైందా?


ఇందు, అమిత్

"ఓ చీమ మనిషిగా మారాలనుకుంది. అది సాధ్యమైందా? తను అనుకున్నది జరిగిందా? అన్నది తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే" అంటున్నారు దర్శకుడు శ్రీ అప్పలరాజు. అమిత్, ఇందు జంటగా నటించిన చిత్రం 'చీమ.. ప్రేమ.. మధ్యలో భామ'. ఎస్.ఎన్.లక్ష్మీనారాయణ నిర్మాత. రవివర్మ స్వరాలందించిన పాటల్ని ఇటీవల విడుదల చేశారు. "చీమ ప్రేమలో పడటం అన్నది ఇందులో ఆసక్తికరం" అని నిర్మాత చెప్పారు. "మా గురువు ఎస్.పి .బాలసుబ్రహ్మణ్యం, గీతా మాధురి ఇందులో పాటలు పాడడం ఆనందంగా ఉంది" అని సంగీత దర్శకుడు రవివర్మ అన్నారు.

# అయ్యప్ప కటాక్షం

నటుడిగా తెలుగులో సుమన్ వందో చిత్రం 'వీరశాస్త అయ్యప్ప కటాక్షం' రుద్రాభట్ల వేణుగోపాల్ దర్శకత్వం వహించారు. వి.ఎస్.పి.తెన్నేటి ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు అందించడమే కాకుండా టి.ఎస్.బద్రీష్ రామ్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం పాటల్ని ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో సి.కల్యాణ్, లగడపాటి శ్రీధర్, రాజ్ కందుకూరి విడుదల చేశారు. సుమన్ మాట్లాడుతూ "అయ్యప్ప కరుణాకటాక్షాల నేపథ్యంలో సాగే చిత్రమిది. అయ్యప్ప దివ్య చరిత్రతో వస్తున్న ఈ చిత్రం నాకు వందో సినిమా కావడం అదృష్టం. వి.ఎస్.ఎల్.జయకుమార్ సంగీత సారథ్యంలో ఎస్.పి.బాలు, శంకర్ మహదేవన్ పాడిన పాటలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి" అని అన్నారు. "భక్తితోపాటు మానసిక శక్తిని సవ్య దిశలో పెంచే సానుకూల దృక్పధాన్ని పెంచే విధంగా 'అయ్యప్ప కటాక్షం' చిత్రం రూపొందిందని దర్శకుడు తెలిపారు.


లగడపాటి శ్రీధర్, బద్రీష్ రామ్, సి.కల్యాణ్, సుమన్, తెన్నేటి

# స్నేహం... ప్రేమ!


శైలజ

పవన్, శైలజ జంటగా జి. మురళీ దర్శకత్వంలో పి. వీరారెడ్డి నిర్మించిన 'మేరా దోస్త్' ఈ నెల 6న విడుదల కానుంది. "స్నేహం, ప్రేమతో పాటు కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన చిత్రమిది" అని మురళీ అన్నారు. "సుమారు 150 థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. కథ, చిన్నా సంగీతం చిత్రానికి ప్రధాన ఆకర్షణ" అని వీరారెడ్డి అన్నారు.






# అంత దమ్మెవరికుంది?



**మోదీని విమర్శించాలంటే భయం**

**రాహుల్ బజాజ్**

ముంబై: మోదీ ప్రభుత్వంపై ప్రముఖ పారిశ్రామికవేత్త రాహుల్ బజాజ్ తీవ్ర విమర్శలు చేశారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ విధానాల్ని విమర్శించేంత దమ్ము కూడా లేకుండా పోయిందన్నారు. ఎకనామిక్ టైమ్స్ పత్రిక నిర్వహించిన ఒక చర్చా కార్యక్రమంలో బజాజ్ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌ల సమక్షంలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లోలోపల అసంతృప్తి ఉన్నా ఎక్కడ ఆ విషయాన్ని బయటికి చెబితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయోననే భయంతో పారిశ్రామికవేత్తలు నోరు కట్టేసుకుంటున్నట్టు బజాజ్ తెలిపారు. 'యూపీఏ-2 హయాంలో ఎవరినైనా విమర్శించే అవకాశం ఉండేది. మీరు మంచి పనులే చేస్తున్నారు. అయినా కొన్ని విషయాల్ని మేము బహిరంగంగా విమర్శిస్తే మీరు మెచ్చుకుంటారన్న నమ్మకం మాకు లేదు. నా పారిశ్రామిక మిత్రులు ఎవరూ ఈ విషయం మాట్లాడరు. నేను మాత్రం ఈ విషయం బహిరంగంగానే చెబుతున్నా. నేను చెబుతున్న ఈ విషయం తప్పు కావచ్చు. అయితే అందరూ ఇదే అనుకుంటున్నారు' అన్నారు. రెండో త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి రేటు ఆరున్నరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన నేపథ్యంలో బజాజ్ గ్రూప్ చైర్మన్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. అయితే ఇదే చర్చా కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ షా వెంటనే బజాజ్ వ్యాఖ్యలను తోసిపుచ్చారు.

**గతంలోనూ విమర్శలు**

*రాహుల్ బజాజ్.. మోదీ ప్రభుత్వాన్ని విమర్శించడం ఇదే మొదటిసారి కాదు. మోదీ సర్కార్ ప్రతిష్ఠ మసకబారుతోందని 2015లోనే బజాజ్ విమర్శించారు. ఆయన కుమారుడు రాజీవ్ బజాజ్ కూడా 2017లో మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. పెద్ద నోట్ల రద్దుతో జీడీపీ వృద్ధి రేటు చతికిల పడి, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. విద్యుత్ వాహనాల విషయంలోనూ మోదీ సర్కార్ పిల్లి మొగ్గలు వేస్తోందని ఇటీవల విమర్శించారు. పడిపోతున్న డిమాండ్‌ను గాడిలో పెట్టేందుకు ప్రైవేట్ పెట్టుబడులు పెంచేందుకూ మోదీ సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇటీవల జరిగిన బజాజ్ ఏజీఎంలో రాహుల్ బజాజ్ దెప్పి పొడిచారు.*



**మొబైల్ బిల్లు..**

# జేబుకు చిల్లు

## కాల్స్, డేటా ప్లాన్ల ధరలను భారీగా పెంచిన టెలికాం కంపెనీలు

**50 శాతం వరకు పెంచిన ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా**

**3 తేదీ నుంచి కొత్త చార్జీలు అమల్లోకి**

**6వ తేదీ నుంచి 40 శాతం వరకు చార్జీలు పెంచనున్న జియో**

న్యూఢిల్లీ: ఇంతకాలం చవకగా ఉన్న మొబైల్ సేవల (కాల్స్, డేటా) చార్జీలు ఒక్కసారిగా భగ్గుమననున్నాయి. ప్రీపెయిడ్ మొబైల్ కాల్స్, డేటా ప్లాన్ల ధరలను పెంచుతున్నట్టు ఆదివారం నాడు ప్రైవేటు రంగ టెలికాం దిగ్గజాలైన భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, రిలయన్స్ జియోలు ప్రకటించాయి. ప్లాన్ల ధరలు 50 శాతం వరకు పెరగడంతో టెలికాం వినియోగదారులపై విపరీతమైన భారం పడనుంది. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు పెంచిన రేట్లు ఈ నెల 3వ తేదీ నుంచి జియో పెంచే రేట్లు 6 నుంచి అమల్లోకి రానున్నాయి. నష్టాలు భారీగా పెరిగిన నేపథ్యంలో వాటిని తగ్గించుకునేందుకు చార్జీల పెంపు నిర్ణయాన్ని కంపెనీలు తీసుకున్నాయి. ఇక ఎయిర్‌టెల్, వొడాఫోన్ కస్టమర్లు నెల రోజుల పాటు నెట్‌వర్క్ సేవలను పొందాలంటే కనీసంగా రూ.49 చెల్లించాల్సి ఉంటుంది.

**ఐదేళ్ల తర్వాత టెలికాం కంపెనీలు మొదటిసారిగా మొబైల్ చార్జీలను పెంచాయి.**

### వొడాఫోన్ ఐడియా

వొడాఫోన్ ఐడియా ప్రకటించిన కొత్త ప్లాన్ల ప్రకారం కాల్, డేటా చార్జీలు గరిష్ఠంగా 50 శాతం వరకు పెరిగాయి. కొత్త ప్లాన్లు ఈ నెల 3వ తేదీ నుంచి అందుబాటులో ఉంటాయి. ఈ తేదీ నుంచి అపరిమిత కేటగిరీలోని పాత ప్లాన్ల స్థానంలో కొత్త ప్లాన్లు అమల్లోకి వస్తాయని తెలిపింది. కాగా నిర్దేశిత పరిమితి దాటిన తర్వాత ఇతర నెట్‌వర్క్‌లకు చేసే కాల్స్‌కు కంపెనీ నిమిషానికి 6 పైసల చార్జీని వసూలు చేయనుంది.

- ప్లాన్ల విషయానికి వస్తే.. ఏడాది కాలపరిమితితో అపరిమిత కాల్స్, డేటాను అందించే ప్లాన్ ధరను రూ.999 (12 జీబీ) నుంచి రూ.1,499 (24 జీబీ)కి పెంచారు. ఈ ప్లాన్ ధర దాదాపు 50 శాతం పెరిగింది.
- 365 రోజుల వాలిడిటీతో అపరిమిత కాల్స్, రోజుకు 1.5 జీబీ డేటాను అందించే ప్లాన్ ధరను రూ.1,699 నుంచి రూ.2,399కి పెంచారు. దీని ధర 41.2 శాతం పెరిగింది.
- అపరిమిత కేటగిరీలో 84 రోజుల వాలిడిటీతో రోజుకు 1.5 జీబీ డేటాను అందిస్తున్న ప్రారంభ ప్లాన్ ధర దాదాపు 31 శాతం పెరిగింది. ఇప్పుడు రూ.458 ఉన్న ప్లాన్ ధర రూ.599కి పెరగనుంది.
- 28 రోజుల కాలపరిమితి అన్‌లిమిటెడ్ ప్లాన్‌తో రోజుకు 1.5 జీజీ డేటా ఇస్తున్నారు. ఈ ప్లాన్ ధరను రూ.199 నుంచి రూ.249కి పెంచారు. పెంపు 25 శాతంగా ఉంది.

### రిలయన్స్ జియో

డిసెంబరు 6 నుంచి కొత్త అపరిమిత ప్లాన్స్‌ను విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. వీటి ధరలు గరిష్ఠంగా 40 శాతం వరకు పెరగనున్నట్టు పేర్కొంది. అయితే కస్టమర్లు కొత్త ప్లాన్ల కింద 300 శాతం వరకు అధిక ప్రయోజనాలు పొందనున్నట్టు తెలిపింది. ఈ ప్లాన్లలో ఇతర మొబైల్ నెట్‌వర్క్‌లకు సంబంధించి ఫెయిర్ యూసేజ్ విధానాన్ని అనుసరించనున్నట్టు తెలిపింది.

### భారీగా నష్టాలు

సవరించిన స్థూల రాబడుల (ఏజీఆర్)కు సంబంధించిన సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్‌లపై భారీగా భారం పడింది. వొడాఫోన్ ఐడియా రూ.44,150 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి వొడాఫోన్ ఐడియా రూ.50,921 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. ఎయిర్‌టెల్ బకాయిల మొత్తం రూ.35,586 కోట్ల వరకు ఉంది. ఈ నేపథ్యంలో ఈ కంపెనీ కూడా సెప్టెంబరు త్రైమాసికానికి రూ.23,045 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. ఈ నష్టాలను పూడ్చుకోవడానికి ఇప్పుడు చార్జీలను పెంచాలని కంపెనీలు నిర్ణయించాయి.

### ఎయిర్‌టెల్



- ఈ కంపెనీ కూడా ప్రీపెయిడ్ ప్లాన్ల చార్జీలను 50 శాతం వరకు పెంచింది. ఎయిర్‌టెల్ పెంచిన రేట్ల శ్రేణి రోజుకు 50 పైసల నుంచి రూ.2.85 వరకు ఉంది.
- ఏడాది కాలపరిమితి కలిగిన ఎంట్రీ లెవల్ అపరిమిత ప్లాన్ ధరను రూ.998 నుంచి రూ.1,499కి పెంచింది. పెంపు 50 శాతం వరకు ఉంది.
- ఇదే కేటగిరీలో 365 రోజుల కాలపరిమితి రోజుకు 1.5 జీబీ డేటా, అపరిమిత కాల్స్‌ను అందించే ప్లాన్ ధరను రూ.1,699 నుంచి రూ.2,398కి పెంచారు. పెంపు 41.2 శాతంగా ఉంది.
- అపరిమిత కేటగిరీలో 84 రోజుల కాలపరిమితి ఉండే ప్లాన్ ధరను రూ.458 నుంచి రూ.598కి పెంచారు.
- 28 రోజుల కాలపరిమితితో రోజుకు 1.5 జీబీ డేటాను అందిస్తున్న ప్లాన్ ధరను రూ.199 నుంచి రూ.248 పెంచారు. పెంపు చాలా తక్కువగా ఉందని కంపెనీ వర్గాలు అంటున్నాయి. వారంలో కప్పు టీ కోసం ఒక కస్టమర్ వెచ్చించే స్థాయిలో ధరల పెంపు ఉన్నట్టు చెబుతున్నారు.
- ఎయిర్‌టెల్ కూడా నిర్దేశిత పరిమితి దాటిన తర్వాత ఇతర నెట్‌వర్క్‌లకు మాట్లాడే కాల్స్‌పై చార్జీలను వసూలు చేయనుంది. 28 రోజుల వాలిడిటీ ఉండే ప్లాన్లపై 1,000 నిమిషాలు, 84 రోజుల ప్లాన్‌పై 3,000 నిమిషాలు, 365 రోజుల ప్లాన్‌పై 12,000 నిమిషాల పరిమితి ఉంటుంది. ఆ తర్వాత కాల్ చార్జీలుంటాయి.

**జీఎస్‌టీ వసూళ్లు**

# మళ్లీ రూ.లక్ష కోట్లు



న్యూఢిల్లీ: జీఎస్‌టీ వసూళ్లు మళ్లీ రూ.లక్ష కోట్ల మార్కును అధిగమించాయి. మూడు నెలల అనంతరం నవంబరు నెలలో జీఎస్‌టీ వసూళ్లు 6 శాతం వృద్ధి చెంది రూ.1.03 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. వసూళ్లు పెరగటానికి పండగలు చోదకశక్తిగా పనిచేశాయి. గత ఏడాది ఇదే నెలలో జీఎస్‌టీ వసూళ్లు రూ.97,637 కోట్లుగా ఉన్నాయి. కాగా ఈ ఏడాది అక్టోబరు నెలలో ఈ వసూళ్లు రూ.95,380 కోట్లుగా ఉన్నాయి. రెండు నెలల ప్రతికూల వృద్ధి అనంతరం ఈ ఏడాది నవంబరు నెలలో జీఎస్‌టీ వసూళ్లు 6 శాతం వృద్ధి చెందాయని ప్రభుత్వం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. పండగల సందర్భంగా వినియోగం గణనీయంగా పెరిగిపోవటంతో వసూళ్లు పెరగటానికి దోహదపడిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. జూలై నెలలో జీఎస్‌టీ వసూళ్లు రూ.1,02,083 కోట్లుగా ఉన్నాయి. ఆ తర్వాత మళ్లీ లక్ష కోట్ల మార్కును తాకింది నవంబరు నెలలోనే అని ప్రభుత్వం తెలిపింది. నవంబరు నెలలో దేశీయ లావాదేవీల్లో 12 శాతం వృద్ధి నమోదైందని, ఈ ఏడాదిలో ఇదే గరిష్ఠ స్థాయి అని ఆ వర్గాలు పేర్కొన్నాయి. నవంబరులో మొత్తం జీఎస్‌టీ వసూళ్లు రూ.1,03,492 కోట్లుగా ఉన్నాయని. ఇందులో సీజీఎస్‌టీ రూ.19,592 కోట్లుగా ఉండగా, ఎస్‌జీఎస్‌టీ రూ.27,144 కోట్లు, ఐజీఎస్‌టీ రూ.49,028 కోట్లుగా (దిగుమతి వసూళ్లు రూ.20,948 కోట్లు కలుపుకుని) ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అలాగే సెస్ వసూళ్లు రూ.7,727 కోట్లుగా ఉన్నాయి. జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత నెలవారీ పన్ను వసూళ్లు గరిష్ఠ స్థాయిలో ఉండటం ఇది మూడోసారని ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్, మార్చి నెల తర్వాత వసూళ్లు ఈ స్థాయిలో ఉండటమే ఇదే మొదటిసారి. 2017 జూలై తర్వాత జీఎస్‌టీవసూళ్లు లక్ష కోట్ల మార్కును అధిగమించటం ఇది ఎనిమిదోసారి.

**1న ఫారం గేటు అమ్మకం ధరలు**

**రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.00 నెక్ (100 గుడ్లు)**



| | | 2వ తేదీకి.. | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 441 | విశాఖపట్నం | 455 |
| బెంగళూరు | 463 | వరంగల్ | 444 |
| విజయవాడ | 455 | చెన్నై | 473 |
| గోదావరి | 455 | చిత్తూరు | 466 |
| నమక్కల్ | 431 | ముంబై | 496 |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 88 | విజయవాడ | 96 |
| వరంగల్ | 88 | గుంటూరు | 96 |
| మహబూబ్‌నగర్ | 88 | ఒంగోలు | 98 |
| కరీంనగర్ | 88 | చిత్తూరు | 89 |
| కర్నూలు | 88 | నెల్లూరు | 89 |
| విశాఖపట్నం | 82 | అనంతపురం | 88 |
| గోదావరి | 88 | | |

## మరోసారి రేట్ల తగ్గింపు తథ్యం

న్యూఢిల్లీ: ఈ నెల 5న ప్రకటించనున్న ద్రవ్య పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ మరోసారి కీలక రెపో రేటును తగ్గించవచ్చని ఊహాగానాలు సాగుతున్నాయి. అదే జరిగితే ఇది వరుసగా ఆరో తగ్గింపు అవుతుంది. శక్తికాంత దాస్ ఆర్‌బీఐ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ప్రతి సమావేశంలోనూ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) రెపో రేట్లు తగ్గిస్తూనే వచ్చింది. వృద్ధిరేటుకు ఊతం ఇచ్చేందుకు రెపోరేటును మరోసారి తగ్గించడం ఖాయమని బ్యాంకర్లు, నిపుణులు అంటున్నారు. ఇంతకు ముందు ఐదు విడతల తగ్గింపులో రెపోరేటు 1.35 శాతం మేరకు తగ్గింది. రెండో త్రైమాసికంలో ఆర్థిక వృద్ధిరేటు 4.5 శాతానికి దిగజారిన నేపథ్యంలో ఈ సారి కూడా రేట్ల కోతకే ఎంపీసీ ఓటు వేయవచ్చునని వారన్నారు. వృద్ధిరేటు పునరుజ్జీవం సాధించే వరకు రెపోరేట్లు తగ్గించక తప్పదని దాస్ గతంలో అన్న విషయం విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

## తగ్గిన మారుతి అమ్మకాలు

**నవంబరులో 1.9 శాతం క్షీణత**



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల కంపెనీగా ఉన్న మారుతీ సుజుకీ మొత్తం కార్ల అమ్మకాలు నవంబరు నెలలో 1.9 శాతం తగ్గి 1,50,630 యూనిట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే నెలలో కంపెనీ 1,53,539 కార్లను విక్రయించింది. దేశీయంగా అమ్మకాలు 1.6 శాతం క్షీణించి 1,46,018 యూనిట్ల నుంచి 1,43,686 యూనిట్లకు చేరుకున్నాయి. ఆల్టో, వ్యాగన్‌ఆర్‌ల అమ్మకాలు 29,954 యూనిట్ల నుంచి 26,306 యూనిట్లకు చేరాయి. స్విఫ్ట్, సెలేరియో, ఇగ్నిస్, బాలెనో, డిజైర్‌ల అమ్మకాలు 7.6 శాతం పెరిగి 72,533 యూనిట్ల నుంచి 78,013 యూనిట్లకు చేరాయి. విటారా బ్రెజ్జా, ఎస్-క్రాస్, ఎర్టిగాల అమ్మకాలు మాత్రం 1.3 శాతం క్షీణించి 23,204 యూనిట్లకు చేరాయి.

**టాటా మోటార్స్:** ఈ కంపెనీ అమ్మకాలు నవంబరులో 25.32 శాతం తగ్గి 41,124 యూనిట్లకు చేరుకున్నాయి. ఇదే నెలలో దేశీయ అమ్మకాలు 25 శాతం క్షీణించి 50,470 యూనిట్ల నుంచి 38,057 యూనిట్లకు చేరాయి.

**మహీంద్రా:** నవంబరులో మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) 41,235 వాహనాలను విక్రయించింది. గత ఏడాది ఇదే నెల (45,101)తో పోల్చితే అమ్మకాలు 9 శాతం తగ్గాయి. దేశీయ మార్కెట్లో అమ్మకాలు 7 శాతం క్షీణించి 38,614 యూనిట్లకు చేరుకున్నాయి.

**హోండా కార్స్:** దేశీయ మార్కెట్లో ఈ కంపెనీ కార్ల అమ్మకాలు నవంబరులో ఏకంగా 50.33 శాతం క్షీణించి 6,459 యూనిట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 13,006 యూనిట్లుగా ఉన్నాయి. కార్ల అమ్మకాలు తమ ప్రణాళిక కన్నా మెరుగ్గా ఉన్నాయని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ (సేల్స్, మార్కెటింగ్) రాజేష్ గోయల్ తెలిపారు.

**ఎంజీ మోటార్స్:** ఈ కంపెనీ నవంబరులో 3,239 హెక్టార్ వాహనాలను విక్రయించింది. హెక్టార్ కస్టమర్ల హృదయాలను గెలుచుకుంటోందని ఎంజీ మోటార్ ఇండియా డైరెక్టర్ (సేల్స్) రాకేష్ సిదానా తెలిపారు. కస్టమర్లకు మరింత మెరుగైన సర్వీసులు అందించడానికి సర్వీస్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నామని చెప్పారు.

## 'ఎల్సామెక్స్'లో రామ్‌కీ ఇన్‌ఫ్రాకు 26% వాటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రామ్‌కీ ఎల్సామెక్స్ హైదరాబాద్ రింగ్ రోడ్ లిమిటెడ్‌లో (ఆర్‌ఈఎల్) 26 శాతం వాటాను రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొంతం చేసుకుంది.. 26 శాతం వాటాకు సమానమైన రూ.10 ముఖ విలువ కలిగిన 52 లక్షల షేర్లను తీసుకున్నట్లు తెలిపింది. దీంతో ఇప్పటి వరకూ అనుబంధ కంపెనీగా ఉన్న రామ్‌కీ ఎల్సామెక్స్ పూర్తి సొంత అనుబంధ కంపెనీ అవుతుంది. తుక్కుగూడ, శంషాబాద్ మధ్య 12.63 కిలోమీటర్ల ఎనిమిది లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించడానికి ప్రత్యేక కంపెనీ కింద 2007లో రామ్‌కీ ఎల్సామెక్స్ హైదరాబాద్ రింగ్ రోడ్‌ను ఏర్పాటు చేశారు. కంపెనీ ప్రారంభించినప్పుడు రామ్‌కీ ఇన్‌ఫ్రాకు 74 శాతం, స్పానిష్ ఇంజినీరింగ్ అండ్ కనస్ట్రక్షన్ కంపెనీ ఎల్సామెక్స్‌కు 26 శాతం వాటా ఉంది.

## యాక్సిస్ బ్యాంక్‌కూ 'ఒత్తిడి' ఆస్తుల సెగ

**పెరిగిన కేటాయింపుల భారం**

ముంబై: ప్రైవేట్ రంగంలోని యాక్సిస్ బ్యాంక్‌కూ 'ఒత్తిడి'లో ఉన్న ఆస్తుల భయం పట్టుకుంది. కొన్ని రంగాలకు చెందిన కంపెనీలకు ఇచ్చిన రుణాలు ఎక్కడ మొండి బకాయిలు(ఎన్‌పీఏ)గా మారతాయోనని భయపడుతోంది. దీంతో 'ఒత్తిడి'లో ఉన్న ఆస్తులుగా గుర్తించిన రుణాలకు, 'కేటాయింపు'ల రూపంలో ముందే సర్దుబాట్లు చేస్తోంది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఎన్‌పీఏలుగా మారే అవకాశం ఉందని గుర్తించిన రుణాలను 'ఒత్తిడిలో ఉన్న రుణాలు' అంటారు. బ్యాంకులు ఇలాంటి రుణాల కోసం, తమ నిధుల్లో 0.4 శాతం మొత్తాన్ని ప్రామాణిక ఆస్తుల కేటాయింపు (ఎస్‌ఏపీ) కింద కేటాయించాలి.

**టెక్ వ్యూ**

## 12000 దిగువన స్వల్పకాల బలహీనత



వి సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 11900కన్నా పైన పాజిటివ్‌గానే ప్రారంభమై మానసిక అవధి 12000ని దాటింది. తదుపరి మైనర్ అప్‌ట్రెండ్‌లో పడి 12150 వరకు వెళ్లినా రియాక్షన్‌లో పడింది. ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిలను ఛేదించిన అనంతరం పుల్‌బ్యాక్ రియాక్షన్‌లో పడి 12000 వరకు వచ్చి మరోసారి ఆ స్థాయిలో బ్రేకౌట్ సాధించింది. నిఫ్టీ మరోసారి ఈ స్థాయిలో పరీక్షకు సమాయత్తం అవుతోంది. ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిల వద్ద నిలదొక్కుకోలేక దిగజారడం అప్రమత్త సంకేతం. వీక్లీ చార్టుల్లో సైతం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమన వారం మధ్య స్థాయిలో ముగియడం అనిశ్చిత ధోరణిని సూచిస్తోంది. ఈ గరిష్ఠ స్థాయిలో కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఏర్పడవచ్చుననేందుకు ఇది సంకేతం. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. టెక్నికల్‌గా ఇప్పటికీ అప్‌ట్రెండ్ కొనసాగుతున్నా గత కొద్ది వారాల్లో ర్యాలీ వేగం మందగించింది. అప్‌ట్రెండ్ కొనసాగాలంటే ఈ కీలక స్థాయిల్లో బలంగా నిలదొక్కుకోవడం అవసరం.

**బుల్లిష్ స్థాయిలు:** 12150 కన్నా పైన బలంగా క్లోజయినప్పుడే మరింత అప్‌ట్రెండ్‌లో మరింత ముందుకు సాగుతుంది. మార్కెట్ కొత్త గరిష్ఠ స్థాయిలకు చేరుతున్నందు వల్ల ముందున్నవన్నీ మానసిక అవధులే.

**బేరిష్ స్థాయిలు:** మరింత బలహీనత ప్రదర్శించినా కూడా అప్‌ట్రెండ్ ఆశలు సజీవంగా నిలబెట్టుకోవడానికి కోసం 12000 వద్ద తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 11800. గత కొద్ది వారాల్లో ఏర్పడిన మేజర్ బాటమ్ ఇదే.

**బ్యాంక్ నిఫ్టీ:** ప్రధాన నిరోధం 33000 కన్నా పైన నిలదొక్కుకోగలిగితే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది. గత వారంలో 32150 వద్ద రియాక్షన్ సాధించింది.

**స్వల్పకాలిక వ్యూహం:** 12000 కన్నా పైన నిలదొక్కుకోగలిగినప్పుడే గట్టి స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక బై పొజిషన్లు తీసుకోవచ్చు.

**పాటర్న్:** 12000 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్ లైన్" వద్ద గట్టి మద్దతు ఉంది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ప్రదర్శిస్తుంది. 11800 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద గట్టి మద్దతు ఉంది. ఆర్‌ఎస్‌ఐ సూచీల ప్రకారం మార్కెట్‌లో స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితి ఉంది. ప్రస్తుతం స్వల్పకాలిక 20 డీఎంఏకు చేరువ అవుతోంది.

**టైమ్:** ఈ సూచి ప్రకారం ఈ వారంలో మంగళ, శుక్రవారాల్లో తదుపరి రివర్సల్స్ ఉన్నాయి.




**గోద్రెజ్ కన్స్యూమర్ (రూ.727) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..**

| | | |
|---|---|---|
| రూ.730 ఎగువన అప్‌ట్రెండ్ | మొదటి నిరోధం రూ.750 | రెండో నిరోధం రూ.775 |
| రూ.715 దిగువన డౌన్‌ట్రెండ్ | మొదటి మద్దతు రూ.695 | రెండో మద్దతు రూ.675 |

**సోమ వారం స్థాయిలు**
నిరోధం: 12070, 12120
మద్దతు: 12000, 11945
www.sundartrends.in

**ఆస్ట్రో టెక్**

## 11850 దిగువన బేరిష్

**(డిసెంబరు 2-6 తేదీల మధ్య వారానికి)**

**గత వారం నిఫ్టీ : 12056 (+142)**



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 12159-11920 పాయింట్ల మధ్యన కదలాడి 142 పాయింట్ల నష్టంతో 12056 వద్ద వారం గరిష్ఠ స్థాయిలో పాజిటివ్‌గా ముగిసింది.

- వచ్చే మంగళ, శుక్రవారాల నడుమ (2, 6 తేదీలు) చంద్రుడు కుంభ, మీన రాశుల్లో సంచరించే ఏర్పడే పరిధి మూడు వారాలకు కీలకం. గరిష్ఠ స్థాయికి పైన బుల్లిష్‌గాను, కనిష్ఠ స్థాయికి దిగువన బేరిష్‌గాను భావించాలి.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 11964, 11638, 11411, 11437 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం అన్ని డీఎంఏల కన్నా పైన ఉంది. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా (గోల్డెన్ క్రాస్) పైకి రావడం దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్ అయిందనేందుకు సంకేతం. ఈ వారాంతంలో 11850కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బేరిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి : 12275 బ్రేక్‌డౌన్ స్థాయి : 11850**

**నిరోధ స్థాయిలు :** 12205, 12280 (12130 పైన బుల్లిష్)
**మద్దతు స్థాయిలు :** 11905, 11830 (11980 దిగువన బేరిష్)

**ఇన్వెస్టర్లకు సూచన...**

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

**గ్రహగతులు**

- కర్కాటకంలోని శ్రవణం పాదం 4 నుంచి మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 3 మధ్యలో చంద్ర సంచారం
- వృశ్చికంలోని అనూరాధ పాదం 4 నుంచి జ్యేష్ఠ పాదం 1 మధ్యలో రవి సంచారం
- వృశ్చికంలోని విశాఖ పాదం 2-4 మధ్యలో బుధ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1-2 మధ్యలో శుక్ర సంచారం
- తులలోని స్వాతి పాదం 3-4 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 4లో వృశ్చిక నవాంశలో శని సంచారం
- ధనుస్సులోని మూల పాదం3-4 మధ్యలో మిథున నవాంశలో బృహస్పతి సంచారం
- మిథునంలోని ఆర్ద్ర పాదం 3లో రాహువు, ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1లో కేతువు సంచారం

### ముగింపు సెషన్ మెరుగు (సోమవారానికి)

**తిథి :** మార్గశిర శుక్ల షష్ఠి; నక్షత్రం : శ్రవణం
**అప్రమత్తం:** పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, కుంభ, మిథున రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు: 11.40**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలడకగా ప్రారంభమై 12.30 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 2.05 వరకు నిస్తేజంగా ట్రేడయి ఆ తర్వాత చివరి వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం:** నిఫ్టీ ఫ్యూచర్స్ 12.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 2 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం: 12095, 12130 మద్దతు స్థాయిలు: 12015, 11975**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.



మాట్లాడుతున్న సౌత్ కోస్టల్ జోన్ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్, పక్కన గుంటూరు రూరల్ ఎస్పీ విజయరావు

## బాబు కాన్వాయ్‌పై దాడి కేసులు సిట్‌కు

- వారంలో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు
- ప్రారంభంలోనే బస్సు అద్దాలకు పగుళ్లు
- లాఠీ విసిరినట్లు ఫుటేజీల్లో కనిపించలేదు
- రెండు కేసులు నమోదు: ఐజీ బ్రిజ్‌లాల్

గుంటూరు, డిసెంబరు 1: మాజీ సీఎం చంద్రబాబు కాన్వాయ్‌పై దాడికి పాల్పడిన కేసులను సిట్‌కు అప్పగించినట్లు సౌత్ కోస్టల్ జోన్ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ చెప్పారు. ఈ వ్యవహారంలో సమగ్ర విచారణకు డీజీపీ గౌతమ్ సవాంగ్ ఆదేశించిన నేపథ్యంలో గుంటూరు రూరల్ ఎస్పీ విజయరావు ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించినట్లు తెలిపారు. అన్ని కోణాల్లో విచారణ జరిపి వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించామన్నారు. ఆదివారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడారు. గతనెల 28న చంద్రబాబు పర్యటన జరగ్గా దానికి అనుమతి కోసం ముందురోజు దరఖాస్తు చేయడంతో 238మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పర్యటన ప్రారంభానికి అర్ధగంట ముందు కొందరు నల్లజెండాలు, బ్యాడ్జిలతో నిరసన తెలిపేందుకు వచ్చారన్నారు. అప్పటికప్పుడు వారిని అడ్డుకుంటే ఈ విషయం మరింత ముదురుతుందనే ఉద్దేశంతో వారు నిరసన తెలుపుకునేందుకు అవకాశం ఇచ్చామన్నారు. నిరసనకారుల్లో ఓ వ్యక్తి చిన్న రాయి విసరగా మరో వ్యక్తి చెప్పు విసిరాడన్నారు. అయితే అంతకుముందే బస్సు అద్దాలకు పగుళ్లు ఉండటంతో ఆ రాయి తగలడంతో అద్దాలు పగిలినట్లు ఐజీ స్పష్టం చేశారు. అయితే టీడీపీ నేతలు ఆరోపించినట్లు బస్సుపై పోలీసు లాఠీ విసిరిన దాఖలాలు సీసీ కెమెరా ఫుటేజ్‌లో ఎక్కడా కనిపించలేదన్నారు. అద్దాలకు ముందే పగుళ్లు ఉన్నట్లు బస్సు డ్రైవర్ కూడా అంగీకరించాడన్నారు. చంద్రబాబు కాన్వాయ్‌పై రాళ్లు, చెప్పులు విసిరిన ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయకముందే తామే సుమోటోగా రెండు కేసులు నమోదు చేశామన్నారు. చెప్పు విసిరిన మందడం గ్రామానికి చెందిన భాస్కరరావు అలియాస్ బాపయ్యపైనా, రాయి విసిరిన ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చెందిన శృంగారపతి సందీప్ పైనా కేసులు నమోదు చేసి, అదేరోజు రాత్రి 11గంటలకు వారిద్దరికీ నోటీసులు అందించామన్నారు. ఈ పర్యటనను పోలీసుల అనుమతి లేకుండా డ్రోన్ ద్వారా చిత్రీకరించడంపై కేసు నమోదు చేశామన్నారు. ఈ వ్యవహారంలో పోలీసుల నిర్లక్ష్యం, వైఫల్యం ఉన్నట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని ఐజీ బ్రిజ్‌లాల్ స్పష్టం చేశారు.



### పవన్‌కు జననీరాజనం

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సీమ ప్రాంతంలో అడుగిడిన సందర్భంగా భారీ ఎత్తున ప్రజలు హాజరై నీరాజనాలు పలికారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి రైల్వేకోడూరు వరకు సుమారు 60 కిలోమీటర్ల మేరకు అడుగడుగునా ప్రజలు అభివాదం తెలిపారు. మహిళలు మంగళ హారతులు పట్టి పూలవర్షం కురిపించారు. మేళతాళాలతో స్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. ఈ రైతు సదస్సుకు పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యారు.

# జగన్‌కు దమ్ము లేదు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీకి లేఖ రాస్తానని పవన్ ప్రకటించారు. జగన్‌రెడ్డి సీఎంలాగా మాట్లాడితే గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు అనే సంబోధిస్తానని, అలా కాకుండా కొంతమందికే, వైసీపీ వారికే సీఎంలాగా ప్రవర్తిస్తే పేరు పెట్టే పిలుస్తానని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ విషయంలో మాటలను కూడా తాను వెనక్కు తీసుకోనని స్పష్టం చేశారు.

### మేమూ కొట్టగలం!

రాయలసీమలో మానవ హక్కులు పూర్తిగా హరించివేయబడ్డాయని, యువకులు నడుము బిగించి పోరాటం చేయాల్సిన అవసరముందని పవన్ అన్నారు. 'ఎంతకాలం బెదిరిస్తారు? మీరు దాడులు చేస్తే మేము చేయలేమా? మీరు కొడితే మేము తిరిగి కొట్టలేమా?' అని అధికార పార్టీని ప్రశ్నించారు. 'యువతరం కడుపు మండాలి.. ఆవేదన రావాలి. అరుపులు... కేకలు కాదు. మీ కోపాన్ని లోపల భద్రంగా పెట్టుకోండి. రండి... రోడ్ల మీదకి రండి. మీకు జనసేన దారి చూపిస్తుంది' అని పవన్ భరోసా ఇచ్చారు. యువతకు ధైర్యమిచ్చేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా జనసేన పర్యటనలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోందన్నారు.

### రాయలసీమ చదువుల తల్లి

రాయలసీమ ఫ్యాక్షన్ సీమ కాదని, చదువుల తల్లి అని పవన్ పేర్కొన్నారు. 'ఈ రోజు జగన్‌మోహన్‌రెడ్డి గారు స్కూళ్లు గురించి మాట్లాడుతున్నారు. ఇంగ్లిష్ మాధ్యమాల గురించి మాట్లాడుతున్నారు. అసలు రాయలసీమలోనే తెలుగు మొట్టమొదటి శిలాఫలకాలు దొరికాయి. కడప జిల్లాలో... పులివెందులలోనే దొరికాయి. బ్రిటిష్‌వాళ్లు ఉన్నప్పుడుగానీ, అంతకుముందుగానీ ఈ రాయలసీమ చదువుల సరస్వతి. అందుకే ఇక్కడి కడప గ్రంథాలయంలో 80వేలకుపైగా పుస్తకాలు ఉంటాయి. అంతటి ఉన్నతమైన తెలుగు భాషను పక్కనపెట్టి ఇంగ్లిష్ మాధ్యమాన్ని తేవడం బాధాకరం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాదెళ్ల మనోహర్, నాగబాబు, పసుపులేటి హరిప్రసాద్, పీవీఎస్ మూర్తి, తాతంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### పద్ధతి మార్చుకోమనండి

వైసీపీ నాయకులపైన తనకేమీ కోపం లేదని, వారు తన శత్రువులు కాదని పవన్ ప్రకటించారు. వైసీపీ కార్యకర్తల్లో తన అభిమానులు కూడా ఉన్నారని అన్నారు. 'నేను వారిని అడిగేది ఒక్కటే! మీరు వెన్నంటి ఉన్న మీ జగన్ మోహన్‌రెడ్డి గారిని పద్ధతులు మార్చుకోమని చెప్పండి. ఒక ముఖ్యమంత్రిలాగా హుందాగా మాట్లాడమని చెప్పండి. పెట్టుబడులు తీసుకురమ్మని చెప్పండి. భారతీ సిమెంట్స్‌పై ఉన్న శ్రద్ధ కడప ఉక్కు పరిశ్రమపై జగన్‌కు ఎందుకు లేదు?' అని పవన్ ప్రశ్నించారు. సీమలో ఉన్న వనరులు పాలకుల చేతుల్లోకి వెళ్లడంతోనే సీమ అభివృద్ధికి తీవ్ర ఆటంకం ఏర్పడిందన్నారు.



### గిట్టుబాటు కోసం రైతుల వేడుకోలు

రైతు సభలో కడప జిల్లా మైదుకూరు, కమలాపురం, ఒంటిమిట్ట, పులివెందుల, రాజంపేట, రైల్వేకోడూరులకు చెందిన పలువురు రైతులు మాట్లాడారు. తమ పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమకు గిట్టుబాటు ధర కల్పించాలని పవన్‌ను కోరారు. ఓబులవారిపల్లె మండలం చెన్నరాజుపోడు గ్రామానికి చెందిన చెంగల్‌రాయులు అనే రైతు మాట్లాడుతూ... తాను సాగు చేసిన చీనీ చెట్లను వైసీపీ వర్గీయులు నిలువునా నరికివేశారని పవన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను పవన్‌కళ్యాణ్ ఓదార్చి అండగా ఉంటామని తెలిపారు.



## జగన్ చేతకానోడు: లోకేశ్

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జగన్ చేతకానోడని తేలిపోయిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. 'ఎయిడ్స్ రోగం కంటే పెద్ద జబ్బు వైసీపీ సైకో సిండ్రోమ్. జగన్ పేటీఎంలో వేసే ఐదు రూపాయల భిక్షం కోసం ఎంత నీచమైన పనులైనా చేస్తారు. జగన్ చేతకాని వాడని ఆరు నెలల్లోనే తేలిపోవడంతో మళ్లీ వైసీపీ సైకో బ్యాచ్‌కి పని పెట్టారు. నన్ను బదనాం చేయడానికి ఏమీ దొరక్కపోవడంతో నా పేరుతో ఫేక్ మార్ఫింగ్ పోస్టులు పెట్టించి జగన్ శునకానందం పొందుతున్నారు' అని ఆదివారం ట్విటర్‌లో లోకేశ్ మండిపడ్డారు.



జ్యుడీషియల్ ఆఫీసర్స్ సదస్సులో ప్రసంగిస్తున్న సీజే జేకే మహేశ్వరి

## సత్వర తీర్పుతోనే నమ్మకం

- కేసుల పరిష్కారానికి ప్రణాళిక కీలకం
- త్వరలో ఈ-ఫిర్యాదు వ్యవస్థ అమలు
- మన తీర్పులను ఉటంకిస్తున్న పలు దేశాలు
- ఏపీ ప్రథమ న్యాయాధికారుల సదస్సులో సీజే జస్టిస్ మహేశ్వరి

గుంటూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): "ప్రజల్లోని బలమైన నమ్మకం నుంచి న్యాయవ్యవస్థ శక్తిగా ఉద్భవించింది. అయితే, కోర్టుల్లో వ్యాజ్యాలు వాయిదాలు పడుతుండడంతో ఆ నమ్మకం క్రమేపీ క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో కోర్టులపై ప్రజల్లో విశ్వాసం తిరిగి పెంచుకోవాలంటే కేసుల్లో సత్వర, సమయానుకూల తీర్పులు ప్రకటించాల్సిన అవసరం ఉంది. ఆయా కేసుల పరిష్కారంలో నాణ్యత కూడా ప్రధానమైన అంశం" అని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి అన్నారు. ఉమ్మడి హైకోర్టు విభజన తర్వాత ప్రప్రథమంగా ఆదివారం గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏపీ జ్యుడీషియల్ ఆఫీసర్స్ సదస్సు జరిగింది. ఈ సదస్సులో సీజే జస్టిస్ మహేశ్వరి మాట్లాడుతూ, కేసులను పరిష్కరించడంలో పకడ్బందీ ప్రణాళిక ఎంతో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. న్యాయమూర్తులు పాత కేసుల పరిష్కారం పైనే దృష్టి పెడితే రేపటి రోజున కొత్త కేసులు పాతవి అవుతాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని పాత, కొత్త కేసుల పరిష్కారంలో సమతౌల్యం పాటించాలని సూచించారు. ప్రజలు వారి హక్కులపై అవగాహన ఏర్పరుచుకుంటున్నారని, త్వరలో ఈ-ఫిర్యాదు (ఎఫ్ఐఆర్)ల వ్యవస్థ రాబోతోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఏ రోజు వ్యాజ్యాలు ఆ రోజున విచారణ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తుల బాధ్యత మరింత పెరగనుందన్నారు. జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ ప్రకారం ఏపీలో 1,67,655 మందికి ఒక న్యాయమూర్తి ఉన్నారని తెలిపారు. 5,62,657 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పరిష్కారానికి 529 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారని చెప్పారు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లోని ఎపెక్స్ కోర్టులు తీర్పులు ప్రకటించే సమయంలో మన దేశ తీర్పులను ఉటంకిస్తున్నాయనని సీజే పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పని చేయాలంటే బార్ అండ్ బెంచ్ మధ్య సత్సంబంధాలు ఉండాలని సూచించారు. అడ్వొకేట్లు కూడా కోర్టు అధికారులేనన్న విషయాన్ని మరిచిపోకూడదన్నారు. భవిష్యత్తు యువ న్యాయవాదులేనని, దీనిదృష్ట్యా వారికి శిక్షణ ఇవ్వడం, పైకి తీసుకురావడం వంటివి జడ్జీలు చేపట్టాలని సూచించారు.

### న్యాయమూర్తి దేవుడితో సమానం

"మన దేశంలో దేవాలయం, న్యాయాలయం అంటారు. దీనిని పరిగణనలోకి తీసుకుంటే న్యాయమూర్తిని దేవుడితో సమానంగా భావిస్తారు. జడ్జీ అనే హోదా భగవంతుడు ఇచ్చిన అవకాశంగా పరిగణించాలి. అందరూ తిరుపతిలో దైవాన్ని, మహాకాళిని కొలుస్తారు. మీరు ఎలా ఉండాలని అనుకొంటారో అది మీరే నిర్ణయించుకోవాలి" అని సీజే మహేశ్వరి సదస్సుకు హాజరైన న్యాయమూర్తులకు సూచించారు. ఈ సదస్సులో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాకేశ్‌కుమార్, జస్టిస్ సి. ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం. సీతారామమూర్తి, జస్టిస్ సత్యనారాయణమూర్తి, అన్ని జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు, ఇతర జడ్జీలు పాల్గొన్నారు.

## అంతా జగన్ మాయ!

- వైసీపీ 6 నెలల పాలనపై సీపీఐ



అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరు నెలల వైసీపీ పాలన మిశ్రమ ఫలితాన్నిచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. నవరత్నాల హామీల అమలుకు పూర్తిగా కాకపోయినా కొంత మేరకు కృషి జరిగిందన్నారు. మంత్రివర్గ కూర్పులో సామాజిక న్యాయం పాటించారని, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అంటూ కొత్త ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. కానీ ఇప్పటికే ఉన్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో అభద్రతాభావం నెలకొందన్నారు. కొంతమంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్ష పార్టీలను ఖాతరు చేయడం లేదని, సమిష్టి నిర్ణయాలతో ప్రజారంజక పాలన సాగించడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర మంత్రులకు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అధికారంలేదన్నారు. అంతా జగన్ మయ అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏకపక్ష పాలన జరుగుతోందన్నారు. మరీ చెప్పాలంటే ఏకవ్యక్తి పాలన సాగుతోందని ఆరోపించారు. సీఎం జగన్ ఆరు నెలల పాలనలో ప్రజలకు పెద్దగా ఒనగూరిందేమీ లేదని పెదవి విరిచారు. ఇసుక పాలసీ అంటూ 5 నెలల పాటు ఇసుక సరఫరా నిలిపివేయడంతో 30లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని గుర్తుచేశారు. భవన నిర్మాణ అనుబంధ వ్యాపారాలన్నీ దెబ్బతిని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందన్నారు. అన్న క్యాంటీన్ల మూసివేతతో నిరుపేదలు, దినసరి కూలీలు తిండికి ఇబ్బందులు పడుతున్నారని రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతి రాజధానిని శ్మశానంతో పోలుస్తూ మంత్రి బొత్స చేసిన వ్యాఖ్యలు ప్రజల మనసుల్ని గాయపరిచాయన్నారు.

### 'హోదా' అడిగే సమయం రాలేదు!

- రాజధాని అక్కడే.. అభివృద్ధి వికేంద్రీకరిస్తాం: ఎంపీ భరత్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 1: ప్రత్యేక హోదా అడగటానికి సమయం రావాలని, సమయం వచ్చినప్పుడు అడుగుతామని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. అవకాశం దొరికినప్పుడల్లా కేంద్రాన్ని ప్రత్యేకహోదా కోరుతున్నామని చెప్పారు. ఆదివారం రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్నవన్నీ వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అసలు ప్రత్యేక హోదా మరుగున పడిపోవడానికి కారణం చంద్రబాబేనని ఆరోపించారు. రాజధాని అక్కడే ఉంటుందని, అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందని, విశాఖపట్నం, రాజమహేంద్రవరం తదితర నగరాలన్నీ అభివృద్ధి చెందుతాయన్నారు. కేరళ తరహాలో నీరా డ్రింక్ తయారీపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని, దీనిపై అధ్యయనం చేయాల్సిందిగా అధికారులకు సీఎం జగన్ ఆదేశాలు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

### మంత్రి అవంతి.. అబద్ధాల భవంతి

- జగన్ పాలనలో యువత సంక్షేమం గాలికి..
- టీడీపీ నేతలు మంతెన, బ్రహ్మంచౌదరి విమర్శ

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ ఆరు నెలల పాలనపై మంత్రి అవంతి శ్రీనివాస్ చర్చలకు సిద్ధమా? గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను రద్దు చేయడం, ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు వేసుకోవడం తప్ప, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి ఏమిటో చెప్పగలరా?' అని టీడీపీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు ఆదివారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. మంత్రి అవంతి అబద్ధాల భవంతి అని, ఆయన నోటి నుంచి అవాస్తవాలు తప్ప, నిజాలు రావని విమర్శించారు. ఒలింపిక్ గేమ్స్‌కు... నాన్ ఒలింపిక్ గేమ్స్‌కు తేడా తెలియని అవంతి క్రీడా శాఖ మంత్రిగా కాకుండా అబద్ధాలశాఖ మంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని ఆయన ధ్వజమెత్తారు. కాగా, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం యువత సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మం చౌదరి మరో ప్రకటనలో విమర్శించారు. ప్రత్యేక హోదా సాధనతోనే యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని, ప్రజలను మభ్యపెట్టి కేసుల మాఫీ కోసం ఆరు నెలలుగా హోదాను అటకెక్కించారని ఆరోపించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రోడ్డున పడేశారని, వలంటీర్ల నియామకాల్లో పార్టీ కార్యకర్తలు, ఒక సామాజికవర్గానికే ప్రాధాన్యత ఇచ్చారని ఆయన విమర్శలు గుప్పించారు.

## సీపీఎం కార్యాలయంపై వైసీపీ కార్యకర్తల దాడి

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- ఇద్దరు పోలీసులకు కూడా
- కర్నూలు జిల్లా కేతవరంలో ఉద్రిక్తత

ఓర్వకల్లు, డిసెంబరు 1: కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కేతవరం సీపీఎం కార్యాలయంపై ఆదివారం రాత్రి వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. దీంతో ఆరుగురు సీపీఎం కార్యకర్తలు, ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. కొంతకాలం నుంచి గ్రామ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సీపీఎం కార్యాలయం మెయిన్ గేటును వైసీపీ కార్యకర్తలు ట్రాక్టర్‌తో ఢీకొట్టి లోపలికి ప్రవేశించారు. గమనించిన సీపీఎం కార్యకర్తలు వారిని మందలించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వైసీపీ వర్గీయుల దాడిలో సీపీఎం కార్యకర్తలు వేంకటేశ్వర్లు, వినోద్, వెంకటస్వామి, పద్మావతి, అబ్దుల్‌గఫూర్, మధుసూదన్‌బాబు, కిరణ్ గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఈ ఘర్షణను అడ్డుకోబోయిన హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ కూడా గాయపడ్డారు. తమ పార్టీ కార్యాలయం ముందు ట్రాక్టర్లను అడ్డగా పెడుతున్నారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సీపీఎం కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. దాడికి నిరసనగా పార్టీ కార్యాలయం ముందు ధర్నా చేశారు. విషయం తెలిసిన వెంటనే గ్రామానికి చేరుకున్న కర్నూలు రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి ఇరువర్గాలను చెదరగొట్టారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వైసీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.



తీవ్రంగా గాయపడిన యువకుడు

# ఆ కలెక్టర్ల రూటే సెపరేటు!

(మొదటి పేజీ తరువాయి)

మీడియాలో ఆయన్ను విపరీతంగా పొగడాలి. సీఎంకు, అధికార పార్టీ సోషల్‌మీడియాకు చేరేలా ఆయన్ను ప్రమోట్ చేయాలి. ఇదే ఆ కలెక్టర్‌ను కలవడానికి కావాల్సిన అర్హత. ప్రజల మధ్య కన్నా రైడింగ్ టూర్లు, స్పెషల్ ఫ్రెండ్లీ పార్టీల్లో ఎక్కువగా కనిపిస్తుంటారు. వీటిల్లో పాల్గొనేవారికి కలెక్టర్ హోదాలో సకల ఏర్పాట్లు, రాచమర్యాదలు చేయిస్తుంటారు. ఓవైపు జరుగుతున్నప్పుడే ఆయన అపర ప్రజాబంధువు, ప్రజల కలెక్టర్ అంటూ సోషల్ మీడియాలో హోరెత్తిస్తుంటారు. దీనికోసం కలెక్టరేట్‌లో ఇద్దరు నిపుణులు పనిచేస్తున్నారు. కలెక్టర్ టూర్‌లో ఉన్నప్పుడు ఆయన లేని లోటు కనిపించకుండా ఉండటానికే ఈ ప్రత్యేకమైన ప్రమోషన్. ఇక జిల్లాలో పరిపాలన భారం అంతా జూనియర్లపైనే. కేవలం బలహీనవర్గాల కోసమే గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నామంటారు. ఆయన మాత్రం అక్కడికి రారు. ఈయనెక్కడి కలెక్టర్రా బాబూ... అంటూ ప్రజలు నిట్టూరుస్తూ వెళ్లిపోవడం ప్రతీవారం జరిగే తంతు.

### రాజకీయ సేవలో....

ప్రభుత్వానికి అత్యంత కీలకమైన జిల్లా అది. నమ్మకస్తుడు, నిజాయితీపరుడని పేరున్న వ్యక్తిగా భావించి కలెక్టర్‌గా నియమిస్తే, ఆయన ప్రజాపాలన మరచి రాజకీయ సేవలో తరించిపోతున్నారు. పాలనా వ్యవహారాలు పక్కనపెట్టి, సచివాలయం మొదలు ఆయా శాఖల్లో ఎవరు, ఏ పోస్టులో ఉండాలో, ఎవరిని, ఎక్కడ నియమించాలో ప్రభుత్వ పెద్దలకే దిశానిర్దేశం చేస్తుంటారు. ఏ శాఖాధిపతిగా ఎవరుండాలో సిఫారసు చేస్తుంటారు. జిల్లాస్థాయిలో వైసీపీ నేతలు ఏ పనిచేయాలి? ఏ విషయంలో తలదూర్చాలో కూడా పైనుంచి చెప్పిస్తుంటారని, రోజంతా ఆయనకు ఇదే పని ఉంటారని చెబుతున్నారు. ఇటీవల ఓ ప్రాజెక్టు గురించి మాట్లాడేందుకు ఓ పెద్దమనిషి కలెక్టర్ అపాయింట్‌మెంట్ కోరారు. ఓ వైపీసీ నేత పేరుచెప్పి ఆయనతో ఫోన్ చేయించుకొని రావాలని చెప్పించి, ఆ ఫోన్ వచ్చాకే అపాయింట్‌మెంట్ ఇచ్చారట. పేదలకు ఇళ్లు ఇచ్చే విషయంలోనూ లబ్ధిదారుల ఎంపిక జాబితాపై నియోజకవర్గం వారీగా ఎమ్మెల్యేల ఆమోదం తీసుకోవాలని, వారి అనుమతి లేకుండా ఏ ఒక్కరి పేరు చేర్చవద్దంటూ హుకుం జారీ చేయడం అధికారులను విస్మయానికి గురిచేస్తోంది. ఇక నోరు తెరిస్తే మంచిమాటల కన్నా బూతులే ఎక్కువగా వస్తాయని ఆయనకు పేరుంది. అధికారులను పచ్చిబూతులు తిట్టడం ఆయన శైలిగా చె బుతున్నారు. ఇటీవల ఓ వైసీపీ నేతపై సైతం ఇదే భాష ప్రయోగించడంతో రచ్చయిందని నేతలు పేర్కొంటున్నారు.

### బాబు బంగారం

తీవ్ర దుర్భిక్ష పరిస్థితులున్న జిల్లాకు కలెక్టర్‌గా ఉన్న ఆయన్ను ప్రసన్నం చేసుకోవాలంటే బంగారం చేతులు మారాల్సిందే. గతంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పనిచేసినప్పుడు బాబు బంగారంగా పేరుతెచ్చుకున్న ఆయన ఇప్పుడు కలెక్టర్ హోదాలో గోల్డెన్ కౌంటర్ తెరిచారని నేతలే బాహాటంగా విమర్శిస్తున్నారు. జిల్లా మంత్రి, ఎంపీలు, నేతలతో బాగా సన్నిహితంగా ఉంటూ, అదే తన అద్భుతమైన పనితీరుగా సోషల్ మీడియాలో ప్రచారం చేయించుకుంటున్నారని, దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని వాపోతున్నారు. కరువు నేలలో బంగారం పండిస్తున్న కలెక్టర్ అని సోషల్ మీడియాలో హోరెత్తిస్తారని, కానీ రైతుల కష్టాలు, ప్రజల ఇబ్బందులపై ఇప్పటిదాకా ఒక్క సమీక్ష కూడా చేయలేదని మండిపడుతున్నారు. అధికారికంగా ఓ మీటింగ్‌లో పాల్గొంటే పట్టుమని పదినిమిషాలు కూడా ఉండరంటున్నారు. ఆయన ఆ సమావేశంలో పాల్గొనడమే మహాభాగ్యం అన్నట్లుగా, ఆ పదినిమిషాల కార్యక్రమాన్ని సోషల్‌మీడియాలో విపరీతంగా ప్రచారం చేయిస్తారని చెబుతున్నారు.

### ఆ ఎమ్మెల్యే చెబితేనే....

ప్రభుత్వానికి కోస్తాలో బాగా రాజకీయ పట్టు ఉన్న జిల్లా అది. అక్కడ ఓ ఎమ్మెల్యేకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశాలున్నాయి. ఆయన ఆ ఎమ్మెల్యే మాటే వింటారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అంతా ఆయనముందు దిగదుడుపే. ప్రభుత్వ పెద్దకు సన్నిహితుడైన సదరు ఎమ్మెల్యే చెబితేనే సమీక్షలు నిర్వహిస్తారు. తనిఖీలు చేస్తారు. ఇతర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఏదైనా పనికోసం వెళ్తే ముందు ఆ ఎమ్మెల్యేతో ఫోన్ చేయించాలని చెబుతారట. కాదు కూడదంటే ఇక ఆ పనికానట్లే. ఇటీవల ఓ మంత్రి తనకు పని ఉందని కలెక్టర్‌ను కలుస్తానంటే ఇదే మాట చెప్పారట. ఈ కలెక్టర్ తమమధ్య మరింత మంటపెడుతున్నారని అధికారపార్టీ ఎమ్మెల్యేలు వాపోతున్నారు.

### పాములంటే భయం

ఈ కలెక్టర్‌కు పాములంటే భయం. గతంలో కలెక్టర్ అధికారిక నివాసంలో పాములు వచ్చిన ఉదంతాలు ఉండటంతో ఆయన కలతచెందారు. కలెక్టరేట్ నుంచి ఆయన క్యాంపు ఆఫీసులోకి వెళ్తే బయటకే రారని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఎక్కడ తన గదిలోకి పాములు వస్తాయోనన్న భయంతో రక్షణ కోసం ఓ గదిని ప్రత్యేకంగా తయారుచేయించుకున్నారట. ఆ గదిలోకి వెళ్లారంటే బయటివారెవ్వరికీ దొరకరని అంటున్నారు.

### పలుకుబడి ఉంటేనే పనులు

ఈ కలెక్టర్లు అధికార పార్టీ నేతలందర్నీ గౌరవిస్తారనుకుంటే పొరపాటే. దానికీ ఓ లెక్క ఉంటుంది. పైస్థాయిలో ఎవరికి పలుకుబడి ఉంటే వారినే దగ్గరికి రానిస్తారు. వారికే పనులు అవుతాయి. మిగతా వారంతా బలాదూర్.



తిరుమల ఆలయం ముందు కురుస్తున్న వర్షం

## కొండపై రెండో రోజూ జోరు వాన

తిరుమల/ఒంగోలు, డిసెంబరు 1: తిరుమలలో రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. శనివారం ఉదయం ప్రారంభమైన వర్షం ఆదివారం ఉదయం 10గంటల వరకు పడుతూనే ఉంది. పొగమంచు దట్టంగా అలుముకోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కారణంగా సహస్రదీపాలంకరణసేవను వైభవోత్సవ మండపంలో నిర్వహించారు. కాగా, ప్రకాశం జిల్లాలో ఆదివారం విస్తారంగా వర్షాలు కురిశాయి.

## రాష్ట్రం పరిధిలోకి డీమ్డ్ వర్సిటీలు?

(మొదటి పేజీ తరువాయి)

యూజీసీ పరిధిలోకి వస్తాయి. యూజీసీ చట్టం-1956లో సెక్షన్-3 ప్రకారం ఈ వర్సిటీలకు యూజీసీ నిబంధనలు మాత్రమే వర్తిస్తాయి. ఇదే విషయాన్ని అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ)కి సంబంధించిన అంశాల్లో సుప్రీం కోర్టు కూడా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర చట్ట పరిధిలోకి డీమ్డ్ వర్సిటీలను తీసుకురావాలన్న ప్రతిపాదన రావడం చర్చనీయాంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల చట్టం-1991 ప్రకారం ఏర్పడిన స్టేట్ వర్సిటీలకు విశేషాధికారాలు ఉన్నాయి. స్వయంప్రతిపత్తి ఉన్న వీటిని కూడా కమిషన్ చట్ట పరిధిలోకి తీసుకొచ్చే దిశగా ఏర్పాట్లు జరుగుతుండటంతో వర్సిటీల్లో అలజడి మొదలైంది. అలాగే రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కాలేజీలను కూడా ఈ చట్టం కిందకు తీసుకురావాలన్న ప్రతిపాదన ఉంది. ఉన్నత విద్య నియంత్రణ కమిషన్ చట్టం ప్రకారం.. ఉన్నత విద్యామండలి, వర్సిటీల సహకారంతో విద్యాసంస్థల్లో ప్రమాణాల పెంపునకు కమిషన్ కృషి చేయాలి. కానీ చట్ట సవరణ ప్రతిపాదన దీనికి విరుద్ధంగా ఉందని పలువురు విద్యావేత్తలు పేర్కొంటున్నారు. యూజీసీ నిబంధనలు, సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధంగా తాజా ప్రతిపాదన ఉందంటున్నారు.

## ప్రకృతి సేద్యం కోసం ఏపీకి 550.94 కోట్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తోందని, దీనిపై రైతుల్లో చైతన్యం కలిగించడం, శిక్షణ వంటి కార్యక్రమాల కోసం రాష్ట్రాలకు ఆర్థిక సహకారం అందిస్తుందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. ఎన్సీపీ ఎంపీ వందనా చావన్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక జవాబిచ్చారు. ఏపీలో 2015 సెప్టెంబరులోనే రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై), పరంపరాగత్ కృషీ వికాస్ యోజన(పీకేవీవై) కింద ప్రకృతి సేద్య విధానం ప్రారంభమైందని తెలిపారు. 2018-19, 2019-20లో ఏపీలో జీరో బడ్జెట్ ప్రకృతి సేద్యానికి కేంద్రం రూ.550.94 కోట్లు కేటాయించగా ఇప్పటివరకూ రూ.280.56 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

## మంటల్లో మనుగడ!



మడగాస్కర్ అడవుల్లో కనిపించే మలగాసీ సర్పమిది (బొవా కన్‌స్ట్రిక్టర్). వీటి ఆవాసాల్లో మానవుల కదలికలు పెరిగిపోవడం.. వారు వేసే మంటల వల్ల ఈ సర్పాల మనుగడ ప్రమాదంలో పడింది. వాటిసమస్యను చూపేలా యూనివర్సిటీ ఆఫ్ వాలెన్షియాకు చెందిన పోస్ట్‌డాక్టొరల్ రిసెర్చర్ రాబెర్టో తీసిన ఈ ఫొటో బ్రిటిష్ ఎకలాజికల్ సొసైటీ ఫొటోగ్రఫీ పోటీలో ప్రథమబహుమతి పొందింది.



బ్రహ్మపుత్ర నుంచి
## 'దేవతామూర్తులు'
లక్ష్మి, సరస్వతి.. 29 విగ్రహాలు

బ్రహ్మపుత్ర నది నుంచి శివుడు, సరస్వతి, కృష్ణుడు, గణపతి, లక్ష్మి రూపంలో 29 విగ్రహాలు సహా 42 వస్తువులు బయల్పడ్డాయి. వెండి, రాగితో చేసిన ఈ దేవుళ్ల విగ్రహాలు, పూజావస్తువులు, దీప స్తంభాలు, శంఖులు, లోహ వస్తువులు నదిలోకి ఎలా వచ్చాయని అధికారులు తలపట్టుకుంటున్నారు. అసోంలోని ఉజాన్ బజార్ ఘాట్ వద్ద సానూ అలీ అనే వ్యక్తి స్నానం చేస్తుండగా ఇవి కనిపించాయి.- గువాహటీ

## లోక్‌పాల్ ఆఫీసు అద్దె రూ.3.85 కోట్లు

- అక్టోబరు 31 నాటికి దాదాపు 1160 కేసులు
- ఒక్క దాంట్లోనూ ప్రారంభం కాని పూర్తిస్థాయి విచారణ

న్యూఢిల్లీ, డిసెంబరు 1: అత్యున్నత స్థాయి నేతల అవినీతిపై విచారించే అధికారం ఉన్న 'లోక్‌పాల్' వ్యవస్థ ఏర్పాటై 8 నెలలవుతోంది. ఈ ఏడాది అక్టోబరు 31 నాటికి లోక్‌పాల్ వద్దకు దాదాపు 1160 కేసులు వచ్చాయి. అందులో ఒక్క దాంట్లోనూ పూర్తి స్థాయి విచారణ ప్రారంభించలేదు! లోక్‌పాల్ ఆఫీసు అద్దె మాత్రం రూ.3.85 కోట్లు అయింది. సమాచార హక్కు చట్టం కింద శుభం ఖత్రి(18) అనే విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఏడాది మార్చిలో తొలి లోక్‌పాల్‌గా జస్టిస్ పి.సి.ఘోష్ నియమితులైన సంగతి తెలిసిందే. ఆయనతో పాటు లోక్‌పాల్ కమిటీలో 8 మంది సభ్యులుంటారు. వారి కార్యకలాపాల కోసం ఢిల్లీలోని ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్ అశోకాలో 12 గదులను తాత్కాలిక కార్యాలయంగా ఏర్పాటు చేశారు. వాటి అద్దె నెలకు రూ.50 లక్షలు. అది ఇప్పటికీ వారి కార్యాలయంగా కొనసాగుతోంది. మరో విషయమేంటంటే లోక్‌పాల్‌కు చేయాల్సిన ఫిర్యాదులకు సంబంధించి ఇంతవరకూ అధికారిక ఫార్మాట్ ఏమీ లేదని ఆర్టీఐ సమాధానంలో పేర్కొన్నారు. కాగా, "లోక్‌పాలా? జోక్‌పాలా? హోటల్ ఆఫీసు ఖరీదు నెలకు రూ.50 లక్షలు" అని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలా విమర్శించారు.

ఆడవారితో ఎలా వ్యవహరించాలో
## మగవాళ్లకు నేర్పాలి: భాగవత్


మోహన్ భాగవత్‌తో వేదికపై కాంగ్రెస్ నేత జనార్దన్ ద్వివేది

న్యూఢిల్లీ, డిసెంబరు 1: మహిళలతో ఎలా వ్యవహరించాలో పురుషులకు నేర్పాల్సిన అవసరం ఉందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. మహిళలను గౌరవించాలని, ఆ సంస్కారం కుటుంబం నుంచి అలవడాలని చెప్పారు. ప్రతి విషయాన్నీ ప్రభుత్వానికే వదిలేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఇక్కడ జరిగిన గీతా మహోత్సవంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో వెటర్నరీ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండించారు. మహిళలను గౌరవించాలని కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ కూడా కోరారు.

## హత్యాచార నిందితులను ఉరి తీయాలి: ఇమామ్

న్యూఢిల్లీ, డిసెంబరు 1: హైదరాబాద్ శివార్లలో యువతిపై హత్యాచారానికి పాల్పడినవారిని బహిరంగంగా ఉరి తీయాలని ఆలిండియా ఇమామ్‌ల సంఘం అధ్యక్షుడు ఉమర్ అహ్మద్ ఇలియాసి డిమాండ్ చేశారు. భగవద్గీతపై ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన 'గీతా ఉత్సవం'లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో కలిసి ఇలియాసి వేదిక పంచుకున్నారు. ముస్లింల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని అయోధ్యపై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం సంబరాలు జరుపుకోకుండా హిందువులు సంయమనం పాటించారని పేర్కొన్నారు.

# 'హిందుత్వ'ను వీడబోము

## నన్ను వ్యతిరేకించిన వారు ప్రస్తుతం నాతో ఉన్నారు.. నేను లక్కీ సీఎంను: ఉద్ధవ్

- ప్రతిపక్ష నేతగా ఫడణవీస్ ఏకగ్రీవ ఎన్నిక
- ప్రైవేటు ఉద్యోగాలు 80 శాతం స్థానికులకే
- త్వరలో చట్టం చేస్తాం: మహారాష్ట్ర గవర్నర్


మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన నానా పటోలేను అభినందిస్తున్న సీఎం ఉద్ధవ్ ఠాక్రే

ముంబయి, డిసెంబరు 1: ఎన్సీపీ, కాంగ్రెస్‌లతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా.. హిందుత్వ భావజాలాన్ని శివసేన వీడబోదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్‌పై ప్రశంసలు కురిపించారు. ఆదివారం నిర్వహించిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ప్రతిపక్ష (బీజేపీ) నేతగా ఫడణవీస్, స్పీకర్‌గా నానా పటోలె ఎన్నికైన సందర్భంగా సభ్యులనుద్దేశించి ఉద్ధవ్ ప్రసంగించారు. ఫడణవీస్ నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని, ఆయనతో ఎప్పటికీ స్నేహంగానే ఉంటానని ప్రకటించారు. 'మిమ్మల్ని (ఫడణవీస్‌ను) ప్రతిపక్ష నేతగా సంభోదించను. బాధ్యత గల నేత అని పిలుస్తాను. మీరు మాతో బాగుండి ఉంటే బీజేపీ, శివసేన విడిపోయేవి కావు' అని ఉద్ధవ్ వ్యాఖ్యానించారు. గత ఐదేళ్లలో బీజేపీ ప్రభుత్వానికి తాము ఏనాడూ నమ్మకద్రోహం చేయలేదని గుర్తు చేశారు.

ఇక తాను లక్కీ సీఎంను అని ఉద్ధవ్ అన్నారు. తనను వ్యతిరేకించినవారు ప్రస్తుతం తనతో ఉన్నారని, తనతో కలిసి ఉన్నవారు ఇప్పుడు ప్రత్యర్థులుగా ఉన్నారని పేర్కొన్నారు. అంతకుముందు బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఫడణవీస్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరోవైపు అసెంబ్లీ స్పీకర్ పదవికి కిషన్ కిశోర్‌ను పోటీకి దించిన బీజేపీ.. ఆదివారం తమ అభ్యర్థిని ఉపసంహరించుకుంది. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే నానా పటోలె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు.. ప్రైవేటు పరిశ్రమల్లో 80 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇచ్చేలా త్వరలో చట్టం చేయబోతున్నట్లు గవర్నర్ బీఎస్ కోశ్యారి తెలిపారు. ఆదివారం ఉభయ సభలనుద్దేశించి ఆయన ప్రసంగించారు.

## వారిది రెండు నాల్కల ధోరణి

- అయోధ్య తీర్పుపై సమీక్ష కోరడంపై శ్రీశ్రీ రవిశంకర్
- 99% ముస్లింలు కోరుతున్నారు: ముస్లిం బోర్డు



కోల్‌కతా, డిసెంబరు 1: అయోధ్య తీర్పుపై సమీక్ష కోరాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, జమాయతే ఉలేమా-ఎ-హింద్ నిర్ణయించడం రెండు నాల్కల ధోరణి అని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ విమర్శించారు. అయోధ్య వివాదాన్ని సుప్రీంకోర్టు పరిష్కరించిన తర్వాత కూడా ఘర్షణ వాతావరణం సృష్టించడానికి ముస్లిం పర్స నల్ లా బోర్డు, జమాయతే ఉలేమా-ఎ-హింద్ ప్రయత్నిస్తున్నాయని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి ముఖ్తర్ అబ్బాస్ నఖ్వీ ఆరోపించారు. ప్రజల దృష్టిలో అయోధ్య వివాదం ముగిసిపోయిందని పేర్కొన్నారు. కాగా, దేశంలో 99% మంది ముస్లింలు సమీక్ష కోరుకుంటున్నారని ముస్లిం పర్సనల్ లా బోర్డు పేర్కొంది.

## రాజకీయాల్లోకి బ్రహ్మానందం!

- కర్ణాటక ఉప ఎన్నికల్లో బీజేపీ తరపున ప్రచారం
- చిక్కబళ్లాపురలో రోడ్ షో చేసిన హాస్యబ్రహ్మ



బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ హాస్యనటుడు బ్రహ్మానందం రాజకీయ అరంగేట్రం చేయనున్నారా? కర్ణాటకలో ఉపఎన్నికల్లో ఆయన బీజేపీ తరపున ప్రచారం చేయడం చర్చకు కారణమైంది. ఏపీ సరిహద్దులోని చిక్కబళ్లాపుర నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి డాక్టర్ సుధాకర్ తరపున శనివారం ఆయన రోడ్ షో నిర్వహించారు. దీంతో బ్రహ్మానందం బీజేపీలో చేరే ఆలోచనలో ఉన్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి. చిక్కబళ్లాపుర, బాగేపల్లి, గౌరిబిదనూరు నియోజకవరాల్లో తెలుగు మాట్లాడేవారు ఎక్కువ. తెలుగు సినీ నటుల ప్రభావం కూడా ఈ ప్రాంతంలో ఎక్కువే. 2018లో చిక్కబళ్లాపుర అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నవీన్ కిరణ్ తరపున జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రచారం చేశారు.

అమెరికాలో విజయవాడ
## యువకుడి దుర్మరణం

- మరో భారతీయ విద్యార్థి కూడా మృతి


వైభవ్

వాషింగ్టన్, డిసెంబరు 1: అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భారతీయ విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ఒకరిని విజయవాడకు చెందిన వైభవ్ గోపిశెట్టి(26)గా గుర్తించారు. టెనెస్సీ స్టేట్ యూనివర్సిటీలో వైభవ్ ఫుడ్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. అక్కడే ఎమ్మెస్ చేస్తున్న జూడీ స్టాన్లీ పినీరియో(23)తో కలసి గురువారం రాత్రి ఓ పార్టీకి వెళ్లారు. అక్కడినుంచి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారును ఓ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ డేవిడ్ టోర్రెస్ వాహనం అక్కడే వదిలి పరారైనట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, తమ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు భారతీయ విద్యార్థులు మృతి చెందడం పట్ల టీఎస్‌యూ తీవ్ర సంతాపం ప్రకటించింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఈ ఘటన దురదృష్టకరమని, అట్లాంటాలోని భారత రాయబార కార్యాలయం బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందజేస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## ప్రార్థన స్థలాల చట్ట సవరణ

- మోదీని కోరిన సుబ్రమణ్యస్వామి

న్యూఢిల్లీ, డిసెంబరు 1: ప్రార్థన స్థలాల చట్టాన్ని సవరించాలని కోరుతూ ప్రధాని మోదీకి బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి లేఖ రాశారు. 1991లో పీవీ నరసింహారావు సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చిందని పేర్కొన్నారు. పవిత్ర కట్టడాల మతపరమైన స్వభావం 1947 ఆగస్టు 15 నాటికి ఎలా ఉందో అలాగే కొనసాగించాలని ఈ చట్టం చెబుతోంది. వారాణసీ, మథురల్లో రెండు మసీదులపై వివాదం ఉన్న నేపథ్యంలో సుబ్రమణ్యస్వామి లేఖ ప్రాధాన్యత సంతరించుకుంది.



చైనాలో ఫోన్ వాడాలంటే..
## ముఖం స్కాన్ చేయాల్సిందే!!

బీజింగ్, డిసెంబరు 1: చైనాలో ఇకపై మొబైల్‌ఫోన్ కొనే, వాడే వారంతా ముఖాన్ని స్కాన్ చేయాల్సిందే. దేశ ప్రజలకు పటిష్టమైన సైబర్ భద్రత కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చైనా ప్రభుత్వం ప్రకటించింది. సెప్టెంబరులోనే ప్రకటించిన ఈ నిబంధన ఆదివారం నుంచి అమల్లోకి వచ్చింది. మొబైల్ వినియోగదారులంతా అసలు పేర్లు, చిరునామాలతోనే ఫోన్లు కొనే నిబంధనలను చైనా గత కొన్నేళ్లుగా అమలుచేస్తోంది.

## నాడు-నేడు పర్యవేక్షణకు 'పీఎంయు'

- నాణ్యత, పర్యవేక్షణ బాధ్యత అప్పగింత

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ప్రాజెక్టు మోనిటరింగ్ యూనిట్(పీఎంయు)ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు, పర్యవేక్షించేందుకు ఆర్‌అండ్‌బీలో ఇంజనీర్ ఇన్‌చీఫ్‌గా పనిచేసి రిటైర్ అయిన ఎఫ్‌సీఎస్ పీటర్‌ను పీఎంయు హెడ్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నాడు-నేడు కార్యక్రమంలో సమయానికి అనుగుణంగా ప్రాజెక్టు పనులు చేయించడం, కొనుగోలు ప్రక్రియలు పారదర్శకంగా జరిగేలా చూడడం, ప్రాజెక్టులను నాణ్యతగా చేయించడం వంటి బాధ్యత పీఎంయుకేదే.

## హైకోర్టులో ముందస్తు బెంచీలు

- నేషనల్ లోక్ అదాలత్ కోసం ఏర్పాట్లు

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో డిసెంబరు 14న జరిగే నేషనల్ లోక్ అదాలత్‌కు సంబంధించిన కేసుల పరిష్కారానికి డిసెంబరు 2 నుంచి హైకోర్టులో ముందస్తు బెంచీలు ఏర్పాటు చేస్తున్నట్లు హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ సెక్రటరీ ఎంవీ రమణకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న వాహన ప్రమాద అప్పీళ్లు, సర్వీస్, పెన్షన్ రిట్‌లు, రెవెన్యూ కేసులు, ల్యాండ్ ఎక్విజేషన్ అప్పీళ్లు, చెక్‌బౌన్స్ అప్పీళ్ల వంటి కేసులు నేషనల్ లోక్ అదాలత్‌లో పరిష్కరించనున్నట్టు తెలిపారు. వివరాలకు 0863-2372604 ఫోన్ నెంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

వ్యవసాయాన్ని 'ఉపాధి'తో
## అనుసంధానించలేం: తోమర్

న్యూఢిల్లీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంతో వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేయడం అసాధ్యమని కేంద ప్రభుత్వం ప్రకటించింది. వ్యవసాయ రంగాన్ని ఈ పథకంతో అనుసంధానం చేసి వ్యవసాయ, రైతు కూలీలను ఆదుకోవాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రాజకీయ పక్షాలన్నీ చాలాకాలంగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజ్యసభ సభ్యుడు బండ ప్రకాశ్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. 'ఉపాధి'తో వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేయలేమని తేల్చిచెప్పారు. ఈ పథకం కింద ఇప్పటికే 260రకాల పనులను గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్నామని, జిల్లాస్థాయిలో 60శాతం పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇది కేవలం గ్రామీణ నిరుపేదలకు ఉపాధి కల్పించడానికి ఉద్దేశించినదని, నిరంతరం ఉపాధి కల్పించే పథకం కాదనిస్పష్టం చేశారు.

## దంతెవాడలో మహిళా నక్సల్ అరెస్టు

- నేటి నుంచి పీపుల్స్ లిబరేషన్ వారోత్సవాలు

దంతెవాడ, డిసెంబరు 1: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఓ మహిళా నక్సల్‌ను భద్రతా దళాలు అరెస్టు చేశాయి. ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) వారోత్సవాలు నిర్వహించనున్నారు. దీనిపై సుర్నార్ గ్రామంలో ఆదివారం ప్రచారం నిర్వహిస్తుండగా గంగా ముచకి(20)ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నక్సల్స్ అక్కడి నుంచి పారిపోయారు. ముచకి నక్సల్స్ సాంస్కృతిక విభాగం చేతన నాట్య మండలి(సీఎన్ఎం) సభ్యురాలని పోలీసులు తెలిపారు. పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో నక్సల్ ప్రభావిత జిల్లాలన్నింటిలోనూ పెట్రోలింగ్ ముమ్మరం చేశామని చెప్పారు.

ఆశానిరాశల్లో
# రాజధాని రియల్టీ!

- భరోసా ఇవ్వని సీఎం ప్రకటన

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజధానిలో గత 6 నెలలుగా ఆగిన గవర్నమెంట్ హౌసింగ్ టవర్లు పూర్తి చేయడంతోపాటు ల్యాండ్ పూలింగ్ స్కీమ్(ఎల్పీఎస్) జోన్లనూ అభివృద్ధి చేస్తామన్న ముఖ్యమంత్రి జగన్ ప్రకటన... రాజధాని రైతులతోపాటు అమరావతి శ్రేయోభిలాషులకు ఊరటనిచ్చింది. జగన్ ప్రభుత్వ వైఖరితో రాజధానిగా అమరావతి కొనసాగుతుందా లేదా మరెక్కడికైనా తరలిపోనుందా అనే సందేహం 6 మాసాలకుపైగా పలువురిని కలచి వేస్తున్న నేపథ్యంలో.. మామూలుగానైతే సీఎం ప్రకటనతో రాజధాని రియల్టీ ఒక్కసారిగా ఊపందుకోవాలి. అయితే ఒకపక్క సానుకూల ప్రకటన చేస్తూనే, మరొకపక్క రాజధానికి అత్యంత కీలకమైన అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం- శాఖాధిపతుల కార్యాలయాలపై నిర్ణయాన్ని నిపుణుల కమిటీ నివేదిక మేరకే తీసుకుంటామని సీఎం పేర్కొనడంతో అమరావతిపై స్పష్టత రానట్లయింది! హౌసింగ్ టవర్లు, ఎల్పీఎస్ జోన్ల అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామనడం హర్షణీయమే అయినా రాజధాని అనే పదానికి సార్థకత చేకూర్చే ముఖ్యమైన శాసనసభ, సచివాలయం, హైకోర్టులపై నిర్ణయం తర్వాత తీసుకుంటామనడంతో వాటి సంగతి ఏమవుతుందోనన్న సందిగ్ధత కొనసాగుతూనే ఉంది! కొందరు అనుమానిస్తున్నట్లుగా వీటిన్నింటినీ, లేదా కొన్నింటిని అమరావతి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించాలని నిపుణుల కమిటీ సూచిస్తే, అమరావతికి కష్టకాలమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే హౌసింగ్ టవర్ల పూర్తితోపాటు ఎల్పీఎస్ జోన్లను అభివృద్ధి చేసినా అమరావతి రియల్టీకి పెద్దగా ఒనగూరే ప్రయోజనం ఏ మీ ఉండబోదన్న వాదన ఉంది.

### ఇప్పుడే కొనడమెందుకు?

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమరావతిలో నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్లాట్ల ధరలు భారీగా పతనమై, దిక్కు తోచని స్థితిలో ఉన్న రాజధాని రియల్టీకి సీఎం ఇటీవల చేసిన ప్రకటన కొంత మేలు చేకూర్చిన మాట వాస్తవమే. దీంతో నెలలుగా నీరసించిన ఈ ప్రాంత రియల్టర్లు, ప్లాట్ల యజమానులు తిరిగి తమకు మంచి రోజులు వచ్చినట్లేనని ఆశ పడ్డారు. ప్లాట్ల కోసం పలువురు ఎంక్వైరీలు చేయడం మొదలెడతారని, క్రమేపీ వాటి క్రయవిక్రయాలు ఊపందుకుంటాయని భావించారు. కానీ వారనుకున్నట్లుగా జరగడం లేదని క్షేత్రస్థాయి పరిస్థితులనుబట్టి తెలుస్తోంది. ఇందుకు కారణం.. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం-హెచ్‌వోడీ కార్యాలయాలు ఎక్కడ వస్తాయో రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసే వరకూ ఆగడమే మేలని పలువురు భావించడమే. ఇప్పటికిప్పుడు హడావిడి పడి, రాజధానిలో ప్లాట్లను కొని, రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని నిరీక్షించే బదులు... రాజధానిపై పూర్తి స్పష్టత వచ్చాకే అడుగు ముందుకేయడం శ్రేయస్కరమన్నది అభిప్రాయం.

### తర్వాత విక్రయిద్దాం..!

రాజధానిలోని తమ ప్లాట్లను తక్కువ ధరలకైనా విక్రయిద్దామనుకుంటున్న వారు సైతం ఆ ఆలోచనను వాయిదా వేసుకుంటున్నారు. ఎన్నికల సమయంతో పోల్చితే దాదాపు 40-50% పడిపోయిన ధరలకు కూడా విక్రయించేందుకు సిద్ధమైన వారు సీఎం ప్రకటనతో ధరలు గణనీయంగా పుంజుకుంటాయేమోనన్న ఆశతో ఉన్నారు. పైగా అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ అమరావతిలోనే ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే రేట్లకు రెక్కలు వస్తాయనుకుంటున్న వారు ఇంకొన్ని రోజులు ఆగడమే లాభదాయకమని భావిస్తున్నారు.

## నకిలీ కరెన్సీ ముఠా అరెస్టు

- విశాఖ పోలీసుల అదుపులో ముగ్గురు
- భారీగా నకిలీ 2వేల నోట్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నకిలీ రూ.2వేల నోట్లు చూపుతున్న సీపీ ఆర్‌కే మీనా, పోలీసు అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీ నోట్లను చెలామణి చేస్తున్న ముగ్గురిని విశాఖ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.2.96 లక్షల విలువైన నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. వీటిలో రూ.2,000, రూ.100 నకిలీ నోట్లు ఉన్నాయి. ఆ వివరాలను నగర పోలీస్ కమిషనర్ ఆర్కే మీనా ఆదివారం మీడియాకు వెల్లడించారు. విశాఖ నగరంలోని ఇసుకతోట రామాలయం వీధికి చెందిన కడవల నాగ వెంకట సత్యనారాయణ(49) రియల్‌ఎస్టేట్ వ్యాపారి. శివాజీపాలెం కృష్ణుడి గుడి వద్ద నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన రౌతు జయరాం(30)ను తన కారుడ్రైవరుగా పెట్టుకున్నాడు. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన బొంత పద్మారావు అలియాస్ చిన్నిదొర(42)తో సత్యనారాయణకు పరిచయం ఏర్పడింది. తనకు తెలిసిన చాలామంది నకిలీ కరెన్సీ చెలామణితో బాగా సంపాదిస్తున్నారని వారిద్దరికీ చిన్నిదొర ఆశపెట్టాడు. అనంతరం వారిని చోడవరం మండలానికి చెందిన షేక్ అబ్దుల్ రెహ్మాన్, రాజమండ్రికి చెందిన సయ్యద్ ముజిబుర్ రెహ్మాన్‌ల వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ రూ.1.17 లక్షల అసలు కరెన్సీ నోట్లు ఇచ్చి, రూ.3 లక్షల విలువైన నకిలీ కరెన్సీ(రూ.2000 నోట్లు) తీసుకున్నారు. చోడవరంలోని ఓ పెట్రోల్ బంక్‌లో రెండు నోట్లు మార్చారు. అనంతరం విశాఖకు వచ్చారు. హెచ్‌బీకాలనీలోని స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ వద్ద ఆ ముగ్గురూ నకిలీ నోట్లు మార్చుతున్నట్టు ఎంవీపీ పోలీసులకు సమాచారం అందడంతో సీఐ షణ్ముఖరావు, సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నకిలీ కరెన్సీ నోట్లు, రూ.7,000 అసలు కరెన్సీ, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారికోసం గాలిస్తున్నామని సీపీ తెలిపారు.

### అసలు కరెన్సీకి తీసిపోని విధంగా..

పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ రూ.2,000 నోట్లు అసలు నోట్ల మాదిరిగానే వాటర్ మార్క్, గాంధీ బొమ్మతో ఉన్నాయని సీపీ చెప్పారు. నకిలీ నోట్లనే అనుమానమే తలెత్తని విధంగా ఉన్నాయన్నారు. నకిలీనోట్ల ముద్రణలో నిష్ణాతులే వీటిని తయారు చేసినట్టు భావిస్తున్నామన్నారు. అసలు, నకిలీ నోట్లను పక్కపక్కన పెట్టి క్షుణ్ణంగా పరిశీలిస్తేనే చిన్నపాటి తేడాలు కనిపిస్తాయన్నారు.

## ప్రైవేటు దూకుడుకు కళ్లెం

- చార్జీల నిర్ణయంలో ప్రభుత్వానిదే అజమాయిషీ
- ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నద్ధం

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రయాణ, రవాణా చార్జీల వసూలులో ప్రైవేటు ఆపరేటర్ల దూకుడుకు ప్రభుత్వం కళ్లెం వేయనుంది. చార్జీల నిర్ణయంలో ఇష్టారాజ్యానికి త్వరలోనే చెక్ పెట్టనుంది. చార్జీలపై నియంత్రణ కోసం ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ తరహాలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు దిశగా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ప్రైవేటు వాహనాలతోపాటు ప్రభుత్వ రంగంలోనూ రవాణా, ప్రయాణ చార్జీలపై ఈ కమిషనే తుది నిర్ణయం తీసుకునేలా విధివిధానాలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలకు ప్రైవేటు ఆపరేటర్లు ఇష్టానుసారంగా ప్రయాణికుల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా సంక్రాంతి, దసరా, దీపావళి పండగ సీజన్లలో ఆమాంతం చార్జీలు పెంచేస్తూ, ప్రయాణికుల నుంచి అందినంత దోచుకుంటున్నారు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో 'ఆంధ్రప్రదేశ్ మోటార్ వాహనాల (ప్రయాణ చార్జీలు) నియంత్రణ కమిషన్' ఏర్పాటుకు సంబంధించిన ముసాయిదా బిల్లు రూపకల్పనకు నడుంబిగించినట్లు తెలిసింది. ఈ కమిషన్‌లో ఎవరెవరు సభ్యులుగా ఉండాలో నిర్ణయించడానికి హైకోర్టు జడ్జి, లేదా హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు కానుంది. డిసెంబరు 9వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ కమిషన్‌కు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. బిల్లు ఆమోదం పొంది చట్టం రూపం దాలిస్తే ప్రైవేటు, ప్రభుత్వ ప్రజా రవాణాలో కిలో మీటర్‌కు ఎంత చార్జీ వసూలు చేయాలో నిర్ణయించి ప్రభుత్వానికి సిఫారసు చేయనుంది. ప్రభుత్వ, ప్రైవేటు మోటారు ట్రాన్స్‌పోర్టు వాహనాలన్నీ ఈ రెగ్యులేటరీ కమిషన్ పరిధిలోకి రానున్నట్లు సమాచారం.

# ఇప్పటికింతే!

- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఆఫీసులోనే!
- ఏప్రిల్ నాటికి కనీసం లక్ష డాక్యుమెంట్ల లక్ష్యం
- 'తెల్లకాగితంపై డాక్యుమెంట్' నాణ్యత ఎంత?
- ఆదరణ కరువవ్వడానికి అదే కారణం!




అమరావతి, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లను సులభతరం చేసేందుకు, అవినీతిని నిర్మూలించేందుకు తీసుకొచ్చిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానం ప్రస్తుతానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకే పరిమితమైంది. ఆన్‌లైన్‌లో అన్ని వివరాలు నింపి.. అక్కడే ప్రింట్ తీసుకుని ఆ డాక్యుమెంట్‌తో సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్తే అక్కడ రిజిస్ట్రేషన్ చేసే పద్ధతిని ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టింది. డాక్యుమెంట్ రైటర్ల మధ్యవర్తిత్వం, అనవసర ఖర్చులు లేకుండా ఈ విధానం ఉపకరిస్తుందని అంచనా వేసింది. ఈ విధానంపై ప్రజా చైతన్యానికి అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించింది. అయినా ప్రజల్లో దీనిపై అంతగా చైతన్యం కనిపించడం లేదని తెలుస్తోంది. దశాబ్దాల తరబడి అలవాటుపడిపోవడంతో ముందుగా డాక్యుమెంట్ రైటర్ల వద్దకే వెళ్తున్నారు. దీంతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ సబ్ రిజిస్ట్రార్లకే లక్ష్యాలు విధించింది. రిజిస్ట్రేషన్ల కోసం తమ వద్దకు వచ్చినవారిలో కొందరిని ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారుచేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రిజిస్ట్రార్లు చెప్తున్నారు. అది తమకు తెలియదంటే.. తమ సిబ్బంది సాయంతో చేయిస్తున్నారు. ప్రభుత్వం లక్ష్యాలు నిర్దేశించడంతో కొన్నిచోట్ల సబ్ రిజిస్ట్రార్లే డాక్యుమెంట్ రైటర్లకు ఆ పని అప్పగిస్తున్నారు. ప్రస్తుతం రోజువారీ రిజిస్ట్రేషన్లలో 10శాతం ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారుచేయడం ద్వారా అవుతున్నాయి. దీన్ని కనీసం 30శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

### తెల్ల కాగితం చిరిగిపోతుందా!

డాక్యుమెంట్ అంటే స్టాంప్ పేపర్లనే వాడే అలవాటు ఇప్పటివరకూ ఉంది. ఇప్పుడు ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ విధానంలో తొలి పేజీ మాత్రం స్టాంప్ పేపర్ ఉంటే సరిపోతుందని పెట్టారు. అది రూ.10, రూ.20, రూ.50, రూ.100ఇలా ఎంత విలువున్న స్టాంప్ అయినా సరిపోతుంది. వాస్తవానికి ఇది డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు చేసుకునేవారికి ఉపకరించేదే. కానీ దీని విషయంలో ప్రజల్లో కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని పేజీల్లోను స్టాంపులుండాలా? తొలి పేజీ మాత్రమే ఉంటే అది చట్టబద్ధమేనా? అన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో స్టాంపు పేపర్ చిరగకుండా, చెరగకుండా ఉంటుంది. తెల్ల కాగితం పల్చగా ఉండి.. స్వల్ప కాలంలోనే చిరిగిపోతాయన్న భావన ఉంది. మరోవైపు సర్వర్ సమస్యలతో ప్రింట్ తీసుకోవడానికి చాలా సమయం పడుతోంది. రిజిస్ట్రేషన్లు చేసుకునేవారు అంత సేపు ఓపిగ్గా వేచి ఉండలేక.. ఆన్‌లైన్ విధానంపై మెగ్గుచూపడంలేదని తెలుస్తోంది.

### ఏప్రిల్ నాటికి లక్ష డాక్యుమెంట్ల లక్ష్యం

మరోవైపు ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ విధానం ద్వారా ఏప్రిల్ నాటికి లక్ష డాక్యుమెంట్లనైనా రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లకు సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్‌లను మాత్రమే పెట్టారు. అంటే ఈ రెండు లావాదేవీలకు సంబంధించిన డాక్యుమెంట్లను మాత్రమే ఆన్‌లైన్‌లో పెట్టారు. లీజు డీడ్, భాగ పరిష్కార డీడ్, బ్యాంకులు రుణాలు ఇచ్చేటప్పుడు చేసుకునే తాకట్టు డీడ్ ఇలాంటివన్నీ క్రమంగా పెట్టాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారీ, టైమ్ స్లాట్ బుక్ చేసుకునే విధానంపై మరింత అవగాహన పెంచి.. ప్రస్తుతం ఉన్న చిన్న చిన్న లోపాలను సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

# కేసీఆర్ ఎక్కడ..?

- దేశమంతా స్పందించినా ఆయన మాట్లాడలేదేం?
- నాయకులు, పోలీసులకు 'నో ఎంట్రీ'!
- నక్షత్ర కాలనీ వాసుల నిరసన
- ప్రధాన గేటుకు తాళం.. రావద్దంటూ బోర్డులు
- వెనుదిరిగిన చాడ, జూలకంటి, కౌశల్

శంషాబాద్‌రూరల్, డిసెంబరు 1: వెటర్నరీ డాక్టర్ హత్యపై దేశం మొత్తం స్పందించినా.. సీఎం కేసీఆర్ మాత్రం ఇప్పటి వరకూ మాట్లాడకపోవడం దారుణమని నక్షత్ర కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం కాలనీ ప్రధాన గేటుకు మహిళలు తాళంవేసి నిరసన తెలిపారు. దేశ వ్యాప్తంగా నేతలు, ప్రముఖులు స్పందించినా.. సీఎం కేసీఆర్ గానీ, ఆయన కుటుంబ సభ్యులు గానీ ఇప్పటి వరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ స్పందించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. మంత్రులు వచ్చి పరామర్శలు చేస్తున్నారు తప్ప బాధిత కుటుంబానికి భరోసా ఇవ్వడం లేదని ఆరోపించారు. గేటు వద్ద పోలీసులు, కాలనీ వాసుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో సీపీఎం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి రాగా అడ్డుకున్నారు. 'నో ఎంట్రీ ఫర్ పోలీస్ అండ్ పొలిటీషియన్' అని బోర్డులు పెట్టారు. నిందితులను వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలన్నారు. షాద్‌నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించిన వారిపై లాఠీచార్జి చేయడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే ఇంత దారుణం జరిగేది కాదన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా.. సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి, సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి, నటుడు కౌశల్ తదితరులను కాలనీవాసులు అడ్డుకోవడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండానే వెనుదిరిగారు.



గేటుకు తాళం వేసి నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు



# చీకటి కొట్లలో మానవ మృగాలు

## చర్లపల్లి జైల్లోని సింగిల్ సెల్స్‌లో వెటర్నరీ డాక్టర్ హత్యాచార నిందితులు

**కానరాని పశ్చాత్తాపం.. రాత్రంతా మెలకువగానే!.. తోటి ఖైదీల ఆగ్రహం**

**కట్టుదిట్టమైన భద్రత.. ఆ నలుగురిపై 24 గంటలూ నిఘా**

కుషాయిగూడ/హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఒక నిండుప్రాణాన్ని నిలువునా తీశామన్న పశ్చాత్తాపం ఏమాత్రం లేదు.. ఎలా దొరికిపోయామన్న షాక్ తప్ప!! వెటర్నరీ డాక్టర్ హత్యాచార నిందితులు మహ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చింతకుంట చెన్నకేశవులు మనస్థితి ఇది! 14 రోజుల రిమాండ్‌పై చర్లపల్లి జైల్లో ఉన్న వీరిని అక్కడ వేర్వేరు చీకటి కొట్లలో (సింగిల్ సెల్స్)ల్లో బందీలుగా ఉంచారు. వీరిని జైలుకు తీసుకువచ్చినప్పుడు ఇతర ఖైదీలు వారిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ తిట్ల దండకం మొదలు పెట్టడంతో వార్డర్లు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇతర ఖైదీల నుంచి వారికి హాని కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆ నలుగురిని ఎట్టి పరిస్థితుల్లోనూ తోటి ఖైదీలతో కలవనివ్వకూడదని అధికారులు నిర్ణయించారు. అండర్ ట్రయల్ ఖైదీలు కావడంతో.. వారికి జైలులోని కర్మాగారాల్లో ఎలాంటి విధులు అప్పగించబోమని.. దానివల్ల వారు తోటి ఖైదీలను కలిసే అవకాశాలే ఉండవని వివరించారు. ఒక్కో నిందితుడినీ కనిపెట్టుకుని ఉండడానికి ఇద్దరేసి వార్డర్లను నియమించామని.. రోజుకు మూడు షిఫ్టుల్లో ఒక్కో నిందితుడిపై నిఘాకు ఆరుగురు చొప్పున మొత్తం 24మంది వార్డర్లు పనిచేస్తున్నారని చెప్పారు. శనివారం రాత్రి భోజనం అనంతరం వారిని సింగిల్ సెల్‌లోకి మార్చగా.. రాత్రంతా నలుగురూ నిద్ర పోకుండా గడిపారని సమాచారం. ఆదివారం ఉదయం వారికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రెండు సార్లు టీ ఇచ్చారు. అయితే ఆ మానవ మృగాల్లో తాము చేసిన నేరం పట్ల ఎలాంటి పశ్చాత్తాపం కనిపించలేదని, ఎలాంటి ఆందోళన కూడా వారిలో కనబడలేదని విధుల్లో ఉన్న సిబ్బంది వెల్లడించారు. వారిలో ఆత్మహత్య చేసుకునే ఉద్దేశం (సూసైడల్ ఇంటెన్షన్) ఉందేమో గుర్తించేందుకు సోమ, మంగళవారాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

### ఏమిటీ సింగిల్ సెల్స్?

ప్రమాదకరంగా ఉండే రిమాండ్ ఖైదీలతో పాటు జైలు సిబ్బందితో గొడవపడే ఖైదీలను సింగిల్ సెల్స్‌కు మార్చడం చర్లపల్లి జైలులో తరచూ జరిగే పరిణామమే. అలాగే.. తోటి ఖైదీల నుంచి హాని ఉన్న ఖైదీలను కూడా ఈ సింగిల్ సెల్స్‌కు మారుస్తుంటారు. పశువైద్యాధికారిపై పైశాచికత్వం ప్రదర్శించిన నలుగురు నిందితులను ఈ కారణంతోనే సింగిల్‌సెల్‌కు మార్చారు. చర్లపల్లి జైల్లో ఖైదీలను ఉంచేందుకు మూడు అంతస్తుల్లో మూడు బ్యారక్‌లు ఉంటాయి. ఒక్కో బ్యారక్‌లో నాలుగు నుంచి ఎనిమిది హాళ్లుంటాయి. ఒక్కో హాల్‌లో 16 నుంచి 30 మంది దాకా ఖైదీలుంటారు. జైలు వేళల్లో వారికి కేటాయించిన పనులు చేసుకొని వచ్చే ఖైదీలు ఈ హాళ్లల్లోనే నిద్ర పోతుంటారు. సింగిల్ సెల్స్ వీటికి భిన్నంగా ఉంటాయి. వీటిలో ముందు వైపు తలుపునకు కటకటాలు, వెనక వైపు దాదాపు 13 అడుగుల ఎత్తులో ఒక వెంటిలేటర్ మాత్రమే ఉంటాయి. అందులోనే ఒక మూల కాలకృత్యాలు తీర్చుకునేందుకు వీలుగా గోడచాటుగా ఉండే బాత్‌రూం మాత్రమే ఉంటుంది. జైలులోని ఇతర విషయాలేవీ వీరికి తెలిసే అవకాశం ఉండదు. సమయానికి నిర్ణీత పరిమాణంలో టిఫిన్, టీ, భోజనం మాత్రం అందిస్తారు. అధికారుల సమక్షంలోనే వైద్యుల పర్యవేక్షణ కూడా ఉంటుంది. చీకటి కొట్టులాంటి సింగిల్ సెల్‌లోని ఖైదీలు ఎలాంటి అఘాయిత్యానికి, ఆత్మహత్యా యత్నానికి పాల్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటారు. స్పూను, గ్లాసు, ప్లేటు లాంటివే కాకుండా బాత్‌రూంలో కనీసం బకెట్ కూడా ఉండకుండా చూస్తారు. కారిడార్‌లో ఉండే విద్యుత్ దీపమే వారికి రాత్రి వేళ గుడ్డి వెలుగునిస్తుంది. కాగా, ప్రస్తుతం నిందితులు ఉన్న మహానది బ్యారక్‌లోని సింగిల్‌సెల్స్‌లోనే గతంలో మొద్దు శ్రీను హత్య కేసులో నిందితుడైన ఓంప్రకాష్‌ను ఉంచారు. అనంతరం అతన్ని అనంతపురం జైలుకు తరలించారు.

### జైల్లోనే ఐడీ పరేడ్..

కోర్టు విచారణ తదితరాల నిమిత్తం నిందితులను తరలించేందుకు జైలు అధికారులు, పోలీసులు తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. ప్రజల్లో వారిపై ఉన్న ఆగ్రహావేశాల కారణంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకునే ప్రమాదం ఉండడమే దీనికి కారణం. ఈ నేపథ్యంలో.. నిందితులను గుర్తించేందుకు నిర్వహించే 'షనాకత్' (ఐడీ-పరేడ్) కోసం న్యాయమూర్తితో పాటు సాక్షులను కూడా చర్లపల్లి జైలుకు రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఈ గుర్తింపు పరేడ్‌కు రెండు రోజులు పట్టొచ్చని జైలు అధికారులు చెబుతున్నారు.

### మొదటిరోజే మటన్‌తో భోజనం

అరీఫ్, చెన్నకేశవులు, నవీన్, శివను శనివారం సాయంత్రం జైలుకు తీసుకురాగా.. వారికి ఆదివారం మొదటి రోజు. ఉదయం అల్పాహారంలో భాగంగా వారికి పులిహోర అందజేశామని జైలు సిబ్బంది తెలిపారు. "జైలు నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనంలో 250 గ్రాముల ఆహారాన్ని అందజేశాం. అందులో అన్నం, కూర, పప్పు ఉన్నాయి. సాధారణంగా ఆదివారాల్లో ఖైదీలకు మాంసాహారాన్ని అందజేస్తాం. ఆ నలుగురు రాత్రి మటన్‌తో భోజనం చేశారు" అని వివరించారు.

### చెన్నకేశవులుకు కిడ్నీ సమస్య నిజమే

నిందితుల్లో ఒకడైన చెన్నకేశవులుకు మూత్రపిండాల సమస్య ఉన్నట్లు జైలు వైద్యులు నిర్ధారించారు. "అతడికి ఆరు నెలలకోసారి డయాలసిస్ అవసరం. జైలుకు రావడానికి ముందు వరకు అతడు నిమ్స్‌లో చికిత్స పొందాడు. అతని మెడికల్ ప్రొఫైల్‌ను పరిశీలించాక.. నిమ్స్ వైద్యులను సంప్రదించి వైద్యం అందజేస్తాం" అని జైలు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మిగతా ముగ్గురు నిందితులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించామని.. వారికి ఎలాంటి రుగ్మతలు లేవని వివరించాయి.

- సెంట్రల్ డెస్క్

చర్లపల్లి కేంద్ర కారాగారం



## పాలమూరులో నాటకమాడి తప్పించుకున్నారు

- పోలీసుల కళ్లుగప్పి లారీని తీసుకొచ్చిన నిందితులు

మహబూబ్‌నగర్ క్రైం, డిసెంబరు 1: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వెటర్నరీ వైద్యురాలి హత్య కేసులో ప్రధాన నిందితుడు ఆరిఫ్ లారీని ఘటన జరిగిన రోజు తెల్లవారుజామున మహబూబ్‌నగర్‌లో అధికారులు అడ్డుకున్నారు. నవంబరు 26న వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో రాయచూర్ వైపు నుంచి వస్తున్న ఆరిఫ్ లారీని ఆపారు. అతని వద్ద డ్రైవింగ్ లైసెన్స్, అవసరమైన పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేశారు. రవాణాశాఖ హోంగార్డును లారీలో ఎక్కించి, భూత్పూర్ స్టేషన్‌లో బండిని పెట్టి రావాలని చెప్పారు. కొద్ది దూరం వెళ్లాక డ్రైవర్ ఆరిఫ్ లారీని ఆపేశాడు. స్టార్ట్ కావడం లేదని నాటకమాడి లారీని అక్కడే నిలిపివేశాడు. అధికారుల ఆదేశాల మేరకు డ్రైవర్ ఆరిఫ్, క్లీనర్ శివ సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న హోంగార్డు.. లారీని బాగు చేయించుకుని తీసుకురావాలని చెప్పి వెనక్కి వెళ్లిపోయాడు. అతను వెళ్లిపోయిన తర్వాత ఆరిఫ్ లారీని తీసుకొని వచ్చేశాడు. అదేరోజు రాత్రి దారుణ ఘటనకు పాల్పడ్డారు. పోలీసు విచారణలో ఈ విషయం బయటపడడంతో రవాణాశాఖ అధికారుల నుంచి డ్రైవర్, క్లీనర్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణలో ఈ సెల్‌ఫోన్లు కూడా కీలకంగా మారనున్నాయి. కాగా.. వెటర్నరీ వైద్యురాలు కొన్ని వారాలుగా టోల్‌గేట్ వద్దే ద్విచక్ర వాహనాన్ని నిలుపుతోందని, అలాంటిది ఘటన జరిగిన రోజు ఆమెను అక్కడ వాహనాన్ని నిలపవద్దని చెప్పిన టోల్‌గేట్ సిబ్బందినీ పోలీసులు విచారిస్తే కేసులో మరికొంత సమాచారం తెలిసే అవకాశం ఉంటుందన్న వాదన వినిపిస్తోంది.

## అంత సీరియస్ అనుకోలేదు

**డయల్-100కు కాల్ చేయకపోవడంపై వైద్యురాలి సోదరి**

శంషాబాద్, డిసెంబరు 1: తన సోదరి అంత సీరియస్ పరిస్థితుల్లో ఉండి ఉంటుందని తాను ఊహించలేకపోయానని.. తన సోదరి కూడా ఆ ప్రమాదాన్ని పసిగట్టలేకపోయి ఉంటుందని శంషాబాద్‌లో హత్యాచారానికి గురైన తెలంగాణ నిర్భయ సోదరి అన్నారు. సోమవారం ఆమె పలు మీడియా సంస్థలతో మాట్లాడారు. "చాలా మంది తాను కానీ, తన సోదరి కానీ డయల్-100కు కాల్ చేయాల్సిందని అంటున్నారు. ఆ పరిస్థితిలో మనమెవరం లేము. అక్క మాత్రమే ఉంది. అక్క అంత సీరియస్ పరిస్థితిలో ఉందని నాకు తెలియదు. లోకంలో ఇలాంటి వారు కూడా ఉంటారని మేము అనుకోలేదు. అందుకే ప్రమాదాన్ని ఊహించలేకపోయాం. లేకుంటే.. నేను కచ్చితంగా డయల్-100కు ఫోన్ చేసేదాన్ని" అని వివరించారు. ఇతరులు ఇలాంటి పరిస్థితుల్లో ఉదాసీనంగా ఉండకూడదని, పోలీసులకు ఫోన్ చేయాలని ఆమె కోరారు.

## స్త్రీల ఔన్నత్యం తెలుసుకోండి

- అసభ్యకర వెబ్‌సైట్లను నిషేధించాలి
- పశువైద్యురాలి హత్య బాధాకరం: నటి రాగిణి



కొత్తవలస రూరల్, డిసెంబరు 1: అభివృద్ధి వైపు అడుగులేసే నేటి యువతరం ఎదుటివారి పట్ల వివేకంతో వ్యవహరించాలని, స్త్రీ ఔన్నత్యం గురించి తెలుసుకోవాలని సినీ, టీవీ నటి రాగిణి సూచించారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలో ఆదివారం శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్టు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ తెలంగాణలో పశువైద్యురాలి హత్యను తీవ్రంగా ఖండించారు. ప్రతి ఇంట్లోనూ తల్లిదండ్రులు స్త్రీ శక్తి, ఔన్నత్యం, గొప్పదనంపై పిల్లలకు వివరించాలన్నారు. స్త్రీని గౌరవించడం చిన్నవయసు నుంచే ఇంట్లో బాలురకు నేర్పిస్తే భవిష్యత్ తరాలకు ఇబ్బందులుండవన్నారు. ఇంటర్‌నెట్‌లో అసభ్యకర వెబ్‌సైట్లను ప్రభుత్వం రూపుమాపాలని కోరారు. 35ఏళ్ల ప్రస్థానంలో 180 సినిమాలు, 550కు పైగా సీరియల్స్‌లో నటించానని చెప్పారు. విదేశాల్లో 360 నృత్యప్రదర్శనలు చేశానన్నారు. రొమాంటిక్ సీన్లు, డబుల్ మీనింగ్ డైలాగులకు తానెప్పుడూ దూరంగా ఉండేదాన్నన్నారు. ఫ్యామిలీలో చిన్నా, పెద్దా అంతా కలిసి చూసే విధంగా ఎంటర్‌టైన్‌మెంట్ చేయాలి తప్ప, అసభ్యకరంగా చూపించి యువతను తప్పుదోవ పట్టించకూడదని హితవు పలికారు. ప్రస్తుతం టీవీల్లో బిజీగా ఉన్నప్పటికీ సినిమాల్లో మంచిపాత్ర లొస్తే విడిచిపెట్టకుండా చేస్తున్నానన్నారు.

### మానవమృగాలను శిక్షించాలి: స్పీకర్ తమ్మినేని



ఆమదాలవలస, డిసెంబరు 1: తెలంగాణలో పశు వైద్యురాలిపై మానవమృగాల హత్యాచారం బాధాకరమని ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ సమయంలో న్యాయమూర్తులు తీర్పు వెలువరించి.. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

### నిందితుల్ని కఠినంగా శిక్షించాలి: గంటా



తిరుమల, డిసెంబరు 1: పశు వైద్యురాలిపై హత్యాచార ఘటన శోచనీయమని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'ఆ ఘటన అందరినీ కలచి వేసింది. ప్రజలు చాలా ఆగ్రహావేశాలతో ఉన్నారు.భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. ఈ తరహా ఆలోచన చేయాలంటేనే భయపడేలా నిందితులను కఠినంగా శిక్షించాలి' అని పేర్కొన్నారు. మరోమారు ఇలాంటివి జరగకుండా ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఘటనపై ప్రజలు స్పందించిన తీరు అద్భుతమన్నారు. చివరికి పోలీస్‌స్టేషన్‌పై కూడా దాడి చేశారంటే ప్రజలు ఎంత ఆవేశం, ఆవేదనతో ఉన్నారో అర్థం చేసుకోవాల్సిన అవసరముందన్నారు.

### నేరస్తుల వెన్నులో వణుకు పుట్టాలి: వీహెచ్



రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1: పశు వైద్యురాలిపై హత్యాచారం అత్యంత దారుణ ఘటన అని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు(వీహెచ్) అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారిస్తే నిందితులకు వెంటనే శిక్ష పడుతుందనే నమ్మకం ప్రజలకు లేదన్నారు. ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా కఠినమైన శిక్ష అమలు చేయాల్సి ఉందన్నారు. నేరస్తుల వెన్నులో వణుకుపుట్టే విధంగా శిక్షలు ఉండాలని సూచించారు.

# హంతకులను ఉరితీయాలి

- జైలు వద్ద యువత, మహిళల ఆందోళన




శంషాబాద్ ఘటనపై విజయవాడలో న్యాయ విద్యార్థుల నిరసన ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వెటర్నరీ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో నిందితులను వెంటనే శిక్షించాలనే డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. శనివారం సాయంత్రం వారిని చర్లపల్లి జైలుకు తరలించినప్పుడు.. జైలు వద్దకు యువత, మహిళలు పెద్ద ఎత్తున చేరుకుని ఆందోళనకు దిగారు. వారిని జైల్లో పెట్టి ప్రజల సొమ్మును దండగ చేసే బదులు వెంటనే ఉరిశిక్ష వేయాలనే నినాదాలతో ఆందోళన నిర్వహించారు. శనివారం రాత్రి దాకా ఆందోళన తెలిపిన నిరసనకారులు ఆదివారం మళ్లీ జైలు వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కాగా, ఈ ఘటనను నిరసిస్తూ శంషాబాద్‌లోని నక్షత్ర కాలనీవాసులు ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. వైద్యురాలు నివాసం ఉండే అపార్ట్‌మెంట్ నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ చేశారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, మృతురాలి చెల్లెలికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో పలుచోట్ల ఆందోళనలు నిర్వహించారు.

### సోషల్‌మీడియాలో వికృత పోస్టులు

- నిందితులకు మద్దతుగా కామెంట్లు

తెలంగాణ నిర్భయ ఉదంతంపై కొందరు నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేక పోస్టులు చేస్తున్నారు. నిందితులకు మద్దతిస్తున్నారు. వికృత పదజాలంతో కామెంట్లు పెడుతున్నారు. అలాంటి పోస్టులు చేసిన వారిపై హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో పలువురు నెటిజన్లు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. స్క్రీన్‌షాట్లు తదితర ఆధారాలను పోలీసులకు అందజేశారు. హత్యాచారానికి గురైన పశువైద్యురాలిని సోషల్ మీడియాలో కించపరిచిన 'స్మైలీ నాని', అమర్‌నాథ్, సీల్ శ్రవణ్ అనే ఐడీలను నిర్వహిస్తున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేయనున్నారు. కాగా.. స్మైలీ నాని ఐడీతో సోషల్ మీడియా ఖాతాను నిర్వహిస్తున్న వ్యక్తిది ఆంధ్రప్రదేశ్ అని.. అతడు కేరళలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.




పూజారిని అరెస్టు చేసిన పోలీసులు

## ఫోను వదిలేసి.. గుండు గీయించుకుని!

- వేషం మార్చిన అత్యాచారం కేసు నిందితుడు
- కాల్ ట్రాకింగ్ చేసి పట్టుకున్న పోలీసులు

అన్నవరం, సుండుపల్లె, డిసెంబరు 1: అతడో పూజారి. భగవద్గీత నేర్పిస్తానంటూ ఓ గిరిజన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గత నెల 28న జరిగిన ఈ ఘటనపై కడప జిల్లా సుండుపల్లె పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసేందుకు తిరుగుతున్నారు. దీంతో జిల్లా వదిలేసి పరారైన పూజారి దేరంగుల రవి అలియాస్ సత్యనారాయణ(35) ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు గుండు చేయించుకున్నాడు. సొంత ఫోను వదిలేసి.. కనిపించినవారి ఫోన్లు తీసుకుని కుటుంబ సభ్యులు, ఇతరులతో మాట్లాడుతున్నాడు. అతడి ఇంటికి వచ్చే ఫోన్లపై నిఘా పెట్టిన సుండుపల్లె పోలీసులు.. కాల్ ట్రాకింగ్ ద్వారా అతడు తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో ఉన్నట్లు గుర్తించారు. ఈ సమాచారాన్ని అన్నవరం ఎస్‌ఐ మురళీమోహన్‌కు చేరవేయడంతో, వారు నిందితుడి కోసం వెతకడం ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం నిందితుడు అన్నవరంలోని మెయిన్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్‌కు వెళుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని ఆదివారం సుండుపల్లె నుంచి వచ్చిన పోలీసులకు అప్పగించారు.

### ఆడబిడ్డలకు రక్షణ కరువవడం సిగ్గుచేటు

- రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్

న్యూఢిల్లీ, డిసెంబరు 1: దేశంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాల పట్ల రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ఆదివారం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు రక్షణ కొరవడటం సిగ్గుచేటుగా వ్యాఖ్యానించారు. మన సమాజం ఎటు వెళ్తోందో ఆలోచించాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. హైదరాబాద్ శివార్లలో యువతి దారుణ హత్యాచార ఘటన తననెంతో కలచివేసిందన్నారు.

### కేసు విచారణకు ప్రత్యేక కోర్టు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ డాక్టర్ హత్య కేసు విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు కానుందని న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. ఈ కేసు విచారణను వేగంగా చేపట్టి దోషులకు కఠినంగా శిక్షపడేలా స్పెషల్ కోర్టును ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటుపై హైకోర్టుకు ప్రతిపాదనలు పంపుతామని ఆయన వెల్లడించారు.

# ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం

- రాష్ట్రంలో పలుచోట్ల మైనర్లపై అకృత్యాలు
- మహిళపై వలంటీర్ అత్యాచారయత్నం
- ఇంజనీరింగ్ విద్యార్థినిపై కూడా..

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో మైనర్ బాలికలపై అకృత్యాలు పెరిగిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఎనిమిదేళ్ల బాలికపై ఇంటర్ విద్యార్థి అత్యాచారం చేశాడు. కడపలో 11ఏళ్ల బాలికపై, చిత్తూరు జిల్లాలో తొమ్మిదేళ్ల బాలికపై సమీప బంధువులే అత్యాచారానికి ప్రయత్నించారు. కర్నూలు జిల్లాలో ఒంటరిగా ఉన్న మహిళపై గ్రామ వలంటీర్ అత్యాచారయత్నం చేయగా.. శ్రీకాకుళంలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై నలుగురు ఆకతాయిలు లైంగికదాడికి ప్రయత్నించారు. ఆ వివరాలు..

ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎనిమిదేళ్ల బాలికపై ఇంటర్ చదివే యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. పశ్చిమగోదావరి జిల్లా లక్కవరం పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో ఈ దారుణం చోటుచేసుకుంది. శనివారం రాత్రి బాలిక ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పక్కింట్లో ఉండే యువకుడు ఆ బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి అఘాయిత్యం చేశాడని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కడప జిల్లా రాయచోటి మండలానికి చెందిన 11 ఏళ్ల బాలికపై సమీప బంధువు గత శుక్రవారం అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకొచ్చింది. మద్యం మత్తులో సొంత అన్న కూతురైన తొమ్మిదేళ్ల బాలికపైనే అత్యాచారయత్నానికి ప్రయత్నించాడో ప్రబుద్ధుడు. చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండల పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. మునిరాజు (29) ఆదివారం సాయంత్రం అన్న కూతురుని గడ్డి తీసుకొద్దామని తోటవద్దకు తీసుకెళ్లి అత్యాచారానికి ప్రయత్నించాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న కొందరు అక్కడకు వెళ్లి మునిరాజుకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విధి నిర్వహణ పేరిట ఓ ఇంటికి వెళ్లిన గ్రామ వలంటీర్.. ఒంటరిగా ఉన్న మహిళపై అత్యాచారయత్నం చేశాడు. ఈ ఘటన కర్నూలు జిల్లా బేతంచెర్ల మండలంలోని ఓ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వలంటీర్ చింతకుంట శేఖర్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రాజాంలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై నలుగురు యువకులు లైంగిక దాడికి ప్రయత్నించారు. స్థానికంగా ఓ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థిని స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటోంది. ఆదివారం రాత్రి టిఫిన్ కోసం బయటకు రాగా నలుగురు ఆకతాయిలు ఆమెను అడ్డుకున్నారు. చేయి పట్టుకొని లాగేందుకు ప్రయత్నించారు. వారిని తప్పించుకునే ప్రయత్నంలో ఆమె గాయాలపాలైంది. స్థానికులు ఆమెను ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

# తెలంగాణ ఆర్టీసీ కార్మికులపై వరాల జల్లు

హైదరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులపై ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల వర్షం కురిపించారు. వారిని ఇకనుంచి ఆర్టీసీ ఉద్యోగులుగా పిలవాలని నిర్దేశించారు. సెప్టెంబరు నెల జీతాన్ని మంగళవారమే (డిసెంబరు 2) అందిస్తామన్నారు. కార్మికులు సమ్మె చేసిన 55 రోజులకూ వేతనం ఇస్తామని ప్రకటించారు. దానిని ఏకమొత్తంలో అందిస్తామని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులకు ఇంక్రిమెంట్ యథావిధిగా ఇస్తామన్నారు. ఆర్టీసీలో ఒక్కరిని కూడా ఉద్యోగంలోంచి తీసేయకుండా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, ఒక్క రూటులో ఒక్క ప్రైవేటు బస్సుకు కూడా అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచి ఏటా బడ్జెట్లో ఆర్టీసీకి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ప్రగతి భవన్‌లో ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. డిపోకు ఐదుగురు చొప్పున 97 డిపోల నుంచి కార్మికులు పాల్గొన్నారు. సమావేశానికి సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. రెండేళ్లపాటు ఆర్టీసీలో గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించేది లేదని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ప్రతి డిపోలో ఇద్దరు చొప్పున కార్మికులు సభ్యులుగా కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని పునరుద్ఘాటించారు. సమ్మె కాలంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబంలో ఒకరికి ఎనిమిది రోజుల్లో ఉద్యోగం ఇస్తాం. దరఖాస్తు చేసుకోకపోయినా ఉద్యోగం ఇస్తాం. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తాం అని సీఎం ప్రకటించారు.

న్యూజిలాండ్ X ఇంగ్లండ్
రెండో టెస్టు - నాలుగో రోజు
తెల్లవారుజాము 3.30 గం. నుంచి
స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్-1లో

ఆస్ట్రేలియా x పాకిస్థాన్
రెండో టెస్టు - నాలుగో రోజు
ఉదయం 9 గం. నుంచి
సోనీ సిక్స్‌లో



# దాదా.. మరో ఐదేళ్లు!

## ఎమ్మెస్కేకు నో చాన్స్!

జాతీయ సెలెక్షన్ కమిటీ ఎమ్మెస్కే ప్రసాద్ పదవీకాలం ముగిసిందని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ స్పష్టం చేశాడు. అతడిని కొనసాగించడం లేదని కూడా తేల్చి చెప్పాడు. ప్రస్తుత కమిటీలో ఎమ్మెస్కేతో పాటు మరో సెలెక్టర్ గగన్ ఖోడా కూడా బాధ్యతల నుంచి వైదొలగనుండగా వీరి స్థానంలో కొత్తవారు రానున్నారు. వీరిద్దరు 2015లో బాధ్యతలు తీసుకున్నారు. వాస్తవానికి సవరించిన రాజ్యాంగం ప్రకారం సెలెక్షన్ కమిటీ గరిష్ఠ పదవీకాలాన్ని నాలుగు నుంచి ఐదేళ్లకు పొడిగించారు. అయితే గంగూలీ మాత్రం నాలుగేళ్లకే ముగించేందుకు నిర్ణయం తీసుకున్నాడు. ఇక, మరో ముగ్గురు సెలెక్టర్లు జతిన్ పరాంజపే, శరణ్‌దీప్ సింగ్, దేవాంగ్ గాంధీ మాత్రం 2016లో కమిటీలో ప్రవేశించగా.. వారు మరో ఏడాది కొనసాగుతారు. 'జాతీయ సెలెక్షన్ ప్యానెల్ ఛైర్మన్‌తో పాటు గగన్‌ల పదవీ కాలం ముగిసింది. వారికి పొడిగింపేమీ లేదు. వారు తమ పాత్రను చక్కగా నిర్వర్తించారు. అయితే సెలెక్టర్లు ఎంత కాలం పదవిలో ఉండాలనేది నిర్ణయిస్తాం. ప్రతీ ఏడాది వీరిని నియమించడం సరైన పద్ధతి కాదు' అని గంగూలీ స్పష్టం చేశాడు.

## ఆ విషయం ధోనీనే అడగండి

ఎంఎస్ ధోనీ విషయంలో తమకు స్పష్టత ఉందని ఇదివరకే బదులిచ్చిన బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ.. టీ20 ప్రపంచ క్రికెట్‌లో అతడు ఆడే విషయం మాత్రం తెలీదని బదులిచ్చాడు. బోర్డు ఏజీఎం ముగిశాక విలేకరులతో మాట్లాడిన దాదాకు టీ20 ప్రపంచకప్‌లో ధోనీకి చోటుంటుందా? అనే ప్రశ్న ఎదురైంది. దీనికి ఆయన సమాధానమిస్తూ.. 'దయచేసి ఈ విషయాన్ని ధోనీనే అడగండి' అని తేల్చి చెప్పాడు. జూలై నుంచి ఎంఎస్ జాతీయ జట్టుకు దూరంగా ఉంటున్నాడు. మరోవైపు అతడి రిటైర్మెంట్‌పై ఎప్పటికప్పుడు కథనాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల నేరుగా అతడినే ఈ విషయం అడగ్గా జనవరి వరకు వేచి ఉండండని సమాధానమిచ్చాడు.



కూలింగ్ ఆఫ్ పీరియడ్‌కు సవరణ

బీసీసీఐ ఏజీఎంలో నిర్ణయం

సుప్రీం ఓకే చేస్తే 2024 వరకు బోర్డు చీఫ్‌గా గంగూలీ!

భారత క్రికెట్‌పై తనదైన ముద్ర వేసేందుకు బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీకి మార్గం సుగమమైంది. వరుసగా ఆరేళ్ల పదవీ కాలం తర్వాత మూడేళ్లపాటు విరామం తీసుకోవాలనే జస్టిస్ లోధా కమిటీ ప్రతిపాదన దాదాకు ప్రధాన అడ్డంకిగా ఉండగా.. ఈ నిబంధన సవరణకు బోర్డు ఏజీఎంలో ఆమోదముద్ర పడింది. దీంతో తొమ్మిది నెలలే కాకుండా.. మరో ఐదేళ్లపాటు బోర్డు చీఫ్‌గా దాదా తనదైన శైలిలో పరిపాలన సాగించే వీలుంటుంది. అయితే అంతకన్నా ముందు ఏజీఎం నిర్ణయానికి సుప్రీం కోర్టు కూడా ఆమోద ముద్ర వేయాల్సి ఉంటుంది.





బోర్డు సమావేశానికి వస్తున్న అజరుద్దీన్, ద్రావిడ్

ముంబై: అంతా ఊహించినట్టుగానే బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ 2024 వరకు కొనసాగేందుకు మార్గం సుగమమైంది. కొత్త పాలక వర్గం నేతృత్వంలో ఆదివారం తొలిసారిగా బోర్డు వార్షిక సర్వ సభ్య సమావేశం (ఏజీఎం) జరిగింది. దీంట్లో జస్టిస్ లోధా కమిటీ సంస్కరణలకు మార్పులు చేశారు. ఇందులో ముఖ్యమైనది మూడేళ్ల కూలింగ్ ఆఫ్ పీరియడ్. దీని ప్రకారం బోర్డులో కానీ ఆయా రాష్ట్ర సంఘాల్లో కానీ వరుసగా రెండు పర్యాయాలు (ఆరేళ్లపాటు) పదవిలో కొనసాగితే మూడోసారి ఎన్నికకు వీలుండదు. ఇందుకు మరో మూడేళ్ల పాటు విరామం అవసరం. ఇటీవల బోర్డు చీఫ్‌గా ఎన్నికైన గంగూలీకి ఇదే సమస్యగా మారింది. ఇప్పటికే ఆయన బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు ఎంపికయ్యాడు. క్యాబ్ చీఫ్‌గా ఉన్న సమయంలోనే అక్టోబర్ 23న బీసీసీఐ అధ్యక్షుడైన దాదాకు మరో తొమ్మిది నెలల సమయం మాత్రమే ఉంది. అత్యంత సమర్థుడిగా గుర్తింపు తెచ్చుకున్న దాదా ఇంత తక్కువ సమయం పదవిలో ఉండడం సరికాదనే అభిప్రాయం అంతటా వినిపించింది. దీంతో తమ ఏజీఎంలో ఈమేరకు రాజ్యాంగ సవరణ చేసేందుకు నాలుగింట మూడు వంతుల సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. 'లోధా సూచించిన సంస్కరణలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఇక వీటిని సుప్రీం కోర్టు ఆమోదించాల్సి ఉంది' అని బోర్డు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఒకవేళ ఈ సవరణలకు కోర్టు ఆమోదం తెలిపితే గంగూలీతో పాటు కార్యదర్శి జై షా కూడా ఐదేళ్ల పాటు కొనసాగుతాడు. అలాగే వరుసగా ఆరేళ్ల పాటు పదవిలో కొనసాగిన ఆఫీస్ బేరర్లు మూడేళ్ల పదవికి దూరంగా ఉండాల్సిన అవసరం ఉండదు. మరోవైపు భవిష్యత్‌లో తాము తీసుకునే నిర్ణయాలన్నింటికీ కోర్టు అనుమతి కాకుండా ఏజీఎంలో మెజారిటీ ఉంటే సరిపోవాలని బోర్డు కోరుకుంటోంది. ఎందుకంటే ప్రతీ సవరణకు కోర్టుకు వెళ్లడం కష్టమనే భావనలో ఉంది.

### సీఏసీ నియామకం వాయిదా

క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) నియామకాన్ని బీసీసీఐ వాయిదా వేసింది. 'ఈనెల 3న సుప్రీం కోర్టులో విచారణ తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటారు' అని బోర్డు అధికారి తెలిపారు. గతంలో సీఏసీ సభ్యులుగా సచిన్, లక్ష్మణ్, గంగూలీ కొనసాగినా విరుద్ధ ప్రయోజనాల విషయమై రాజీనామా చేశారు. ఆతర్వాత ఈ బాధ్యతలు కపిల్, అన్షుమన్, శాంతా రంగస్వామి తీసుకుని కోచ్‌గా రవి శాస్త్రిని కొనసాగించారు. అయితే ఆతర్వాత వీరు కూడా వైదొలిగారు.

## ఐసీసీలో బోర్డు ప్రతినిధిగా జై షా



ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాల్లో పాల్గొనేందుకు బీసీసీఐ ప్రతినిధిగా జై షా హాజరుకానున్నాడు. క్రికెట్ పరిపాలక కమిటీ (సీఓఏ) ఉన్న సమయంలో అప్పటి సీఈవో రాహుల్ జోహ్రీ ఈ మీటింగ్‌లకు వెళ్లేవాడు. ఇప్పుడు తిరిగి బోర్డు కార్యదర్శికే ఆ బాధ్యత అప్పగించారు. అయితే ఐసీసీ బోర్డు సమావేశాల్లో పాల్గొనే బోర్డు ప్రతినిధులను మాత్రం ఇంకా ఎంపిక చేయలేదు.



## మహీపై ఎఫ్ఐఆర్..!

న్యూఢిల్లీ: ఆమ్రపాలి గ్రూప్ స్కామ్ మహేంద్రసింగ్ ధోనీ మెడకు చుట్టుకొనే ప్రమాదం ఉంది. కుట్రలో అతడికి కూడా భాగస్వామ్యం ఉందని ఆరోపించిన ఆమ్రపాలి గ్రూప్ బాధితులు.. ఎఫ్ఐఆర్‌లో ధోనీ పేరును కూడా చేర్చారు. 'క్రికెటర్‌గా ధోనీకి, బిల్డర్‌గా అనిల్ శర్మకు ఎంతో పేరుంది. వీరిపై నమ్మకంతోనే ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు సొమ్ములు చెల్లించామ'ని బాధితులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. సోమవారం దీనిపై సుప్రీం కోర్టు కీలక తీర్పును వెలువరించే అవకాశం ఉంది. ఆమ్రపాలి రియల్ ఎస్టేట్ గ్రూప్‌నకు ధోనీ ప్రచారకర్తగా వ్యవహరించాడు. ఫ్లాట్‌లు విక్రయిస్తామంటూ అనేక మంది వద్ద సొమ్ములు సేకరించిన సంస్థ ఆ మొత్తాన్ని నిబంధనలకు విరుద్ధంగా అనేక కంపెనీలకు మళ్లించింది. ఇందులో ధోనీ భార్యకు చెందిన కంపెనీ కూడా ఉంది. అయితే, డిపాజిట్లు తీసుకున్న ఆమ్రపాలి కంపెనీ అగ్రిమెంట్ ప్రకారం ఓనర్లకు ఫ్లాట్లు అప్పజెప్పలేదనే ఫిర్యాదులు వెల్లువెత్తడంతో 2017లో దీనిపై సుప్రీం కోర్టు విచారణకు ఆదేశించింది. ప్రజల నుంచి వేలాది కోట్ల రూపాయలు వసూలు చేసిన సంస్థ ఆ మొత్తాన్ని వివిధ రియల్ ఎస్టేట్ కంపెనీలకు బదిలీ చేసినట్టు తేలింది. ప్రజలను మోసం చేసిన కేసులో ఆమ్రపాలి డైరెక్టర్లను జైలుకు కూడా పంపింది.

## పరాజయం దిశగా పాక్

ఆసీస్‌తో రెండో టెస్టు



యాసిర్ షా (113)

అడిలైడ్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న డే/నైట్ టెస్టులో పాకిస్థాన్ దారుణ ఓటమి దిశగా సాగుతోంది. ప్రస్తుతం ఫాలోఆన్ ఆడుతున్న పాక్ మూడోరోజు ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 39 పరుగులు చేసింది. ఆది వారం భారీవర్షం కారణంగా 76.5 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఓపెనర్ షాన్ మసూద్ (14), అసద్ షఫీక్ (8) క్రీజులో ఉన్నారు. ఆసీస్ ఇన్నింగ్స్ ఆధిక్యానికి పాక్ 248 రన్స్ వెనకబడి ఉంది. అయితే అంతకుముందు లెగ్ స్పిన్నర్ యాసిర్ షా (113) శతకం, బాబర్ ఆజమ్ (97) అద్భుత ఆటతీరుతో పాక్ తొలి ఇన్నింగ్స్‌లో గట్టి పోరాటమే కనబర్చింది. 96/6 ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు ఆట ఆరంభించగా వీరిద్దరు ఏడో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యం అందించారు. ఆతర్వాత మహ్మద్ అబ్బాస్ (29)తో కలిసి యాసిర్ షా తొమ్మిదో వికెట్‌కు 87 రన్స్ జత చేసి చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. స్టార్క్ 6 వికెట్లతో చెలరేగి పాక్‌ను కట్టడి చేశాడు.

## రన్నరప్.. సౌరభ్





- ఫైనల్లో ఓడిన భారత షట్లర్
- మహిళల చాంపియన్ మారిన్
- సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్

లఖ్‌నవ్: సొంత గడ్డపై టోర్నమెంట్‌లో ఫైనల్ చేరి ఆశలు రేపిన భారత యువ షట్లర్ సౌరభ్ వర్మ అసలైన పోరులో మాత్రం బోల్తా పడ్డాడు. ఈ మధ్యప్రదేశ్ కుర్రాడు సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సౌరభ్ 15-21, 17-21తో చైనీస్ తైపీ ఆటగాడు వాంగ్ జూ వీ చేతిలో పరాజయంపాలయ్యాడు. ప్రపంచ 22వ ర్యాంకరైన వాంగ్ జూ కేవలం 48 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి కెరీర్‌లో తొలి సూపర్ 300 ట్రోఫీని అందుకున్నాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను రియో ఒలింపిక్స్ చాంపియన్ కరోలినా మారిన్ గెలుచుకుంది. టైటిల్ పోరులో మారిన్ (స్పెయిన్) 21-12, 21-16తో ఫిటాయపోర్న్ ఛైవాన్ (థాయ్‌లాండ్)ను ఓడించి విజేతగా నిలిచింది.

## వాలీబాల్ ఫైనల్లో భారత్

దక్షిణాసియా క్రీడలు



ఖట్మాండు: దక్షిణాసియా క్రీడల్లో భారత పురుషులు, మహిళల వాలీబాల్ జట్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. పురుషుల విభాగం సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 27-25, 25-19, 21-25, 25-21తో శ్రీలంకపై గెలిచింది. ఫైనల్లో పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. మరో సెమీస్‌లో బంగ్లాదేశ్‌ను పాక్ ఓడించింది. మహిళల సెమీస్‌లో భారత్ 25-14, 25-6, 25-17తో మాల్దీవులుపై గెలిచి నేపాల్‌తో టైటిల్‌ఫైట్‌కు సిద్ధమైంది. రెండో సెమీస్‌లో శ్రీలంకపై నేపాల్ నెగ్గింది. ఫైనల్ మంగళవారం జరగనుంది.

**అట్టహాసంగా ప్రారంభ వేడుకలు:** అంతకుమందు ఇక్కడి దశరథ స్టేడియంలో నేపాల్ దేశ రాష్ట్రపతి బిద్యా దేవి భండారి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభ వేడుకలు అందరినీ అలరించాయి. మొత్తం 15వేల మంది ప్రేక్షకుల సామర్థ్యం కలిగిన ఈ స్టేడియం మొత్తం పూర్తిగా నిండిపోయింది. తొలుత టోర్నీలో పాల్గొంటున్న ఏడు దేశాల అథ్లెట్లు మార్చ్‌పాస్ట్ నిర్వహించగా.. ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలతో ఈవెంట్ సందడిగా మారింది. ఈనెల 10న ముగియనున్న ఈ టోర్నీలో మొత్తం 26 క్రీడాంశాలకు గాను దాదాపు 2700 మంది అథ్లెట్లు పోటీపడుతున్నారు.

## హుస్సాముద్దీన్ పసిడి పంచ్



బీజింగ్ (చైనా): తెలుగు బాక్సర్ మహ్మద్ హుస్సాముద్దీన్ గ్రాండ్‌స్లామ్ ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పతకంతో సత్తాచాటాడు. పురుషుల 57 కిలోల విభాగం ఫైనల్లో ఝూంగ్ ఝున్ (చైనా)ను చిత్తు చేసి స్వర్ణ పతకం దక్కించుకున్నాడు. ఢిల్లీలో మంగళవారం నుంచి జరిగే ఇండియన్ బాక్సింగ్ లీగ్‌లో హుస్సాముద్దీన్ పాల్గొననున్నాడు.

## నవ్య డబుల్ ధమాకా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగమ్మాయి నవ్య కందేరి సింగపూర్ యూత్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ సిరీస్‌లో రెండు స్వర్ణ పతకాలు సాధించి డబుల్ ధమాకా సృష్టించింది. బాలికల అండర్-13 సింగిల్స్ ఫైనల్లో నవ్య 21-8, 21-13తో నిసా టనివా(ఇండోనేసియా)పై గెలిచింది. ఇదే విభాగం బాలికల డబుల్స్ టైటిల్‌పోరులో నవ్య-శ్రియాన్షీ వల్లి ద్వయం 21-18, 17-21, 21-16తో (థాయ్‌లాండ్) సుకిట్టా సువాచై- నరాడ ఉడొర్న్‌పిమ్ జోడీని ఓడించింది. ఈ సందర్భంగా నవ్యను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి అభినందించారు.





## రూట్ శతకం.. ఇంగ్లండ్ 269/5

హామిల్టన్: జో రూట్ (114 బ్యాటింగ్), రోరీ బర్న్స్ (101) శతకాలతో రాణించినా.. అనూహ్యంగా వికెట్లు చేజార్చుకోవడంతో న్యూజిలాండ్‌తో రెండో టెస్ట్‌లో పర్యాటక ఇంగ్లండ్ ఇబ్బందుల్లో పడింది. ఓవర్‌నైట్ స్కోరు 39/2తో మూడో రోజు ఆటను కొసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 269/5 స్కోరు చేసింది. ఆదివారం ఆటముగిసే సమయానికి రూట్‌తోపాటు ఒల్లీ పోప్ (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 375 పరుగులకు ఇంగ్లండ్ ఇంకా 106 పరుగుల దూరంలో ఉంది. రూట్, బర్న్స్ మూడో వికెట్‌కు 177 పరుగుల భాగస్వామ్యంతో ఇంగ్లండ్‌ను పటిష్ట స్థితిలో నిలబెట్టారు. కానీ బర్న్స్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన బెన్ స్టోక్స్ (26), జాక్ క్రాలీ (1) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో పరిస్థితి మారిపోయింది. అయితే, వర్షం కారణంగా 16 ఓవర్ల ముందే ఆటను నిలిపివేశారు.

## 'ముస్తాక్' విజేత కర్ణాటక



ఉత్కంఠ ఫైనల్లో తమిళనాడుపై పరుగు తేడాతో విజయం

సూరత్: మనీష్ పాండే (45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 60 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో రాణించడంతో.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని కర్ణాటక ఎగరేసుకు పోయింది. ఆదివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో కర్ణాటక ఒక్క పరుగు తేడాతో తమిళనాడును ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక నిర్ణీత 20 ఓవర్లలో 180/5 స్కోరు చేసింది. రోహన్ కదమ్ (35), దేవ్‌దత్త (32) తగిన సహకారం అందించారు. రవిచంద్రన్ అశ్విన్ (2/34), మురుగన్ అశ్విన్ (2/33) చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో తమిళనాడు ఓవర్లన్నీ ఆడి 179/6 స్కోరు చేసింది. రోనిత్ మోర్ (2/32) రెండు వికెట్లు దక్కాయి. ఒక దశలో 80/4తో పీకల్లోతు కష్టాల్లో పడిన తమిళనాడును బాబా అపరాజిత్ (40), విజయ శంకర్ (44) ఆదుకున్నారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యంతో విజయంపై ఆశలు రేపారు. కానీ, చివరి 18 బంతుల్లో 30 పరుగులు కావాల్సిన సమయంలో అపరాజిత్ అవుటైనా.. శంకర్ వరుసగా షాట్లు ఆడుతూ తమిళనాడును విజయానికి చేరువ చేశాడు. కీలక సమయంలో శంకర్ రనౌట్ అయ్యాడు. చివరి బంతికి 3 పరుగులు కావాల్సిన సమయంలో తమిళనాడు ఒక్క రన్ మాత్రమే చేసి ఓడింది.

### ఈ టోర్నీపై బుకీల కన్ను!

సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లోనూ ఓ ఆటగాడిని బుకీ సంప్రదించినట్టు బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తెలిపాడు. అయితే ఆ క్రికెటర్ ఎవరనేది తనకు తెలీదని, వెంటనే అతడు బోర్డు అవినీతి నిరోధక యూనిట్‌కు ఫిర్యాదు చేసినట్టు చెప్పాడు. అయితే బుకీలు సంప్రదించడం మామూలే అయినా ఆతర్వాత ఆటగాళ్లు ఏం చేస్తారనేదే పెద్ద సమస్యగా మారిందని దాదా ఆందోళన వ్యక్తం చేశాడు. ఇటీవల కర్ణాటక, తమిళనాడు ప్రీమియర్ లీగ్‌ల్లో ఫిక్సింగ్ జాడ్యం వెలుగు చూసింది. అయితే ఈ సమస్య కారణంగా ఆయా టోర్నీలను నిలిపేయడం సాధ్యం కాదని స్పష్టం చేశాడు.

## ఆ రికార్డు రోహిత్‌కే సాధ్యం





అడిలైడ్: టెస్ట్‌ల్లో బ్రియాన్ లారా నెలకొల్పిన అజేయ 400 పరుగుల రికార్డును అధిగమించే సత్తా టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మకు ఉందని వార్నర్ అన్నాడు. పాక్‌తో డే/నైట్ టెస్ట్‌లో వార్నర్ (335) అజేయ ట్రిపుల్ సెంచరీతో చెలరేగాడు. అయితే, లారా రికార్డుకు 65 పరుగుల దూరంలో ఉండగా ఆసీస్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడంతో వార్నర్‌కు నిరాశ తప్పలేదు. కానీ, తాను లారా రికార్డును అధిగమించలేకపోయినా.. భవిష్యత్తులో రోహిత్ 400 పరుగుల మార్క్‌ను దాటే అవకాశం ఉందని డేవిడ్ చెప్పాడు.



## హామిల్టన్‌దే 'అబుదాబి'

అబుదాబి: ఫార్ములావన్ ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ సీజన్ చివరి రేసులోనూ సత్తాచాటాడు. ఆదివారం జరిగిన అబుదాబి గ్రాండ్ ప్రీలో మెర్సిడెస్ డ్రైవర్ హామిల్టన్ విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో 11వ విజయాన్ని అందుకున్న 34 ఏళ్ల హామిల్టన్‌కు ఇది కెరీర్‌లో 84వ టైటిల్.

## గోవాతో కేరళ మ్యాచ్ డ్రా

కొచ్చి: ఆట చివరి నిమిషంలో గోవా స్టార్ స్ట్రయికర్ రోడ్రిగ్స్ చేసిన మాయజాలంతో ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో కేరళ గెలిచే మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆదివారం ఈ రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 2-2తో ఫలితం తేలకుండా డ్రా అయింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.